www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHI

మంగళవారం | 15-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) :23 సంచిక (Issue) :16 | వరంగల్

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, బహుళ పక్షం; తిథి: విదియ ఉ.10:56 తదుపరి తదియ; నక్షత్రం: విశాఖ తె.3:10 అనూరాధ; వర్జ్యం: ఉ.6:30-8:18; దుర్ముహూర్తం: ఉ.8:31-9:21, రా.10:15-రా.10:59; అమృతఘడియలు: సా.5:17-7:04; రాహుకాలం: మ.3:00-4:30; సూర్యోదయం: 6:02, సూర్యాస్తమయం: 6:27

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## బెల్జియంలో మెహుల్ ఛోక్సీ అరెస్టు



పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.14 వేల కోట్ల మేర కుచ్చుటోపీ

నీరవ్ మోదీ సహా ఛోక్సీపై కేసు.. 2018లో విదేశాలకు పరారీ

లండన్ జైలులో నీరవ్ మోదీ.. ఏడాదిగా బెల్జియంలోనే ఛోక్సీ

బ్లడ్ క్యాన్సర్‌కు చికిత్స!.. ఏడాది క్రితమే బెల్జియం పోలీసులకు భారత దర్యాప్తు సంస్థల సమాచారం

స్విట్జర్లాండ్‌కు పారిపోయే క్రమంలో అరెస్టు 2

ఛోక్సీని వెనక్కి రప్పిస్తాం: కేంద్రం

# దుబాయిలో ఇద్దరు తెలంగాణవాసుల హత్య




మృతుడు అష్టపు ప్రేమ్‌సాగర్ పాస్‌పోర్టు

వారిని నరికిచంపిన పాకిస్థానీ.. మరో ఇద్దరిపైనా దాడి

విద్వేషంతోనే హత్య?.. చంపిన తర్వాత మత నినాదాలు

అందరూ స్థానికంగా పేరొందిన బేకరీలో సహోద్యోగులు

మృతుల్లో ఒకరిది నిర్మల్.. మరొకరిది నిజామాబాద్ జిల్లా

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దుబాయిలో ఇద్దరు తెలంగాణవాసులను ఒక పాకిస్థానీ దారుణంగా నరికి చంపాడు. మరో ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు! కిందటి శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుల్లో ఒకరు నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్‌సాగర్ (40) కాగా, మరొకరు నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీనివాస్ అని.. గాయపడ్డ ఇద్దరూ కూడా తెలుగువారేనని తోటి ఉద్యోగులు చెప్పారు. మృతులు, గాయపడ్డ ఇద్దరు, ఈ ఘోరానికి పాల్పడిన పాకిస్థానీ... అందరూ దుబాయిలోని ఒక ప్రఖ్యాత బేకరీలో పని చేస్తున్నారు. పని ఒత్తిడి, ఇతర కారణాలకు మతవిద్వేషం కూడా తోడవడంతోనే దుండగుడు ఈ దారుణానికి పాల్పడ్డాడని.. వారిని చంపిన తర్వాత అతడు మతపరమైన నినాదాలు చేశాడని తెలుస్తోంది. బేకరీ యాజమాన్యం ఈ దారుణానికి సంబంధించి ఎలాంటి సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతోంది. విషయం ఏ మాత్రం బయటకు తెలిసినా ఉద్యోగాల్లోంచి తీసేస్తామని యాజమాన్యం హెచ్చరించడంతో ఉద్యోగులు భయపడుతున్నారని తెలిసింది. అక్కడ పనిచేస్తున్నవారిలో ఎక్కువమంది తెలంగాణకు చెందినవారేనని సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

---

మే మొదటి వారంలో

## కలెక్టర్ల బదిలీలు?

ఈసారి పెద్దసంఖ్యలో ఉండే అవకాశం 13

పథకాలపై ప్రజల్లోకి ప్రజాప్రతినిధులు

జూన్ 2 వరకు విస్తృతంగా కార్యక్రమాలు

నేటి సీఎల్పీ సమావేశంలో సీఎం దిశానిర్దేశం



భూ భారతి పోర్టల్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్. చిత్రంలో భట్టి, పొంగులేటి, ప్రసాద్‌కుమార్, గుత్తా

## భూ భారతి

# రైతుల చుట్టం

### చెప్పినట్లే బంగాళా ఖాతంలోకి ధరణి పీడకల

భూ వివాదాలు లేని తెలంగాణే మా లక్ష్యం

గత సర్కార్ రెవెన్యూ సిబ్బందిని దొంగలుగా చూపింది

చట్టాల్ని చుట్టంగా మార్చి వేల ఎకరాలు కొల్లగొట్టారు

రైతులు అన్నం పెట్టి, గౌరవించేలా సమస్యల్ని తీర్చండి

రెవెన్యూ సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు

నా జన్మ ధన్యమైంది: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

13 రైతులకు అర్థమయ్యే భాషలో చెప్పండి

భూ భారతిని సమర్థంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లండి

మండల స్థాయి సదస్సులకు మీరు వెళ్లాల్సిందే

జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ దిశానిర్దేశం

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత రెవెన్యూ చట్టాలను మార్చారని, ధరణి పీడకలగా మారిందని, అందుకే, రైతుల సమస్యలు పరిష్కరించే చుట్టంలా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని, తర్వాత ప్రతి జిల్లాలోని ఒక మండలంలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. చివరకు, భూముల వివాదాలు లేని తెలంగాణ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వివరించారు. తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్- 2025 (భూ భారతి)' చట్టాన్ని సోమవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. "తెలంగాణలో ధరణి పీడకలగా మారింది. తహసీల్దార్‌ను తగులపెట్టే స్థాయికి, ఇబ్రహీంపట్నంలో జంట హత్యలకు కారణమైంది. సిరిసిల్లలో ఒక మహిళ అధికారుల చుట్టూ తిరిగినా.. తహసీల్దార్ స్థాయిలో

మిగతా 13వ పేజీలో...

### ముంగిట్లో పరిష్కారం

అక్రమంగా పట్టా అయిన ప్రభుత్వ, వక్ఫ్, దేవాదాయ, భూదాన్ భూములకు మోక్షం

హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు చాన్స్

పాస్ పుస్తకాల్లో భూమి పటం

మ్యుటేషన్‌కు ఎకరానికి రూ.2,500, సవరణలకు రూ.1,000

భూ భారతి నిబంధనలతో ఉత్తర్వులు 13

### కార్మికులకు కానుక!

మే డే నుంచి గిగ్ వర్కర్ల భద్రత చట్టం

ముసాయిదాపై అభిప్రాయం సేకరించండి

దేశానికే మార్గదర్శకంగా ఉండాలి: సీఎం

ప్రజావాణి అర్జీల తీరును పరిశీలిస్తా

డ్యాష్ బోర్డు లైవ్ యాక్సెస్ నాకు ఇవ్వండి

జిల్లాల్లో ప్రజావాణి డ్యాష్‌బోర్డును రాష్ట్ర డ్యాష్‌బోర్డుతో లింకు చేయండి: రేవంత్

అంబేడ్కర్ జయంతి సాక్షిగా

# వర్గీకరణ అమల్లోకి..

4 ఉత్తర్వులు విడుదల చేసిన సర్కారు

ఇక అన్ని ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీకి వర్గీకరణ ప్రకారమే ఎస్సీ రిజర్వేషన్లు

2-3 వారాల్లో వేల సంఖ్యలో ఉద్యోగాలకు నోటిఫికేషన్లు!

పరీక్షలకు సిద్ధం కండి

యువతకు మంత్రి దామోదర పిలుపు

ఆయనకు మాదిగ, ఉపకులాల సంఘాల నేతల కృతజ్ఞతలు



మంత్రి దామోదరకు మిఠాయి తినిపిస్తున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి సాక్షిగా.. ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం పచ్చ జెండా ఊపింది. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన 9 నెలల కాలంలోనే ఆ ప్రక్రియను చేపట్టి, అసెంబ్లీలో తీర్మానం చేసి, దానికి చట్టబద్ధత కూడా కల్పించిన రాష్ట్ర సర్కారు.. వర్గీకరణ అమలుకు నాలుగు ఉత్తర్వులను సోమవారం విడుదల చేసింది. వాటిలో న్యాయశాఖ జీవో ఎం.ఎస్ నంబరు 33ను విడుదల చేయగా.. ఎస్సీ సంక్షేమ శాఖ జీవో ఎం.ఎస్ 9, 10, 99 నంబర్లతో మూడు ఉత్తర్వులను విడుదల చేసింది. వర్గాల వారీగా కేటాయించిన రిజర్వేషన్ల అమలు విధానం ఎలా ఉంటుంది, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలు విధానం సహా పలు అంశాలను వాటిలో సవివరంగా వెల్లడించింది. ఉద్యోగ భర్తీల్లో రోస్టర్ పాయింట్ల కేటాయింపును కూడా పొందుపరిచింది. ఇక నుంచి ప్రభుత్వం ప్రకటించబోయే అన్ని ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీలకూ వర్గీకరణ ప్రకారం కేటాయించిన రిజర్వేషన్లు ఎస్సీలకు వర్తిస్తాయని పేర్కొంది. అంటే.. రాష్ట్రంలో ఇప్పటివరకూ ఎస్సీలకు గంపగుత్తగా అమలైన 15శాతం రిజర్వేషన్లు

మిగతా 12వ పేజీలో...

### ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ

వర్గీకరణపై మాట్లాడిన పార్టీలన్నీ తీర్మానాలకే పరిమితం అయ్యాయి 12

మీడియాతో ఉత్తమ్, దామోదర, పొన్నం

## వక్ఫ్ సవరణ చట్టానికి నో

తెలంగాణలో అమలు చేయరాదని సర్కారు నిర్ణయం

ముస్లిం నేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చ

17న ప్రకటించనున్న పీసీసీ అధ్యక్షుడు 12

---

### పైసలిస్తం.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టమంటున్నారు

అవసరమైతే ఎమ్మెల్యేలను కొనమంటున్నారు



బిల్డర్లు, పారిశ్రామిక వేత్తలు ఖర్చు భరిస్తామంటున్నారు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

తొగుట, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన బిల్డర్లు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాన్ని పడగొట్టాలంటున్నారని చెప్పారు. అవసరమైతే ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని, ఖర్చును తాము భరిస్తామంటున్నారని తెలిపారు. పిల్లల నుంచి పెద్దల దాకా అందరూ కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని, ఆ పార్టీ తమ దరిదాపుల్లో కూడా లేదని అన్నారు. రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. సిద్దిపేట జిల్లా తొగుట మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ప్రభాకర్ రెడ్డి ప్రసంగించారు. రాజకీయాల్లోకి వచ్చాక సిన్సియర్‌గా ఉంటే కుదరడం లేదని, దురుసుగా ఉంటే ఎలా ఉంటుందో చూపిస్తానని చెప్పారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు దుబ్బాక నుంచి భారీగా కార్యకర్తలను తరలిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ పాలిస్తున్న తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రజల పట్ల ఆ పార్టీ విశ్వాసఘాతుకానికి పాల్పడుతోంది. ఆ రాష్ట్రాల్లో అభివృద్ధిని, సంక్షేమాన్ని అటకెక్కించింది.

- ప్రధాని నరేంద్ర మోదీ



## తెలంగాణలో అడవులపైకి బుల్డోజర్లు

వన్యప్రాణులను ప్రమాదంలో పడేయడం, పర్యావరణ విధ్వంసమే కాంగ్రెస్ శైలి

కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై పరోక్షంగా ప్రధాని మోదీ ఆరోపణలు

ముస్లింలపై మీకంత ప్రేమ ఉంటే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని చేయండి

వక్ఫ్ చట్టంతో పేద ముస్లింలకు లబ్ధి

2013 నాటి యూపీఏ చట్టంతో భూమాఫియాకే లాభమని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం తీరును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తప్పుపట్టారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచి, అడవులపై బుల్డోజర్లను నడిపిస్తోందని ఆరోపించారు. ప్రకృతికి నష్టం చేస్తోందని విమర్శించారు. ప్రధాని మోదీ సోమవారం హరియాణాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా యమునానగర్‌లో నిర్వహించిన

మిగతా 10వ పేజీలో...

### అవి ప్రభుత్వ భూములే

- ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ రికార్డుల్లోనే కంచ గచ్చిబౌలి భూమి
- అడవి అయి ఉంటే అటవీ శాఖ పరిధిలోనే ఉండేది 10
- బీడుగా ఉండడంతోనే చెట్లు పెరిగి అడవిలా కనిపిస్తోంది
- సుప్రీంలో రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు.. రేపు విచారణ

'ఆటో' సుంకాల

## తాత్కాలిక నిలిపివేత!

సంకేతాలిచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

తమ కార్ల కంపెనీలకు ఊరటనిచ్చేందుకే..

సుంకాల నుంచి ఎవరూ తప్పించుకోలేరు



చైనా నుంచి వచ్చే ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఫోన్లపై 20% సుంకాలు కొనసాగుతాయ్

అమెరికాకు చైనా భారీ ఝలక్

అరుదైన లోహాల ఎగుమతులు నిలిపివేత

వాషింగ్టన్, ఏప్రిల్ 14: తాను విధించిన ప్రతీకార సుంకాల నుంచి ఆటోమొబైల్ రంగాన్ని తాత్కాలికంగా మినహాయించే ఆలోచనలో ఉన్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. కార్ల తయారీ కంపెనీలు తమ సప్లై చైన్లను సరిచేసుకోవడానికి కావలసిన సమయం ఇచ్చేందుకే ఈ దిశగా ఆలోచిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. "కెనడా, మెక్సికో, ఇతర దేశాల నుంచి తమ ఉత్పత్తిని (అమెరికాకు) తరలించడానికి వారికి కొంత సమయం కావాలి. వారు వాటిని ఇక్కడే తయారుచేయబోతున్నారు" అని ట్రంప్ సోమవారం వైట్‌హౌస్‌లో మీడియా సమావేశంలో చెప్పారు. అమెరికాకు దిగుమతి చేసుకునే విదేశీ కార్లు, ఆటో విడిభాగాలపై 25 శాతం

మిగతా 2వ పేజీలో...

### కొత్త జంటలకు వీసా.. అగ్ని పరీక్ష!

అమెరికా వెళ్లడం ఈజీ కాదు

అమెరికన్‌ను పెళ్లాడినా అక్కడికెళ్లడం కష్టమే! 2

ముగిసిన 'బైడెన్' వెసులుబాట్లు

ట్రంప్ నేతృత్వంలో వీసాలకు కఠిన టెస్ట్.. నిశిత పరిశీలన

ట్రంప్‌ను హత్య చేస్తా.. డబ్బులివ్వండి

అమెరికాలో తల్లిదండ్రులను అడిగిన 17 ఏళ్ల బాలుడు

ఇవ్వకపోవడంతో వారి హత్య

కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ

## కుంపటి!

అరడజను ఖాళీలకు డజన్లకొద్దీ ఆశావహులు

హామీలు.. సామాజిక, ప్రాంతీయ న్యాయం కోసం అధిష్ఠానంపై ఒత్తిళ్లు

విస్తరణ వాయిదాతో నాయకుల్లో అసంతృప్తి

సామాజిక న్యాయం అడ్డొస్తే..

ఎమ్మెల్యే పదవికి రాజీనామా: మల్‌రెడ్డి

జానారెడ్డిపై నెపం వేసిన కోమటిరెడ్డి

మంత్రి పదవి రాకపోతే దేనికైనా సిద్ధమే

నా గొంతు కోసేందుకు ఓ కుటుంబం యత్నం: ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు

రేవంత్ ఆహ్వానిస్తేనే వచ్చానన్న వివేక్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ కుంపటి రాజుకుంటోంది! రాష్ట్ర క్యాబినెట్‌లో అరడజను ఖాళీలుండగా.. ఆశావహులు డజన్లలో ఉండడంతో.. రాజకీయవాతావరణం హీటెక్కిపోతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నేతలకు ఇచ్చిన ముందస్తు హామీలు, సామాజిక, ప్రాంతీయ న్యాయం కోసం వస్తున్న ఒత్తిళ్ల నేపథ్యంలో.. కాంగ్రెస్ అధిష్ఠానం వాయిదా మంత్రాన్ని పాటిస్తోంది. ఇప్పటికే జాతీయ స్థాయిలో అనేక సమస్యలతో సతమతమవుతున్న అధిష్ఠానానికి తెలంగాణ క్యాబినెట్ విస్తరణ శిరోభారాన్ని తెచ్చిపెడుతోందనే

మిగతా 14వ పేజీలో...

---

### రూ. 1,800 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

గుజరాత్ తీరంలో ఐసీజీ-ఏటీఎస్ బృందాల ఆపరేషన్ 2

సముద్రంలో పడేసి పారిపోయిన స్మగ్లర్లు

### అకాల.. కలవరం

అనూహ్యంగా మారుతున్న వాతావరణం.. 14

మండే ఎండలు.. పిడుగుల వాన.. తీవ్రంగా నష్టపోతున్న రైతులు

నౌకాస్టుతో అప్రమత్తం చేసేందుకు వాతావరణ శాఖ యత్నం

గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో మార్చిలోనే మే నెల స్థాయిలో ఎండలు

వచ్చే నెలలో 50 డిగ్రీలు నమోదుకావచ్చని అంచనాలు



### పొద్దంతా ఎండ.. సాయంత్రం వాన!

జగిత్యాల జిల్లా గోదూర్‌లో 43.4 డిగ్రీలు

పలు జిల్లాల్లో వర్షాలతో దెబ్బతిన్న పంట

రాష్ట్రంలో నేడు, రేపు పలుచోట్ల వర్షాలు

ఎండల తీవ్రతపై అధికారుల హెచ్చరికలు 14

### కట్టుడు.. కూలుడేనా?

నిర్మాణంలో నాణ్యత పాటించరా? 12

సీతారామ ప్రాజెక్టులోని సూపర్ పాసేజ్ పిల్లర్ కూలిపోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి మండిపాటు

మార్చిలోనే ప్రాజెక్టు ట్రయల్ రన్.. అప్పుడే కూలిన పిల్లర్

2019లోనే దీని నిర్మాణం.. పనుల్లో నాణ్యతాలోపం

# 'ఆటో' సుంకాల తాత్కాలిక నిలిపివేత!

(మొదటి పేజీ తరువాయి)



సుంకం విధిస్తున్నట్టు ట్రంప్ మార్చి 27న ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆరోజు ఆయన.. దాన్ని శాశ్వత సుంకంగా పేర్కొన్నారు. కానీ, ఇప్పుడు వాటి విషయంలో పునరాలోచిస్తుండడం గమనార్హం. కాగా.. ప్రతీకార సుంకాల విధింపు విషయంలో ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. మరీ ముఖ్యంగా చైనాను అస్సలు మినహాయించబోమని ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. అమెరికాతో అసమతౌల్య వాణిజ్య బంధాలను నడిపే దేశాలు, ఆర్థికేతర అడ్డంకులు సృష్టించే దేశాలు ప్రతీకార సుంకాల బారి నుంచి తప్పించుకోలేవని తేల్చిచెప్పారు. ఒక్క చైనా మినహా మిగతా అన్ని దేశాలపైనా తాము విధించిన ప్రతీకార సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తున్నామని.. అప్పటిదాకా ఆయా దేశాల ఉత్పత్తులపై 10 శాతం సుంకాలే ఉంటాయని ట్రంప్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. చైనాపై సుంకాల విధింపు కొనసాగితే యాపిల్ ఫోన్ల ధరలు పెరిగిపోతాయని అమెరికా ప్రజలు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో.. ఆ 10 శాతం సుంకాల నుంచి కూడా స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను మినహాయిస్తున్నట్టు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం కిందటి శుక్రవారం ఒక ప్రకటన చేసింది. ఈ ఉత్పత్తులు చైనా నుంచి వచ్చినా సరే, సుంకాల నుంచి మినహాయింపు ఉంటుందని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే.. స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాలకు సంబంధించి కిందటి శుక్రవారం తాము ప్రకటించింది పూర్తి మినహాయింపు కాదని ట్రంప్ స్పష్టం చేశారు. 145 శాతం సుంకాలకు బదులుగా.. చైనాపై విధించిన 20% ఫెంటనిల్ సుంకాలు అమలవుతాయని, ఆయా ఉత్పత్తులు ఇప్పుడు ప్రత్యేక సుంకాల జాబితాలోకి మాత్రమే మారాయని వివరణ ఇస్తూ తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్'లో ఆయన ఒక పోస్టు పెట్టారు. అమెరికాలో సెమీకండక్టర్ రంగం, ఎలక్ట్రానిక్స్ సప్లై చైన్‌పై జాతీయస్థాయిలో దర్యాప్తు (నేషనల్ సెక్యూరిటీ ట్రేడ్ ఇన్వెస్టిగేషన్) ప్రారంభిస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. యూఎస్ తన ఉత్పత్తులను తానే తయారుచేసుకోవాలని వ్యాఖ్యానించిన ఆయన.. ఇతర దేశాలకు.. ముఖ్యంగా వాణిజ్యపరంగా ప్రతికూలమైన చైనా వంటి దేశాలకు అమెరికా ఎప్పటికీ బందీగా ఉండబోదని తేల్చిచెప్పారు. అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ కూడా ఈ అంశంపై మాట్లాడారు. చైనా నుంచి అమెరికాకు వచ్చే క్రిటికల్ టెక్నాలజీ ఉత్పత్తులపైన, సెమీకండక్టర్లపైన వచ్చే రెండు నెలల్లో మరిన్ని సుంకాలు విధించనున్నట్టు ఆయన వెల్లడించారు. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై 1-2 నెలల్లో ట్రంప్ కొత్త సుంకాలు విధిస్తారని ఆయన తెలిపారు.

### ఇప్పుడేం చేద్దాం?

యూరోపియన్ యూనియన్‌పై విధించిన సుంకాలను ఎత్తేయాలంటే.. తమ వద్ద 350 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.30 లక్షల కోట్లు) ఇంధనం కొనుగోలు చేయాలంటూ ట్రంప్ ఏప్రిల్ 8న తేల్చిచెప్పడంతో ఈయూ సందిగ్ధంలో పడింది. ఉక్రెయిన్‌పై దాడికి దిగిన రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను తగ్గించేసిన యూరప్ దేశాలు.. 2022-23 నుంచి అమెరికా ఇంధనంపై ఆధారపడ్డాయి. ఇప్పుడు ట్రంప్ దాన్ని వాణిజ్య బేరసారాలకు వాడుకునే ప్రయత్నం చేస్తుండడంతో ఆ దేశాలన్నీ మళ్లీ రష్యా వైపు చూస్తున్నట్టు సమాచారం. ఉక్రెయిన్‌లో కొంతమేర శాంతి వాతావరణం నెలకొంటే తాము మళ్లీ రష్యా నుంచి ఏటా 60 నుంచి 70 బిలియన్ క్యూబిక్ మీటర్ల ఇంధనం కొనుగోలు చేయొచ్చని ఫ్రాన్స్‌కు చెందిన బహుళజాతి సంస్థ 'ఇంజీ' ఉపాధ్యక్షుడు డిడియెర్ హోలా అభిప్రాయపడ్డారు. యుద్ధానికి ముందు.. రష్యా నుంచి యూరప్ దేశాలు ఏటా 150 బిలియన్ క్యూబిక్ మీటర్ల ఇంధనాన్ని కొనుగోలు చేసేవి.

# కర్ణాటకలో కులగణన రచ్చ

**ముస్లింలకు 8% రిజర్వేషన్లు?..ఓబీసీలకు 52 శాతానికి పెంపు**

బెంగళూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కులగణన నివేదికలోని వివరాలు బయటికి రావడంతో కర్ణాటకలోని ఆధిపత్య కులాలు రగిలిపోతున్నాయి. నివేదికలోని సిఫారసుల మేరకు ప్రస్తుతం 4 శాతంగా ఉన్న ముస్లిం రిజర్వేషన్లు 8 శాతానికి పెరిగే అవకాశం ఉంది. అలాగే, బీసీలకు ప్రస్తుతం ఉన్న 32శాతం రిజర్వేషన్లు 52 శాతానికి పెరగనున్నట్టు తెలుస్తోంది. ఎస్సీలకు 17శాతం, ఎస్టీలకు 7శాతంతో కలిపి మొత్తం రిజర్వేషన్లను 76 శాతానికి చేర్చాలని నివేదికలో సిఫారసులు ఉన్నాయి. మిగిలిన సామాజికవర్గాలకు రిజర్వేషన్లలో మార్పులు ఉండకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2015లో అప్పట్లో సీఎంగా ఉన్న సిద్దరామయ్య కులగణన సర్వే చేయించారు. ఆయన అధికారంలో ఉన్న 2018 నాటికే సర్వే పూర్తయింది. బీసీ కమిషన్ చైర్మన్ జయప్రకాశ్‌హెగ్డే నేతృత్వంలో 2024 ఫిబ్రవరిలో ప్రభుత్వానికి ఆ నివేదికను అప్పగించారు. ఆ నివేదికలో రిజర్వేషన్ల శాతం పెంపు అంశాన్ని పొందుపరిచినట్లు సమాచారం. కులగణన నివేదికను మంత్రివర్గం శుక్రవారం స్వీకరించింది. అదే రోజున సీల్డ్ కవర్‌ను తెరిచారు. నివేదిక కాపీలను మంత్రులందరికీ అందజేశారు. ఈ నెల 17లోగా మంత్రులు సమగ్ర అధ్యయనం చేసి, నివేదికపై తీర్మానం చేయాల్సి ఉంది. గురువారం నిర్వహించే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. నివేదిక ప్రకారం కర్ణాటకలో వెనుకబడిన కులాల జనాభా 69.60 శాతానికి చేరింది. అయితే, రాష్ట్రంలో బలమైన సామాజికవర్గం వీరశైవలింగాయతలు కులగణన నివేదికను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆ నివేదికను చెత్తబుట్టలో పడేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్‌డీఏను వీడిన రాష్ట్రీయ లోక్ జనశక్తి

పట్నా, ఏప్రిల్ 14: ఎన్‌డీఏ కూటమి నుంచి బిహార్‌కు చెందిన రాష్ట్రీయ లోక్‌జనశక్తి పార్టీ (ఆర్‌ఎల్‌జేపీ) బయటకు వచ్చింది. ఆ విషయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు పశుపతి కుమార్ పరస్ సోమవారం ప్రకటించారు. లోక్ జనశక్తి పార్టీ వ్యవస్థాపకుడు దివంగత రాంవిలాస్ పాసవాన్ సోదరుడైన పశుపతి పరస్ 2021లో పార్టీని చీల్చి ఆర్‌ఎల్‌జేపీని ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి పదవిని కూడా చేపట్టారు. గత లోక్‌సభ ఎన్నికల్లో సోదరుడి కుమారుడైన చిరాగ్ పాసవాన్ పార్టీకి పొత్తులో భాగంగా ఎన్‌డీఏ కూటమి అయిదు సీట్లు కేటాయించడంతో కినుక వహించి మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆర్‌ఎల్‌జేపీ కార్యాలయంగా ఉన్న ప్రభుత్వ బంగాళాను బిహార్ ప్రభుత్వం ఖాళీ చేయించి, దాన్ని చిరాగ్ పార్టీకి కేటాయించింది. ఈ కారణాల నేపథ్యంలో ఎన్‌డీఏను వీడారు. తమది దళితుల పార్టీ కావడం వల్లనే గుర్తింపు ఇవ్వడం లేదని పశుపతి విమర్శించారు.

# బూట్లు ఇచ్చి 14 ఏళ్ల శపథాన్ని విరమింపజేసిన మోదీ

యమునానగర్, ఏప్రిల్ 14: హరియాణాలోని కైథాల్‌కు చెందిన రాంపాల్ కాశ్యప్ 14 ఏళ్ల క్రితం చేసిన ప్రతిజ్ఞను ప్రధాని మోదీ విరమింపజేశారు. ఆయనకు బూట్లు బహూకరించి ప్రతిజ్ఞను ఉపసంహరింపజేశారు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యే వరకు, తాను ఆయనను కలిసే వరకు చెప్పులు వేసుకోనని రాంపాల్ శపథం చేశారు. యమునానగర్‌లో సోమవారం జరిగిన బహిరంగ సభలో ప్రధానిని కలిసే అవకాశం రాంపాల్‌కు వచ్చింది. ఆయనకు బూట్లు బహూకరించిన ప్రధాని వాటిని ధరించాలని కోరారు. మరోసారి ఇలాంటి శపథాలు చేయకూడదని హితవు చెప్పారు. రాంపాల్ అభిమానానికి వినమ్రుడయ్యానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.



# కొత్త జంటలకు వీసా.. అగ్ని పరీక్ష!



## అమెరికాకు వెళ్లడం అంత ఈజీ కాదు

- అగ్రరాజ్యం వ్యక్తిని పెళ్లాడినా అక్కడకు చేరేందుకు సంవత్సరాలు పట్టే అవకాశం
- ముగిసిన బైడెన్ పాలన వెసులుబాట్లు
- ట్రంప్ నేతృత్వంలో వీసాలకు కఠిన పరీక్ష

వాషింగ్టన్, ఏప్రిల్ 14: "మా అమ్మాయికి అమెరికా సంబంధం ఖాయం చేసుకున్నాం." అని మురిసిపోయే రోజులు పోయాయ్!. పెళ్లయిన వెంటనే కొత్త దంపతులను సంతోషంగా అగ్రరాజ్యానికి పంపించి ఆనందించే పరిస్థితి కూడా కనుమరుగైంది. కొత్త జంటకు గత అధ్యక్షుడు జో బైడెన్ హయాంలో కొనసాగిన స్వల్ప పరిశీలనలు, తేలిగ్గా ఉండే ఇంటర్వ్యూలు, వెనువెంటనే ఇచ్చే అనుమతులకు కాలం చెల్లింది. ఇప్పుడంతా ట్రంప్ హయాం. వలసలపై ఉక్కుపాదం మోపుతున్న కొత్త అధ్యక్షుడు నూతన జంటల విషయంలోనూ అదే పంథాను అనుసరిస్తున్నారు. దీంతో అమెరికా పౌరుడు లేదా పౌరురాలిని వివాహం చేసుకున్న వారు.. అక్కడకు చేరుకోవాలంటే.. నెలలు కాదు, ఏకంగా ఏళ్లు పట్టే పరిస్థితి ఏర్పడింది. అది కూడా.. అనేక శల్య పరీక్షలు, ఇంటర్వ్యూలూ దాటుకుని విజయం దక్కించుకుంటేనే అంటున్నారు అధికారులు.

### ఏం జరిగింది?

అమెరికాలో అక్రమ వలసలు పెరిగిపోయాయని చెబుతున్న ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్.. అలాంటివారిని బలవంతంగా ఇంటికి పంపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 'పెళ్లి' పేరుతో కూడా ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయా? అని ఆరా తీశారు. అదేసమయంలో పెళ్లి చేసుకుని అగ్రరాజ్యానికి వస్తామన్న వారిని అన్ని కోణాల్లోనూ పరిశీలించాలని, ఇంటర్వ్యూలను కఠినతరం చేయాలని ఆదేశించారు. వాస్తవానికి ఈ విషయంలో గత అధ్యక్షుడు బైడెన్ సులభతర విధానం ప్రవేశ పెట్టినప్పటికీ ఆ గడువు ముగిసిపోయింది. దీంతో ట్రంప్ ఆదేశాలు అమల్లోకి వచ్చాయి. అమెరికా పౌరుడు, లేదా పౌరురాలిని వివాహం చేసుకున్న వారు.. ఇంటర్వ్యూను సమర్థంగా ఎదుర్కొనేందుకు కొన్ని కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. వాటిని ఆధారంగా సమర్పిస్తే అధికారులు సాధ్యమైనంత వేగంగా అనుమతి ఇచ్చే అవకాశం ఉంది. వీటిలో 1) పెళ్లికి సంబంధించిన డాక్యుమెంట్ 2) వివాహ ఖర్చుల రికార్డు 3) అదేవిధంగా ఇరుపక్షాల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలకు సంబంధించిన కాల్ లాగ్స్ 4) జీవిత భాగస్వామి పేర తీసుకున్న బీమా వంటివి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

### మీ బాత్రూంలో కిటికీలెన్ని?

కొత్త జంటల ఇంటర్వ్యూలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడిగే అవకాశం ఉన్న ప్రశ్నలను నిపుణులు ఉదహరించారు. బెడ్‌పై మీరు ఏవైపు నిద్రిస్తారు?. ముందుగా ఎవరు నిద్రలేస్తారు?. మీ బాత్‌రూంలో ఎన్ని కిటికీలు ఉన్నాయి?. మీ జీవిత భాగస్వామికి ఫుడ్ అలెర్జీ ఉందా? వంటి ప్రశ్నలు కూడా ఎదరవుతాయని ఇమ్మిగ్రేషన్ అటార్నీ శర్మ తెలిపారు.

### ఎవరెవరికి ఎంతెంత సమయం?

- అమెరికా పౌరులు తమ జీవిత భాగస్వాములకు స్పాన్సర్ చేసే వీసాల కోసం 'ఫాం ఐ-130' అనుమతి పొందడానికి 14 నెలల సమయం పడుతుంది. ఆ తర్వాత 3-4 నెలలకు ఇంటర్వ్యూలు జరుగుతాయి.
- గ్రీన్ కార్డు దారులు జీవిత భాగస్వాములకు స్పాన్సర్ చేసే వీసా.. 'ఎఫ్2ఏ'కు చాలా జాప్యం జరుగుతోంది. ప్రస్తుతం 2022లో దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు.

### ఏం జరుగుతుంది?

- అమెరికా పౌరులను వివాహం చేసుకున్న వ్యక్తులను తొలిదశలో ఇంటర్వ్యూ చేయనున్నారు. ఇది గతంలో మాదిరిగా ఉండదు. కఠినంగా ఉంటుంది.
- వివాహిత భారత పౌరురాలు అయితే.. ఆమెను అమెరికా కాన్సులేట్ అధికారులే ఇంటర్వ్యూ చేస్తారు.
- జీవిత భాగస్వామి హెచ్-1బీ వర్క్ వీసాపై అమెరికాలో ఉంటే.. అప్పుడు మాత్రమే గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.
- గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారిని అమెరికా సిటిజన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సేవల అధికారులు ఇంటర్వ్యూ చేస్తారు.
- ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు.. అన్ని పత్రాలను ముందుగానే ఒకటికి రెండుసార్లు పరిశీలించుకోవాలి. అధికారులు అడిగే ప్రశ్నలకు గతంలో మాదిరి 'తెలీదు, మరిచిపోయా'.. వంటి సమాధానాలు చెబితే వెంటనే బయటకు పంపుతారు. బ్లాక్ లిస్టులో పెడతారు.
- నకిలీ వివాహాలను పసిగట్టే విషయంలో మరింత లోతుగా పరిశీలిస్తారు. దీనికి సంబంధించి అధికారిక విధానాన్ని త్వరలోనే ప్రకటించనున్నారు.
- గ్రీన్ కార్డు ఉన్నవారు.. తమ జీవిత భాగస్వాములకు స్పాన్సర్ చేసే వీసాలకు 3-4 సంవత్సరాల సమయం పడుతోంది.
- కొన్ని కొన్ని సందర్భాల్లో జీవిత భాగస్వాములను వేర్వేరుగా ఇంటర్వ్యూ చేసి.. విషయాలను సరిపోల్చుకుంటారు. తేడా వస్తే 'బ్లాకే'.

# అమెరికాకు చైనా భారీ ఝలక్

- అరుదైన లోహాల ఎగుమతులు నిలిపివేత



వాషింగ్టన్, ఏప్రిల్ 14: అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం పతాకస్థాయికి చేరింది. భూమిలో అరుదుగా లభించే అనేక మూలకాలు, లోహాలతోపాటు అయస్కాంతాల ఎగుమతులను చైనా నిలిపివేసింది. దీంతో పశ్చిమ దేశాల్లోని ఆయుధ, ఎలక్ట్రానిక్, విమాన తయారీ, సెమీకండక్టర్ కంపెనీలకు కీలకమైన విడిభాగాల కొరత ఏర్పడనుంది. చైనా ప్రభుత్వం ఎగుమతులకు సంబంధించిన నూతన నిబంధనలను రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలో కార్ల నుంచి క్షిపణుల వరకు అన్ని రకాల తయారీ పరిశ్రమలకు సంబంధించిన అయస్కాంతాలు, ఇతర కీలకమైన విడిభాగాల ఎగుమతులను చైనాలోని అనేక పోర్టుల వద్ద నిలిపివేసినట్టు ది న్యూయార్క్ టైమ్స్ కథనం వెల్లడించింది. నూతన నియంత్రణ వ్యవస్థ అమల్లోకి వచ్చాక అమెరికా మిలిటరీ కాంట్రాక్టర్లు సహా అనేక కంపెనీలకు సరఫరాలు శాశ్వతంగా నిలిచిపోనున్నట్టు ఆ కథనం పేర్కొంది. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల్లో వినియోగించే 17 రకాల అరుదైన మూలకాలు, లోహాల్లో 90% వరకు చైనాయే సరఫరా చేస్తోంది. ఎలక్ట్రిక్ కార్లు, డ్రోన్లు, రోబోలు, క్షిపణులు, విమానాలు తదితరాల తయారీలో వినియోగించే అనేక రకాల ఎలక్ట్రిక్ మోటార్లలో వీటిని వినియోగిస్తారు. యుద్ధ విమానాల ఇంజన్లు, లేజర్లు, కార్ల హెడ్‌లైట్లు, కొన్ని రకాల స్పార్క్ ప్లగ్‌లు, కెపాసిటర్లు, కంప్యూటర్ చిప్‌లు, స్మార్ట్‌ఫోన్లలో వినియోగించే ఎలక్ట్రికల్ విడిభాగాల తయారీలోనూ ఈ లోహాలు అవసరం. దశాబ్దాలుగా ఈ కీలకమైన ఖనిజాల కోసం చైనాపైనే ఆధారపడుతున్న అమెరికా తయారీ పరిశ్రమలకు గడ్డు కాలం ఏర్పడనుందని విశ్లేషకులు అంటున్నారు. చైనా తాజా చర్యలు అమెరికాతోపాటు అన్ని దేశాలకూ అరుదైన లోహాల ఎగుమతులను ప్రభావితం చేయనున్నాయి. అరుదైన ఖనిజాల తవ్వకం, ప్రాసెసింగ్‌పై తన ఆధిపత్యాన్ని ఒక ఆయుధంగా మలచుకునే చైనా సామర్థ్యానికి తాజా చర్యలు నిదర్శనమని నిపుణులు పేర్కొంటున్నారు.

## లోకం తీరు




ట్రంప్‌ను చంపేందుకు డబ్బులివ్వలేదని

# తల్లిదండ్రుల కాల్చివేత

- అమెరికాలో 17 ఏళ్ల బాలుడి ఘాతుకం

మాల్వాకి, ఏప్రిల్ 14: అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను హత్య చేసేందుక కుట్ర పన్నిన ఓ 17 ఏళ్ల బాలుడు అందుకు డబ్బులివ్వడంలేదని తల్లిదండ్రులను తుపాకీతో కాల్చి చంపాడు. ఈ దారుణ ఘటన అమెరికా విస్కాన్సిన్‌లో జరిగింది. విస్కాన్సిన్‌లోని విఎల్వాకి ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలుడు నికిటా కాసప్ ఈ ఏడాది ఫిబ్రవరిలో తన తల్లి టటియానా కాసప్, సవతి తండ్రి డొనాల్డ్ మేయర్‌ను తుపాకీతో కాల్చి చంపాడు. అనంతరం కొన్ని వారాల పాటు మృతదేహాల పక్కన నివసించాడు. ఆ తర్వాత 14 వేల యూఎస్ డాలర్లు, పాస్‌పోర్టు, తన పెంపుడు కుక్కను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. టటియానా కాసప్, డొనాల్డ్ మేయర్ కొన్ని రోజులుగా కనబడడం లేదని అందిన ఫిర్యాదుతో పోలీసులు వారింటికి చేరుకొని చూడగా అక్కడ వారి మృతదేహాలు కుళ్లిన స్థితిలో కనపించాయి. ఈ హత్యలపై విచారణ ప్రారంభించిన పోలీసులు నిందితుడు నికిటా కొన్ని రోజులుగా పాఠశాలకు రావడం లేదని తెలుసుకుని, గాలించి గత నెల క్యాన్సస్‌లో అతడిని అరెస్టు చేశారు. అనంతరం దర్యాప్తులో అతడి గురించి సంచలన విషయాలు బయటకు వచ్చాయి. జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్‌ను ఆరాధించే నికిటా.. అధ్యక్షుడు ట్రంప్ హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. దీని కోసం తల్లిదండ్రులను నిందితుడు డబ్బు అడగ్గా దానికి వారు నిరాకరించడంతో వారిని హత్య చేశాడని తెలుసుకున్నారు. తర్వాత అతడు ఓ డ్రోన్‌ను, ఇతర పేలుడు పదార్థాలను కొనుగోలు చేశాడని పోలీసులు కనుగొన్నారు. ఓ రష్యా వ్యక్తితో కలిసి అతడు ఈ పథకం పన్నినట్లు తెలుసుకున్నారు. ట్రంప్‌ను చంపి ఉక్రెయిన్ పారిపోవాలని అతడు ప్రణాళిక వేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## నిప్పుతో చెలగాటమాడితే.. దహించి వేస్తుంది

- యూనస్‌కు షేక్ హసీనా హెచ్చరిక



న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: "మీరు నిప్పుతో చెలగాటమాడితే.. ఆ నిప్పే మిమ్మల్ని దహించి వేస్తుంది" అని బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రస్తుత బంగ్లాదేశ్ ప్రభుత్వ సలహాదారు యూనస్‌ను హెచ్చరించారు. తన అధికార దాహాన్ని తీర్చుకోవడం కోసం మహమ్మద్ యూనస్ విదేశీ శక్తులతో చేతులు కలిపారని, బంగ్లాదేశ్ పతనానికి కుట్ర చేశారని ఆరోపించారు. యూనస్‌ను ఆమె 'అత్యంత దురాశాపరుడైన వడ్డీవ్యాపారి'గా అభివర్ణించారు. సోమవారం హసీనా తన పార్టీ(అవామీ లీగ్) కార్యకర్తలను ఉద్దేశించి 8నిమిషాల పాటు వర్చువల్‌గా ప్రసంగించారు. యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ ప్రభుత్వం చరిత్రను చెరిపేస్తోందని హసీనా అన్నారు. "స్వాతంత్ర్య సమరయోధులను అవమానిస్తున్నారు. యూనస్ దీన్ని ఎలా సమర్థించుకుంటారు" అని ప్రశ్నించారు.

## గుజరాత్ తీరంలో రూ.1,800 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

అహ్మదాబాద్, ఏప్రిల్ 14: గుజరాత్ సముద్ర తీరంలో మరోసారి పెద్ద ఎత్తున డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,800 కోట్లకు పైనే ఉంటుందని అంచనా వేశారు. అరేబియా సముద్రంలో ఈనెల 12-13 తేదీల మధ్య అర్ధరాత్రి భారత తీర రక్షక దళం(ఐసీజీ), గుజరాత్ తీవ్రవాద నిరోధక దళం సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ నేపథ్యంలోనే ఓ బోటు కదలికలు అనుమానాస్పదంగా కనిపించడంతో ఐసీజీ నౌక దాన్ని వెంబడించింది. దీంతో, ఆ బోటులోని స్మగ్లర్లు డ్రగ్స్ సంచులను సముద్రంలోనే పడేసి పారిపోయారు. అధికారులు ఆ సంచులను వెలికి తీసి చూడగా అందులో 300 కిలోల మెథంఫెటమిన్ డ్రగ్స్ ఉన్నట్లు తేలింది.

# బెల్జియంలో ఛోక్సీ అరెస్టు

- స్విట్జర్లాండ్‌కు పారిపోయే క్రమంలో అరెస్టు
- తమకు అప్పగించాలని భారత్ అభ్యర్థన



2021లో డొమినికాలో అరెస్టు అయినప్పుడు ఛోక్సీని కోర్టు నుంచి తీసుకువెళ్తున్న పోలీసులు (ఫైల్)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)కు రూ.14 వేల కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టిన కేసులో సహ-నిందితుడు, వజ్రాల వ్యాపారి మెహుల్ ఛోక్సీ బెల్జియంలో అరెస్టయ్యారు. అతను బెల్జియంలో తలదాచుకుంటున్నాడంటూ భారత దర్యాప్తు సంస్థలు ఏడాది క్రితమే అక్కడి ప్రభుత్వానికి సమాచారం అందించాయి. స్విట్జర్లాండ్‌కు పారిపోయేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టిన క్రమంలో ఛోక్సీని అరెస్టు చేసినట్లు బెల్జియం పోలీసులు వెల్లడించారు. 2014-17 మధ్యకాలంలో తప్పుడు లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎన్‌వోయూ), ఫారిన్ లెటర్స్ ఆఫ్ క్రెడిట్(ఎఫ్ఎల్‌సీ)లతో విడతల వారీగా పీఎన్‌బీ నుంచి రుణాలు తీసుకున్న ప్రధాన నిందితుడు నీరవ్ మోదీ, అతని మేనమామ మెహుల్ ఛోక్సీ. 2018లో తమపై ఆరోపణలు వెల్లువెత్తగానే దేశాన్ని వీడారు. నీరవ్ మోదీ లండన్‌కు, ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడాకు పారిపోయారు. నీరవ్ మోదీ ప్రస్తుతం లండన్ జైలులో ఉండగా.. ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడా పౌరసత్వం తీసుకున్నారు. వీరిద్దరినీ వెనక్కి రప్పించేందుకు భారత్ 2018 నుంచే తీవ్రంగా ప్రయత్నిస్తోంది. 2023 నవంబరులో ఛోక్సీ బెల్జియం పౌరురాలైన తన సతీమని ప్రీతి సాయంతో.. 'ఎఫ్ రెసిడెన్సీ కార్డ్'ను పొందినట్లు భారత దర్యాప్తు సంస్థలు నిర్ధారించి, ఆ దేశానికి సమాచారం అందించాయి. అతని బెల్జియంపై ఒత్తిడి పెంచాయి. ఈ నేపథ్యంలో ఛోక్సీ.. స్విట్జర్లాండ్ పారిపోయేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే బెల్జియం పోలీసులు అతణ్ని అరెస్టు చేశారు. ఈనెల 12న ఛోక్సీని అరెస్టు చేసిన విషయాన్ని బెల్జియం పోలీసులు ధ్రువీకరించారు.

### అనారోగ్య కారణాలు..

ఛోక్సీ పలు అనారోగ్య కారణాలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. బ్లడ్ క్యాన్సర్‌కు బెల్జియంలో చికిత్స పొందుతున్నారని సమాచారం. ఆయన ఆస్పత్రిలో ఉండగానే.. బెల్జియం పోలీసులు అరెస్టు చేశారు. అయితే.. అనారోగ్య కారణాలను ప్రస్తావిస్తూ.. ఆయన బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాలున్నాయి. అదే సమయంలో ఛోక్సీని తమకు అప్పగించాలని సీబీఐ, ఈడీ అధికారులు బెల్జియంను అభ్యర్థించాయి.

### అప్పగింత ఎలా!

బెల్జియం-భారత్ మధ్య ఖైదీల మార్పిడి ఒప్పందం బ్రిటిష్ కాలం(1901)లోనే మొదలైంది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చాక-1958లో దాన్ని పునరుద్ధరించారు. 2020లో ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఈ ఒప్పందాన్ని కొనసాగిస్తూ.. సంతకాలు చేసింది. ఈ ఒప్పందంలోని కీలక అంశాలను బట్టి.. బెల్జియం ప్రభుత్వం ఛోక్సీని అప్పగించాల్సి ఉంటుంది. ఇరుదేశాల్లో నేరంగా పరిగణించే అంశాలు, ఆర్థిక నేరాలు, పన్ను ఎగవేత, ఆదాయానికి సంబంధించిన కేసుల్లో నిందితులను అప్పగించాలి. అదే సమయంలో.. రాజకీయ కారణాలతో అరెస్టులు ఉన్నా.. మిలటరీ సంబంధిత నేరాలైనా.. ఖైదీల అప్పగింత కుదరదు. ఈ నేపథ్యంలో ఛోక్సీ న్యాయవాదులు మానవహక్కులు, రాజకీయ వేధింపుల అంశాన్ని తెరపైకి తీసుకువస్తున్నారు. ఛోక్సీ అప్పగింతపై భారత్ చేసిన అభ్యర్థనను పరిశీలిస్తున్నామని బెల్జియం ప్రభుత్వం కూడా సోమవారం అధికారికంగా ప్రకటించడం గమనార్హం.! కాగా, ఛోక్సీని వెనక్కి రప్పిస్తామని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ స్పష్టంచేశారు. ఛోక్సీని బెల్జియం పోలీసులు అరెస్టు చేయడాన్ని భారత్ విజయంగా పేర్కొన్నారు.

### 2021లో డొమినికాలో అరెస్టు!

ఛోక్సీని డొమినికా పోలీసులు 2021లోనే అరెస్టు చేశారు. అప్పట్లో ఆయన ఆంటిగ్వా-బార్బుడా నుంచి క్యూబా వెళ్లే ప్రయత్నంలో అక్రమంగా డొమినికాలో ప్రవేశించడంతో అరెస్టయ్యాడు. అయితే.. అతణ్ని కిడ్నాప్ చేశారని ఛోక్సీ న్యాయవాదులు ఆరోపించారు. దీని వెనక భారత ఏజెంట్ల పాత్ర ఉందన్నారు. డొమినికా పోలీసులు అరెస్టు చేసిన సమయంలోనే.. భారత దర్యాప్తు సంస్థలు ఛోక్సీని రప్పించే ప్రయత్నం చేసినా.. అది సఫలమవ్వలేదు.

# అందరూ మహిళలతో అంతరిక్ష యాత్ర

- వారిలో బెజోస్ ప్రియురాలు లౌరెన్



వాషింగ్టన్, ఏప్రిల్ 14: అంతరిక్ష పర్యాటక యాత్రలను నిర్వహించే బ్లూ ఆరిజన్ సంస్థ సోమవారం అందరూ మహిళలతో కూడిన రాకెట్‌ను రోదసీలోకి పంపించింది. అమెజాన్ సంస్థ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ఆధ్వర్యంలోని ఈ కంపెనీ 11వ యాత్రలో భాగంగా 'న్యూ షెపర్డ్' రాకెట్‌లో ఆరుగురు మహిళలను పంపించింది. వీరిలో బెజోస్ ప్రియురాలు లౌరెన్ సాంచెజ్, పాప్ స్టార్ కేటీ పెర్రీ ఉన్నారు. రాకెట్ సిబ్బంది కూడా అందరూ మహిళలే కావడం విశేషం. పశ్చిమ టెక్సాస్‌లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8.30 గంటలకు ఈ రాకెట్ బయలుదేరింది. నిటారుగా 100 కి.మీ. (60 మైళ్లు) ప్రయాణించి భూవాతావరణం, అంతరిక్షం సరిహద్దు అయిన 'కర్మన్ రేఖ'ను దాటింది. అక్కడ గురుత్వాకర్షణ లేని శూన్య వాతావరణంలో వారంతా తేలియాడారు. తర్వాత, రాకెట్ తిరిగి భూమికి చేరుకుంది. ఈ యాత్ర మొత్తం పది నిమిషాల్లో ముగిసింది.

# 'గోల్కొండ బ్లూ' వజ్రం.. 430 కోట్లు!



జెనీవా, ఏప్రిల్ 14: ఒకనాటి గోల్కొండ రాజ్యంలోని వజ్రాల గనుల్లో దొరికిన అరుదైన 'గోల్కొండ బ్లూ' వజ్రం వేలానికి రానుంది. ప్రఖ్యాత క్రిస్టీస్ సంస్థ స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో మే 14వ తేదీన ఈ వజ్రాన్ని విక్రయించనుంది. రాచ వారసత్వం, విభిన్నమైన నీలి రంగులో, 23.24 కేరట్ల పరిమాణంతో ఉండటంతో 'గోల్కొండ బ్లూ'కు మంచి ధర పలుకుతుందని క్రిస్టీస్ సంస్థ ప్రతినిధి రాహుల్ కడాకియా తెలిపారు. ప్రస్తుతం ఒక ఉంగరానికి అమర్చి ఉన్న ఈ వజ్రానికి రూ.300 కోట్ల నుంచి రూ.430 కోట్ల వరకు పలుకుతుందని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు. 'గోల్కొండ బ్లూ' వజ్రం గురించి తెలిసిన చరిత్ర ప్రకారం.. మొదట్లో అది ఇండోర్ రాజు మహారాజా యశ్వంత్‌రావు హోల్కర్-2 వద్ద ఉండేది. 1923 సమయంలో చేతికి ధరించే బ్రాస్‌లెట్‌లో ఈ వజ్రాన్ని పొదిగారు. తర్వాత ఇండోర్ పియర్స్‌గా పిలిచే మరో రెండు వజ్రాలతో కలిపి 'గోల్కొండ బ్లూ'ను మహారాణి ధరించే నెక్లెస్‌లో అమర్చారు. ఆ కాలంలో ఇండోర్‌కు వచ్చిన ఫ్రెంచ్ చిత్రకారుడు బెర్నార్డ్ బౌటెట్ గీసిన చిత్రంలో మహారాణి ఈ నెక్లెస్‌ను ధరించి ఉండటం గమనార్హం. 1947లో నాటి ప్రఖ్యాత ఆభరణాల వ్యాపారి హ్యారీ విన్‌స్టన్ చేతికి 'గోల్కొండ బ్లూ' వజ్రం చేరింది. తర్వాత బరోడా మహారాజు దాన్ని కొనుగోలు చేశారు. కొంతకాలం అనంతరం మళ్లీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది. తాజాగా జెనీవాలోని ఫోర్ సీజన్స్ హోటల్‌లో వేలం వేయనున్నారు. సాధారణంగా స్వచ్ఛమైన నీలం రంగులో ఉండే వజ్రాలకు డిమాండ్ ఎక్కువ. ఇంతకు ముందు 14.62 కేరట్ల 'ఓపెన్‌హైమర్ బ్లూ' వజ్రం ఏకంగా రూ.495 కోట్లకు అమ్ముడవడం గమనార్హం.

# అంబేడ్కర్‌ను అవమానించిన నీచ చరిత్ర కాంగ్రెస్‌ది

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం
- చంపినోడే సంతాపసభ పెట్టినట్లుంది
- కాంగ్రెస్‌పై బండి సంజయ్ మండిపాటు


ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను అడుగడుగునా అవమానించిన నీచ చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల్లో కుట్ర చేసి ఆయన్ను ఓడించిన నీచమైన మనస్తత్వం కాంగ్రెస్ పార్టీదని దుయ్యబట్టారు. దేశానికి విశేష సేవలందించిన ప్రముఖులు మరణించినప్పుడు వారి అంత్యక్రియలు ఢిల్లీలో నిర్వహించే సంప్రదాయం ఉందని, అయితే, అంబేడ్కర్ మరణించినప్పుడు ఆ గౌరవం కల్పించకుండా, ఆయన పార్థివదేహాన్ని ఢిల్లీ నుంచి ముంబైకి తరలించారని, అంబేడ్కర్ పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న వైఖరికి ఇది నిదర్శనమని కిషన్‌రెడ్డి విమర్శించారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి ట్యాంక్ బాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కిషన్‌రెడ్డి స్వయంగా బైక్ నడిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ప్రసాదించిన రాజ్యాంగాన్ని కాంగ్రెస్, కాలరాసి ఎమర్జెన్సీని విధించి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించిందని ధ్వజమెత్తారు. బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచన విధానాలను అమలు చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల ను పండుగలా నిర్వహించాలంటూ కాంగ్రెస్ ప్రభు త్వం ఆదేశించడం హాస్యాస్పదమని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. 'కాంగ్రెస్ తీరు ఎట్లుందంటే చంపినోడే సంతాపసభ పెట్టినట్లుగా ఉంది' అని దుయ్యబట్టారు. అంబేడ్కర్‌కు భారతరత్న ఇవ్వకుండా అవమానించడమే కాకుండా ఆయనను ఓడించిన వ్యక్తికి పద్మభూషణ్ ఇచ్చిందే కాంగ్రెస్ అని అలాంటి పార్టీ ఇప్పుడు అంబేడ్కర్ జయంతిని పండుగలా నిర్వహించాలనడం సిగ్గుచేటని మండిపడ్డారు. బీసీలు, రాజ్యాం గం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మొసలి కన్నీరు కారుస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం చేస్తూ కులగణన పేరుతో కుట్ర చేస్తోందని విమర్శించారు.


కార్యక్రమంలో పాల్గొన్న సుజోయ్ పాల్, తదితరులు

## ప్రతి దశలో రాజ్యాంగం అమలును పర్యవేక్షించాలి

- ఇది పౌరుల వ్యక్తిగత బాధ్యత
- హైకోర్టు తాత్కాలిక సీజే జస్టిస్ సుజోయ్‌పాల్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించడంతోపాటు ప్రతి దశలోనూ అది ఎలా అమలు జరుగుతుందో పర్యవేక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ రాజ్యాంగంలో పొందుపర్చిన విలువలు, సూత్రాలను ప్రతి పౌరుడు ఉత్సాహంతో కాపాడుకోవాలని, దానిని వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. గంగానది ప్రారంభంలో చాలా స్వచ్ఛమైన నీటితో ప్రవహిస్తుందని, పోను పోను నీరు కలుషితమై తాగడానికి వీలులేకుండా మారుతుందని అన్నారు. అలాగే ప్రారంభంలో సైతం రాజ్యాంగం స్వచ్ఛంగా ఉండేదని.. కాలక్రమేణా మలినాలు ప్రవేశించాయని, వాటిని మనమే నివారించాలన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న జస్టిస్ సూరేపల్లి నంద మాట్లాడుతూ.. సామాజిక సంక్షేమం, సామాజిక న్యాయం ప్రజలకు అందించినప్పుడే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతికి, అన్ని రంగాల్లో సమ్మిళిత వృద్ధికి వ్యూహాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి జస్టిస్ నందికొండ నర్సింగరావు, బార్ కౌన్సిల్ ఛైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ ఛైర్మన్ సునీల్‌గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ జగన్, మాజీ అధ్యక్షుడు వీ రఘునాథ్, బీసీఐ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# అంబేడ్కర్‌కు ఘన నివాళి

**125 అడుగుల విగ్రహానికి అంజలి ఘటించిన డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులు**



సచివాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భట్టి విక్రమార్క, మంత్రులు.. ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

ఖైరతాబాద్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): నెక్లెస్ రోడ్డులో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం సందర్శనకు ప్రభుత్వం తొలిసారిగా అనుమతినివ్వడంతో సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంబేడ్కర్‌కు నివాళులర్పించి, మ్యూజియం చూసి సంబరపడ్డారు. మ్యూజియం లోపల ప్రముఖులతో అంబేడ్కర్ ఫొటోలు, రాజ్యాంగానికి ముందు, తర్వాత పరిస్థితులను వివరిస్తూ చేసిన ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి. విగ్రహం లోపల, బయట సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సందర్శకులు సందడి చేశారు. సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ సాధువులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. హెచ్ఎండీఏ అధికారులు అంబేడ్కర్ విగ్రహానికి భారీ క్రేన్ల సాయంతో పూలదండను వేశారు.

### నివాళులర్పించిన ప్రముఖులు

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎంపీ కడియం కావ్య, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం మొదటి అంతస్తుకు వెళ్లారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉన్నదన్నారు.

### ఆశయాలను సాధిద్దాం

కవాడిగూడ డివిజన్‌లోని రోటరీకాలనీలో వీబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బాబుజగ్జీవన్‌రాం, అంబేడ్కర్ విగ్రహాలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డాక్టర్ కే. లక్ష్మణ్, కార్పొరేటర్ జి రచనశ్రీ, వీబీ ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ బీజేపీ అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మిలతో కలిసి హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ తదితరులు అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహానికి లైన్‌లో నిలబడి ఆయన నివాళులర్పించారు. కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

**ఆశయ సాధన దిశగా ప్రజా ప్రభుత్వం అడుగులు : సీఎం**

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయ సాధనలో ప్రజాప్రభుత్వం కొన్ని కీలక అడుగులు వేసిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ట్యాంక్‌బండ్ దగ్గర అంబేడ్కర్ విగ్రహానికి డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, రాజనర్సింహా, ఎంపీ అనిల్‌కుమార్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులుతో కలిసి సీఎం రేవంత్ నివాళులు అర్పించారు. అనంతరం ప్రభు త్వం అమలుచేసిన పలు పథకాల గురించి ఎక్స్ వేదికగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా "ఇదొక చారిత్రక సందర్భం. మూడు దశాబ్దాల కలను నిజం చేసిన సంకల్పం. ఎస్సీ వర్గీకరణపై ప్రజా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తొలికాపీని అందుకోవడం గొప్ప అనుభూతిని మిగిల్చిన క్షణం" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## భార్యను రోకలిబండతో కొట్టి చంపిన భర్త

**అడ్డొచ్చిన అత్తపైనా దాడి**


భర్త, కూతురుతో రమీల (ఫైల్)

పటాన్‌చెరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళ్లిన తన భార్యను తిరిగి కాపురానికి పంపకుండా పెద్ద మనుషుల మధ్య పంచాయితీ పెట్టించినందుకు ఆగ్రహానికి గురైన భర్త.. భార్యను రోకలిబండతో కొట్టి చంపేశాడు. అడ్డుపడిన అత్తపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పెద్దకంజర్లలో సోమవారం జరిగింది. పెద్దకంజర్లకు చెందిన రమీల (25)కు జిన్నారం మండలం కిష్టాయిపల్లికి చెందిన సురేష్(30)తో అయిదేళ్ల క్రితం వివాహమయింది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో నెల క్రితం రమీల పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో సోమవారం గ్రామంలో పెద్దమనుషులు పంచాయితీ పెట్టేందుకు సిద్ధమయ్యి సురేష్‌కు సమాచారమిచ్చారు. భార్యను కాపురానికి పంపకుండా పంచాయితీ పెట్టించారని ఆగ్రహానికి గురైన సురేష్ సోమవారం అత్తగారింటికి చేరుకుని రోకలిబండతో భార్య తలపై విచాక్షరహితంగా దాడి చేశాడు. అడ్డుకున్న అత్త కవితపై కూడా దాడికి తెగబడ్డాడు. తీవ్ర గాయాలపాలైన రమీల అక్కడిక్కడే ప్రాణాలు విడిచింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చిన్నారుల ఉసురు తీసిన కారు

**డోర్ లాక్‌తో ఊపిరాడక ఇద్దరి మృతి**


తన్మయిశ్రీ, అభియన శ్రీ (ఫైల్)

చేవెళ్ల, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కారు డోర్లు లాకై ఇద్దరు చిన్నారులు ఊపిరాడక.. ప్రాణాలొదిలారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పరిధిలోని దామరిగిద్ద గ్రామంలో జరిగిందీ విషాదం. పిల్లలిద్దరూ తమ మేనమామ పెళ్లి కోసం తల్లిదండ్రులతో కలిసి అమ్మమ్మ ఇంటికొచ్చి మృత్యువాతపడ్డారు. మృతులు తన్మయిశ్రీ(5), అభినయశ్రీ(4). దామరిగిద్దకి చెందిన రాంబాబు పెళ్లి ఈ నెల 30న జరగనుంది. అతని అక్కాచెల్లెళ్లు ఉమారాణి, జ్యోతి తమ పిల్లలతో సోదరుడి వివాహం కోసం పుట్టింటికొచ్చారు. ఉమారాణికి ఓ బాబు, కూతురు తన్మయిశ్రీ ఉన్నారు. జ్యోతికి ముగ్గురు ఆడపిల్లల్లో అభినయశ్రీ ఓ సంతానం. సోమవారం తన్మయిశ్రీ, అభినయశ్రీ ఇంటి ముందు ఉన్న రాంబాబు కారు వెను క డోర్లు తెరిచి ఎక్కారు. లోపలి నుంచి డోర్లు క్లోజ్ చేసుకోవడంతో వెంటనే లాక్ అయ్యాయి. మధ్యాహ్నం 2గంటలకు వారి కోసం అందరూ వెతికితే ఎక్కడా కనిపించలేదు. చివరికి కారు డోర్ లాక్ తీసి చూడగా పిల్లలిద్దరూ అచేతన స్థితిలో కనిపించారు. వెంటనే చేవెళ్లలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఇద్దరూ మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. ఘటనపై కేసు నమోదైంది.

# అంబేడ్కర్ జయంతిలో ఫ్లెక్సీ వివాదం

- లింగంపేట అంబేడ్కర్ యువజనసంఘం రాస్తారోకో
- ప్యాంట్ ఊడినా సంఘం నేతను అరెస్ట్ చేసిన పోలీసులు
- డీఎస్పీ హామీతో ఆందోళన విరమణ


లింగంపేటలో పోలీసులకు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులకు మధ్య తోపులాట

లింగంపేట/ హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతి సందర్భంగా కామారెడ్డి జిల్లా లింగంపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి దారి తీసింది. ఆ ఫ్లెక్సీలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఫొటోలు ఉండటంతో అంబేడ్కర్ విగ్రహం పక్కన రాజకీయ నేతల ఫ్లెక్సీ తొలగించాలని గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి వచ్చిన ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్.. పంచాయతీ కార్యదర్శి ద్వారా బీఆర్ఎస్ నేతల ఫొటోలున్న ఫ్లెక్సీ తొలగించారు. సమీపంలోనే ఉన్న కాంగ్రెస్ నేతల ఫ్లెక్సీలు తొలగించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. దీంతో తమ పట్ల దురుసుగా మాట్లాడిన సీఐ రవీందర్‌నాయక్‌పై అంబేడ్కర్ యువజనసంఘం నాయకులు కోపోద్రిక్తులయ్యారు. ఆందోళనకు దిగిన నలుగురు అంబేడ్కర్ యువజన సంఘం నాయకులను అరెస్ట్ చేశారు. ప్యాంట్ ఊడిపోయిన అంబేడ్కర్ యువజన సంఘం గౌరవాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ముదాం సాయిలును డ్రాయర్‌పైనే తీసుకెళ్లారు. జిల్లాలోని వివిధ గ్రామాల దళిత సంఘాల నేతలు లింగంపేట ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. ఈ సమాచారం తెలియగానే బాన్స్‌వాడ డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాలు లింగంపేటకు చేరుకున్నాయి. సీఐపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తర్వాత సీఐ రవీందర్ నాయక్‌పై పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్, అంబేడ్కర్ సంఘం నేతలు ఫిర్యాదు చేశారు.

### ఖండించిన ఎమ్మెల్సీ కవిత

లింగంపేటలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన దళితులపై పోలీసుల దమనకాండను ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. దళితులను అవమానించడమే ప్రజాపాలనా? రాష్ట్రంలో అమలవుతున్నది అంబేడ్కర్ రాజ్యాంగమా..? ఎనుముల రేవంత్‌రెడ్డి రాజ్యాంగమా? అని ఎక్స్ వేదికగా సోమవారం నిలదీశారు.

## ఆడ కవలలను పెంచలేం!

**ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు.. ఆర్థిక భారం అని కన్నవారి ఆవేదన**

- శిశువులను ఖమ్మం ఐసీడీఎస్ అధికారులకు ఇచ్చేసిన తల్లిదండ్రులు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని ఓ గ్రామానికి చెందిన తల్లిదండ్రులు ఆడ కవల శిశువులను పెంచలేమని సోమవారం ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. పేద కుటుంబానికి చెందిన తమకు ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలున్నారని, మరో ఇద్దరు ఆడ పిల్లలు పుట్టడంతో వారి పోషణ తమ వల్ల కాదని తేల్చిచెప్పారు. చింతకాని మండలంలోని ఓ గ్రామానికి చెందిన తల్లిదండ్రులు వారికి పుట్టిన కవలలను పోషించలేమని అక్రమ పద్ధతిలో శిశువులను పిల్లలు లేని ఓ జంటకు విక్రయించినట్లు ఖమ్మం ఐసీడీఎస్ అధికారులు గుర్తించారు. అధికారులు విచారణ చేయించి అక్రమంగా పిల్లలను దత్తత తీసుకున్న వారి నుంచి ఆ కవలలను స్వాధీనం చేసుకున్నారు. తల్లిదండ్రులు, అక్రమంగా దత్తత తీసుకున్న జంటకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే తాము కవలలను పోషించలేమంటూ తల్లిదండ్రులు ఐసీడీఎస్ అధికారులకు తేల్చి చెప్పారు. దాంతో ఆ కవలలను అధికారులు స్వాధీనం చేసుకొని ఖమ్మంలోని శిశుగృహంలో ఉంచారు. తల్లిదండ్రుల ఇష్టప్రకారమే చిన్నారులను తీసుకున్నామని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ చిన్నారులను చట్ట ప్రకారం దత్తతకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ అక్రమ దత్తతకు ఇద్దరు మహిళలు సహకరించినట్లు అధికారులు గుర్తించారని తెలిసింది. వారి నుంచి వివరాలు సేకరిస్తున్నారు పిల్లలు కావాలనే తల్లిదండ్రులు మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులను సంప్రదిస్తే చట్ట ప్రకారం శిశువులను దత్తత ఇస్తామని పేర్కొన్నారు.

## ఒక్కసారి ఓటేస్తే.. ఐదేళ్ల శిక్షగా మారింది!

**ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం : కేటీఆర్**

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ మోసపూరిత పాలనను చూశాక.. ఒక్కసారి ఓటేస్తే ఐదేళ్ల శిక్ష అన్నట్లుగా తయారైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాజ్యాంగ నిర్మాతలు రేవంత్‌రెడ్డి వంటి మోసపూరిత పాలనను చూసుంటే అప్పుడే రీకాల్ వ్యవస్థను ప్రవేశపెట్టేవారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొని నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎస్సీ డిక్లరేషన్ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఓట్ల కోసం మోసానికి పాల్పడిన కాంగ్రెస్ నేతలతో పాటు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'అసైన్డ్ భూములకు పట్టాలు, రూ.12 లక్షల దళితబంధు అన్నారు. విద్యాజ్యోతి పథకం కింద దళితులకు ఆర్థిక ప్రోత్సాహకాలు ఎక్కడకు పోయాయో సీఎం రేవంత్ సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే ప్రజా సునామీలో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయమని కేటీఆర్ అన్నారు. గవర్నర్ అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేల అనర్హత విషయంలో స్పీకర్ నిర్ణయంపై కూడా సుప్రీంకోర్టు తగిన తీర్పు ఇస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ జయంతి రోజు బ్యానర్ కట్టారని కామారెడ్డిలో దళితుడి బట్టలూడదీసి పోలీసులు ఈడ్చుకుపోవడం దారుణమని పేర్కొన్నారు. ఆ పోలీసులపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ఆటో సంఘాలు మద్దతు ప్రకటించాయి. కేటీఆర్‌ను ఆయా సంఘాల ప్రతినిధులు కలిసి సభ కోసం రూ.26 వేల విరాళం చెక్కును అందజేశారు. ఆ చెక్కును వారికే తిరిగిచ్చిన కేటీఆర్.. చనిపోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు అందజేయాలని సూచించారు.

## నీట్ 'కోటా' గ్రాండ్ టెస్టులు సిద్ధం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : నీట్-2025కి సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం 'కోటా' 2025 గ్రాండ్ టెస్టులు, సొల్యూషన్లు, ర్యాంక్ బూస్టర్(డిజిటల్) బుక్‌లెట్‌లు సిద్ధం చేసినట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం తెలిపింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ డిజిటల్ బుక్‌లెట్‌లను మొబైల్ వెర్షన్‌లో వాట్సాప్ ద్వారా పొందవచ్చు. మరింత సమాచారం కోసం NEET GT 2025 అని టైపు చేసి వాట్సాప్ నంబరు 98490 16661కు మెసేజ్ చేయాలని ఫోరం సూచించింది.

## భార్యనూ.. కడుపులోని బిడ్డనూ చిదిమేశాడు!

- మరికొద్ది గంటల్లో ప్రసవం కానున్న భార్య
- గొంతుకు చున్నీ బిగించి చంపిన ఉన్మాది భర్త
- విశాఖలో దారుణం.. పోలీసుల అదుపులో నిందితుడు


జ్ఞానేశ్వర్, అనూషల పెళ్లి ఫొటో

మహారాణిపేట (విశాఖపట్నం), ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది గంటల్లో ప్రస వం కానున్న భార్యను గొంతు కు చున్నీ బిగించి నులిపి చంపేశాడో ఉన్మాది. భార్యను, ఆమెతోపాటు కడుపులో ఉన్న బిడ్డను సైతం పొట్టన పెట్టుకున్న ఈ ఉన్మాదిని విశాఖ పోతినమల్లయ్యపాలెం (పీఎం పాలెం) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు ప్రాంతానికి చెందిన కేదారశెట్టి అనూష (27) హోటల్ మేనేజ్‌మెంట్ చేసింది. విశాఖ జిల్లా కూర్మన్నపాలేనికి చెందిన గెడ్డాడ జ్ఞానేశ్వర్ (29) సాగర్‌నగర్ సమీపంలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. వీరిద్దరూ ప్రేమించుకుని 2022 డిసెంబరు 10న వివాహం చేసుకున్నారు. పీఎం పాలెం వుడా కాలనీలో కాపురం పెట్టారు. జ్ఞానేశ్వర్ వివాహం చేసుకున్నట్టు తన తల్లిదండ్రులకు తెలపలేదు. వారికి విషయం చెప్పాలని అనూష ఎన్నిసార్లు ఒత్తిడి తెచ్చినా.. పిల్లలు పుట్టాక చెబుదామని కాలయాపన చేశాడు. ఈ క్రమంలో అనూష గర్భందాల్చింది. ఏప్రిల్ 14న ప్రసవమవుతుందని, ఒకరోజు ముందు ఆస్పత్రిలో చేరాలని వైద్యులు సూచించారు. అయితే.. 'ఆదివారం ఎందుకు? సోమవారం ఉదయం వెళదాం'ని జ్ఞానేశ్వర్ అనూషకు నచ్చజెప్పాడు. కానీ.. సోమవారం ఉదయం ఆమె సన్నిహితులు, స్నేహితులకు జ్ఞానేశ్వర్ ఫోన్ చేసి అనూష చలనం లేకుండా పడి ఉందని తెలిపాడు. వారు వచ్చిన తర్వాత ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యులు గుర్తించి కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. అక్కడి వైద్యులు ఆమె మృతిని నిర్ధారించారు. అనూష మెడపై కమిలిన గుర్తులు ఉండడం, అర్ధరాత్రి వరకూ తమతో సంతోషంగా, ఆరోగ్యంగా ఉన్న ఆమె ఒక్కసారిగా చలనం లేకుండా కనిపించడంతో స్నేహితులు అనుమానం వ్యక్తం చేశారు. కేజీహెచ్ ఔట్‌పోస్టు పోలీసులు తమదైన శైలిలో విచారించగా.. అనూషను చున్నీతో పీక నులిమి చంపినట్టు జ్ఞానేశ్వర్ నేరాన్ని అంగీకరించాడు.

## కుటుంబాన్ని కబళించిన రోడ్డు ప్రమాదం

- ముందు వెళుతున్న లారీని ఢీకొట్టిన కారు
- ముగ్గురి దుర్మరణం.. మరో ముగ్గురికి సీరియస్
- జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ముందువెళ్తున్న లారీని వెనుక నుంచి కారు అతివేగంగా ఢీకొట్టిన ఘటనలో కారులో ప్రయాణిస్తున్నవారిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణంపాలయ్యారు. ఆ వాహనంలోని మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్ వద్ద జరిగింది. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉంది. ఏపీలోని కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన రాజేశ్వరరావు, అనంతలక్ష్మి దంపతులు హైదరాబాద్‌లోని గాజులరామారంలో చాలా ఏళ్ల క్రితం స్థిరపడ్డారు. వీరికి కుమారుడు శ్రీను (50), కోడలు రమణకుమారి (40), మనుమడు సత్య అరవింద్, మనుమరాలు అనూష (22) ఉన్నారు. వీరంతా సోమవారం ఉదయం కారులో భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి వెళ్లారు. పూజలు అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. రాఘవపూర్ శివారులో వీరు ప్రయాణిస్తున్న కారు ముందువెళ్తున్న లారీని వేగంగా ఢీకొట్టింది. కారు నడుపుతున్న శ్రీను, భార్య రమణకుమారి, కూతురు అనూష అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక సీట్లో కూర్చున్న రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి, సత్య అరవింద్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## నీవు లేక నేనుండలేను

- ఒకరోజు వ్యవధిలో గుండెపోటుతో భర్త, బాధతో భార్య మృతి


శంకరయ్య, లక్ష్మి దంపతులు (ఫైల్)

మునుగోడు రూరల్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): కష్ట సుఖాల్లో కలకాలం తోడుగా కలిసుంటామని పెళ్లినాడు ప్రమాణాలు చేసుకున్న వారు కాటికి కూడా కలిసే వెళ్లారు. భర్త గుండెపోటుతో మృతి చెందగా, ఆ బాధను తట్టుకోలేక భార్య కూడా ప్రాణాలు విడించింది. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని పలివెలకు చెందిన దుబ్బ శంకరయ్య(67)కు లక్ష్మి(55)తో 30 ఏళ్ల క్రితం వివాహమైంది. సంతానం లేకపోవడంతో ఓ అబ్బాయిని దత్తత తీసుకున్నారు. గ్రామంలో ఉపాధి దొరక్క 15 ఏళ్ల క్రితం శంకరయ్య కుటుంబంతో హైదరాబాద్‌కు వలస వెళ్లారు. శంకరయ్య ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వాచ్‌మెన్‌గా, లక్ష్మి వస్త్ర దుకాణంలో పని చేస్తూ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. కొన్ని నెలలుగా శంకరయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం గుండెపోటు గురై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న లక్ష్మి బాధతో రోదించి రోదించి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు.

## అక్కా.. నేను ఆత్మహత్య చేసుకుంటున్నా!

- హైదరాబాద్‌లోని అక్కకు తమ్ముడి ఫోన్.. పోలీసులకు సమాచారం.. 10 నిమిషాల్లోనే కాపాడిన తిరుమల పోలీసులు

తిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తన తమ్ముడు ఆత్మహత్య చేసుకోబోతున్నాడంటూ ఓ యువతి రోదిస్తూ హైదరాబాద్ నుంచి తిరుమల పోలీసులకు సమాచారమిచ్చింది. ఎలాగైనా కాపాడాలంటూ ప్రాధేయపడింది. సకాలంలో పోలీసులు కూడా స్పందించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. తిరుమలలో సోమవారం వేకువజామున ఈ ఘటన జరిగింది. హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నానికి చెందిన మునిసాత్విక్(25) తన దగ్గరి బంధువు నరేష్‌తో కలిసి నాలుగురోజుల క్రితం తిరుమలకు వచ్చాడు. తర్వాత మునిసాత్విక్ కనిపించకుండా పోయాడు. సోమవారం వేకువజామున 4 గంటల సమయంలో మునిసాత్విక్ హైదరాబాద్‌లోని తన అక్క స్వర్ణరేఖకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్టు సమాచారమిచ్చి ఫోన్ పెట్టేశాడు. దీంతో స్వర్ణరేఖ తిరుమల టూటౌన్ పోలీసులకు ఫోన్ చేసి ఏడుస్తూ విషయాన్ని వివరించింది. వారు వెంటనే స్పందించి సెల్‌ఫోన్ లోకేషన్ ద్వారా తిరుమలలోని కల్యాణి సత్రాలపై మునిసాత్విక్ ఉన్నట్టు గుర్తించి వేగంగా అక్కడికి చేరుకున్నారు. అప్పటికే మూడంతస్తుల భవనం నుంచి కిందకు దూకేందుకు సిద్ధంగా ఉన్న మునిసాత్విక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి మానసిక స్థితి సక్రమంగా లేదని గుర్తించి తిరుపతిలోకి స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# ఆర్తవచనం

మత సామరస్యాన్ని, మైనారిటీ మతస్థుల శ్రేయస్సును కోరుకుంటున్న భారత పౌరులు ఏ ప్రాంతం వారైనా, ఏ మతం వారైనా బెంగాల్ ఘటనలకు వ్యాకులపడుతున్నారు. వక్ఫ్ చట్టంపై నిరసనలు, ఆందోళనలు, ప్రభుత్వ ఆస్తులపై దాడులు, భిన్న సామాజికవర్గాల పరస్పర దాడులతో పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్ జిల్లా అట్టుడికిపోతోంది. గత మంగళవారం నాడు ప్రారంభమైన ఈ అరాచకకాండ ఇప్పటికీ తగ్గుముఖం పట్టలేదు.

కొత్త వక్ఫ్ చట్టంపై ప్రజల్లో నెలకొన్న గందరగళమే ఈ అలజడికి దారి తీసిందని చెప్పవచ్చు. చట్టాన్ని తీసుకువచ్చిన జాతీయ పాలక పక్షం వారుగానీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగానీ ప్రజల్లో ఆ చట్టంపై ఒక స్పష్టమైన అవగాహన కల్పించేందుకు శ్రద్ధ చూపక పోగా పరస్పర ఆరోపణలు చేసుకోవడం పరిస్థితులు దిగజారి పోయేందుకు ఆస్కారమేర్పడింది. రాజకీయ అవకాశవాదానికి పాలనా యంత్రాంగ వైఫల్యాలు తోడవడంతో ముర్షీదాబాద్ జిల్లాలోను, బెంగాల్‌లోని ఇతర ప్రాంతాలలోను తీవ్ర అవాంఛనీయ పరిస్థితులు నెలకొన్నాయి. హిందువులు ముస్లింలు ఇరువర్గాలూ ఈ ఆందోళనలు, హింసాకాండకు బాధితులవుతున్నారు. ఏ ఒక్క మత సమూహాన్ని ఈ చర్యలకు పూర్తి బాధ్యులుగా చేయడం సత్యాన్ని గౌరవించడమవదు.

స్వతంత్ర భారతదేశంలో మున్నెన్నడూ లేని విధంగా ముస్లిం పౌరులు సమస్త విషయాలలోను వివక్షకు గురవుతున్న తరుణంలో ఎన్డీఏ ప్రభుత్వం వక్ఫ్ (సవరణ) చట్టం–2025ను తీసుకువచ్చింది. పార్లమెంటు ఉభయ సభలలో ఆ బిల్లును హడావుడిగా ఆమోదింపచేసింది. రాజ్యాంగ పరిభాషలో ఉన్న ఈ సవరణ చట్టం వాస్తవంగా ముస్లింలను ఆర్థికంగా దెబ్బతీసే చట్టం; మతపరంగా వారిని అగౌరవపరిచే చట్టం అనడంలో సందేహం లేదు. ముస్లింలను అణచివేసేందుకు ఉద్దేశించిన చట్టం. మత ధర్మం ప్రకారం విశాల సమాజం శ్రేయస్సుకై దానం చేసిన ఆస్తి వక్ఫ్. మరి ఆ ఆస్తుల నిర్వహణకు సంబంధించిన బోర్డులో ఆ మతానికి చెందినవారే ఉండడం న్యాయం కదా. ఇతర మతస్థులకు అందులో భాగస్వామ్యం కల్పించడంలో ఔచిత్యమేమిటి? ఆక్రమణకు గురైన వక్ఫ్ భూములను కబ్జాదారులకు అప్పగించేందుకు ఈ కొత్త చట్టం దోహదం చేయడం లేదూ? రాజ్యాంగ నైతికత ఏమయినట్టు? మరి మెజారిటీ మతస్థుల ఆస్తుల నిర్వహణకు కూడా ఇటువంటి నిబంధనను నిర్దేశిస్తారా? సమ న్యాయాన్ని పాటించి మత స్వేచ్ఛకు తోడ్పడే చట్టం మాత్రమే భారత రాజ్యాంగ విహితమైనది. ఒక విజ్ఞుడు అన్నట్టు ఈ దేశ చరిత్రలో ముస్లింల స్థానం పాదసూచిక ప్రాయమైనది ఎంత మాత్రం కాదు, మన సమున్నత చరిత్రకు వారు సహ రచయితలు. మరి కొత్తవక్ఫ్ చట్టం వారికి న్యాయం చేస్తుందా? చేయనప్పుడు అది ముస్లింలకు అన్యాయం చేయడమే కాదూ? సహమతస్థులు, తోటి పౌరులకు వాటిల్లిన అన్యాయం విశాల సమాజం శ్రేయస్సునూ దెబ్బ తీయదూ? బహుళ మతాలు వర్ధిల్లుతున్న సమాజంలో ప్రభుత్వాలు చేసే చట్టాలు కేవలం అధిక సంఖ్యాక మతస్థుల అభిప్రాయాలను మాత్రమే ప్రతిబింబించినా లేదా ఇతర మతస్థుల మనోభావాలను మన్నించక, వారి ప్రయోజనాలను దెబ్బతీయడానికి ప్రయత్నించినా ఎవరికీ శ్రేయస్సు నివ్వదు. కొత్త వక్ఫ్ చట్టం ఇటువంటి అవాంఛనీయ పరిస్థితినే కల్పించింది. మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య వజ్రోత్సవాలు జరుపుకుంటున్న సంవత్సరంలో ఇటువంటి చట్టాన్ని తీసుకురావడమేమిటి? ఒకనాడు కవి తిలక్ బాధాతప్త హృదయంతో ప్రశ్నించినట్టు 'ఇది ఏ నాగరికతకు ఫలశ్రుతి?'

బెంగాల్ అసెంబ్లీకి మరో ఏడాది కాలంలో ఎన్నికలు జరగనుండడంతో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు తాపత్రయపడుతున్న తృణమూల్ కాంగ్రెస్, బెంగాల్‌లో అధికారాన్ని కైవసం చేసుకోవడాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న భారతీయ జనతా పార్టీ సంకుచిత రాజకీయాలకు పాల్పడుతున్నాయి. ఎన్నికల తరుణంలో ఈ తరహా ఆరోపణలు సహజమే అయినప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వాధినేతగా రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా శాంతిభద్రతలను పరిరక్షించడమనేది ముఖ్యమంత్రి విధ్యుక్త ధర్మం. ఈ నైతిక కర్తవ్య పాలనలోనే తనకూ, భారత ప్రజాస్వామ్యానికి శుభం సమకూరుతుందనే సత్యాన్ని మమతా దీదీ మరచిపోకూడదు.

# శత జయంతుల్లోనూ తేడాలా?

సాహిత్యంలో అందునా జానపద సాహిత్యంలో విశేషంగా కృషిచేసిన బిరుదురాజు రామరాజు శత జయంతి నామమాత్రపు ఉత్సవాలు ఇప్పుడు జరుగుతున్నాయి. ఒకప్పుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం కోసం తెలుగు ఎంఏ కోర్సులు ప్రవేశపెట్టించడంలోనూ, పీహెచ్‌డీ ప్రారంభించడంలోనూ ఆయన పాత్ర గణనీయమైనది. అదే సమయంలో సంస్కృత, తెలుగు, ఆంగ్లంలో అపూర్వ పాండిత్యం ఉన్నప్పటికీ, జానపద సాహిత్యాన్ని పరిశోధనకు స్వీకరించి, అందులో మొదటి పీహెచ్‌డీ పొందడం మాటలు కాదు.

ఆయనలో చెప్పుకోదగిన మరొక దృక్పథం తెలంగాణ. తన భాషా పరిశోధనలో తెలంగాణ, ఓరుగల్లు, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ లాంటి మండలాల్లో భాషను ఆయన ఉటంకించారు. విశాలాంధ్ర రాకముందే ఈ మూడు ప్రాంతాల కలయిక జరిగితే, జరిగినాక ఒక ప్రామాణిక భాష ఏర్పడాలని ఆయన సూచించారు. అప్పుడు ప్రాంతాలు ఒకదానిని మరొకటి సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాయని, ఈ పనిని పండిత పరిషత్తులు, విశ్వవిద్యాలయాలు చేయాలని ఆయన చెప్పారు. "విశాలాంధ్రకు హైదరాబాదు రాజధాని అయితే తెలంగాణ అవిభక్తంగా ఉన్న కాలంలో లాగా కేంద్ర స్థానం అవుతుంది. తెలంగాణ ప్రభావం దేశంలోని అన్ని రంగాల్లో ఉంటుంది. నన్నయ వంటి గోదావరి మండల వాస్తవ్యుని కవితలు, తిక్కన వంటి నెల్లూరు మండల వాస్తవ్యుని కవిత్వంలో కూడా తెలంగాణ పదాలు ఉన్నాయి. తెలంగాణ కవులు కొందరు ఇంట్లో తెలంగాణ భాష మాట్లాడుతూ బయటకు వచ్చినాక ఆంధ్ర ప్రభావంతో వచ్చే భాషను రాస్తున్నారు, మాట్లాడుతున్నారు" అని ఆ కాలంలోని దాశరథి, సి. నారాయణరెడ్డిల తీరుని ఆయన ఉదహరించారు. ఒక ప్రాంతాన్ని మరొక ప్రాంతం తక్కువ చేస్తే దాని పరిణామాలు వికృతంగా ఉంటాయని ఆయన ఆ రోజే అభిభాషించారు. తెలంగాణది తెలుగేనా? ఇక్కడ కవులు కూడా ఉన్నారా? అన్న ఆంధ్ర పండిత అహంకారానికి సమాధానంగా సురవరం ప్రతాపరెడ్డి తెచ్చిన గోలకొండ కవుల సంచికను తన 'రామరాజీయం' వ్యాస సంపుటిలో పేర్కొన్నారు.



**తెలంగాణ వాదానికి, ఆ కాలంలో పండితాదరణ పొందని జానపద గేయ వికాసానికి, బిరుదురాజు చేసిన కృషి సాహిత్య చరిత్రలో ఒక మైలురాయి. ఇలాంటి పరిశోధకునికి, విమర్శకునికి తెలంగాణ ఎంత గుర్తింపు ఇస్తున్నది?**

తెలంగాణ వైతాళికుల్లో ఒకరని చెప్పుకోదగిన కొమర్రాజు లక్ష్మణరావు చేసిన సేవలను, ఆంధ్ర విజ్ఞానానికి, చరిత్రకు, ఆయన చేసిన దోహదాన్ని బిరుదురాజు రామరాజు చాలా ఆర్తితో వివరించారు. ఆదేవిధంగా కొమర్రాజు వారు శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం, విజ్ఞాన చంద్రిక మండలి వికాసంలో ఎట్లా పాలుపంచుకున్నారో తెలియజేశారు. ఆ కాలంలోనే బిరుదురాజుగారు ఈ పొత్తంలో బూర్గుల రామకృష్ణారావు, కొమర్రాజు లక్ష్మణరావు, డాక్టర్ డి.ఎస్. రెడ్డి, ఆదిరాజు వీరభద్రరావు, మాడపాటి హనుమంతరావు లాంటి తెలంగాణ ప్రముఖుల సాహిత్య జీవితాలను చాలా స్ఫూర్తిమంతంగా ఈ పుస్తకంలో పొందుపరిచారు.

ఈ విధంగా తెలంగాణ వాదానికి, ఆ కాలంలో పండితాదరణ పొందని జానపద గేయ వికాసానికి, బిరుదురాజు చేసిన కృషి సాహిత్య చరిత్రలో ఒక మైలురాయి. ఇలాంటి పరిశోధకునికి, విమర్శకునికి తెలంగాణ ఎంత గుర్తింపు ఇస్తున్నది? 22 జూలై, 1925లో దాశరథి జన్మించారు. 16 ఏప్రిల్, 1925లో బిరుదురాజు జన్మించారు. ఇద్దరి శతజయంతి ఉత్సవాలు ఈ సంవత్సరమే. ఇద్దరూ తెలంగాణ పోరాట యోధులే. బిరుదురాజు కూడా ఇంకా తెలంగాణ స్వతంత్రం కాకముందు జరుగుతున్న పోరాటంలో దాశరథి వలెనే నిజాంని సవాల్ చేశారు. ఆ కాలంలో ఆయన నిజాం కళాశాల విద్యార్థి. విద్యార్థులు నిజాంకు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనకు ఆయన నాయకత్వం వహించారు. లాఠీచార్జిలో ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆయన మీద దాడి చేసి కర్రతో బలంగా మోదాడు. బిరుదురాజు కింద పడిపోయారు. ఇన్‌స్పెక్టర్ వదలకుండా ఆయన తల మీద తన బూటు కాలు వేసి తొక్కసాగాడు. తల నుండి, ముక్కు–చెవుల నుంచి కూడా రక్తం స్రవిస్తున్నది. కానీ ఇన్‌స్పెక్టర్ బూటు కాలు తీయడం లేదు. అదే కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న సరోజినీనాయుడి కూతురు ఈ దృశ్యం చూసి, పరిగెత్తుకొచ్చి ఇన్‌స్పెక్టర్‌ను లాగి చెంపదెబ్బ కొట్టింది. బిరుదురాజును వెంటనే హాస్పిటల్‌కి తరలించింది. బిరుదురాజు ఉద్యమ జీవితంలోని ఒక చిన్న ఉదాహరణ ఇది. ఉద్యమ సమయంలో ఎందరి గురించో పేర్కొన్న ఉద్యమ మహోపన్యాసకులు, ఈ సంఘటనను గాని, ఇంకా రామరాజుకు సంబంధించిన ఇతర విషయాలు గానీ ఎక్కడా పేర్కొన్న దాఖలాలు లేవు.

దాశరథి, బిరుదురాజుల శతజయంతి ఉత్సవ నిర్వహణలో ఎన్ని భేదాలు ఉన్నాయి? కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించే సెమినార్‌లో వాళ్ళ కుటుంబ సభ్యులే భోజనాలు ఏర్పాటు చేయవలసిన పరిస్థితి వస్తే ఈ ప్రభుత్వాలు ఎంత గుర్తింపు ఇచ్చినట్టు? బ్రాహ్మణుడిగానో రెడ్డిగానో, ఈ కాలంలోనైతే దళితుడుగానో పుట్టిన సాహితీవేత్త అయితే పరిస్థితి ఇలాగే ఉంటుందా? తెలంగాణ వచ్చాక ఇద్దరు బ్రాహ్మణ కవుల పేరు మీద అవార్డు ప్రవేశపెట్టారు. వాళ్లకి సమాంతరంగా ఉన్న బిరుదురాజు ఏమయ్యారు? బీసీ సమాజంలో అందునా భట్టురాజు కులంలో పుట్టడం ఒక నేరమా? ఇప్పటికీ "భట్రాజు పొగడ్తలు" అని కులాన్ని కించపరిచే సాహితీవేత్తలు, రాజకీయ నాయకులు మనకెందరో కనబడుతుంటారు. ఒక కులాన్ని అట్లా కించపరిచే హక్కు వాళ్లకి ఎవరు ఇచ్చారు? ఇప్పటికైనా బిరుదురాజు పాండిత్యానికి భాషా సేవకు, తెలంగాణ వాదానికి హేతువులైన ఆలోచనలకు, సరైన గుర్తింపు లభిస్తుందని ఆశిద్దాం. ఏ సామాజిక వర్గమైనా ప్రతిభ ఉన్నవాళ్లకు నిర్ద్వంద్వంగా గుర్తింపు లభించాలని డిమాండ్ చేద్దాం.

○ కాంచనపల్లి గోవర్ధన్‌రాజు

(రేపు బిరుదురాజు రామరాజు శతజయంతి)

# పాలకులు–మావోయిస్టులు, మధ్య రాజ్యాంగం!

రెండు దేశాలు ఆయుధాలతో తలపడితే యుద్ధం. ప్రభుత్వం తన ప్రజల మీద ఆయుధాలతో తలపడితే అంతర్యుద్ధం. ఛత్తీస్‌గఢ్, దంతేవాడలో ఇప్పుడు ఒక భీకర అంతర్యుద్ధం కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం భారీగా సైన్యాన్ని దింపి అక్కడ మావోయిస్టుల అణచివేత కార్యక్రమాన్ని చేపట్టింది. యుద్ధానికయినా అంతర్యుద్ధానికయినా లక్ష్యం మార్కెట్టే అని తెలిసినపుడు ఈ నక్సల్స్ ఏరివేత కార్యక్రమం ఎవరికోసమో ఊహించడం ఎవరికీ పెద్ద కష్టం ఏమీ కాదు.

రక్షణ వ్యవహారాలను బహిరంగపరచరు కాబట్టి, ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం ఎంత సైన్యాన్ని దించిందో, ఎన్నిరకాల ఆధునిక ఆయుధాలను వినియోగిస్తున్నదో ఆ వివరాలు అందుబాటులో లేవు. దాదాపు లక్షమంది పారామిలటరీ దళాలను బస్తర్‌లో దించారని ఒక అంచనా. దీని కోసం కేటాయించిన బడ్జెట్ విషయంలోనూ నమ్మశక్యంకాని అంకెలు వినిపిస్తున్నాయి.

కొన్నేళ్ళుగా సాగుతున్న ఈ అంతర్యుద్ధంలో ప్రస్తుతం కేంద్ర బలగాలదే పైచేయిగా ఉందని చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. ఆ ఉత్సాహంతోనే కేంద్ర హోం మంత్రి అమిత్ షా వచ్చే చైత్ర నవరాత్రి (మార్చి 2026) నాటికి 'నక్సల్ ముక్త్ భారత్'ను సాకారం చేస్తాం అంటున్నారు. బస్తర్‌లో పారా మిలటరీ దళాల దూకుడును చూస్తుంటే వచ్చే మార్చికన్నా ముందే వాళ్ళు ఆ లక్ష్యాన్ని సాధించనూ వచ్చు.

పీడన, అణచివేత కొనసాగుతున్నప్పుడు తిరుగుబాటు తప్పక వస్తుంది. ఏ సమాజానికైనా ఇది సహజ సూత్రం. కేంద్ర హోం మంత్రి ఆశిస్తున్నట్టు 'నక్సల్ ముక్త్ భారత్' ఏర్పడకపోయినా ఇప్పటికైతే 'నక్సల్ ముక్త్ బస్తర్' ఏర్పడవచ్చు. బస్తర్‌లో ఇంకో విచిత్రం జరుగుతోంది. అటు మావోయిస్టుల పైచేయి అయిన రోజైనా, ఇటు కేంద్ర సాయుధ బలగాల పైచేయి అయిన రోజైనా – ఇరువైపులా – చనిపోతున్నది ఆదివాసులే.

ఇదేమీ కొత్త కాదు. వందేళ్ళ క్రితం మన్యంలో సాగిన తిరుగుబాటును అణచివేయడానికి నాటి బ్రిటీష్ మిలటరీ అధికారి థామస్ జార్జ్ రూథర్ ఫోర్డ్ ఈ విధమైన వ్యూహాన్నే రచించాడు. ఇరువైపుల ఆదివాసులే చనిపోతుండడాన్ని చూసి తట్టుకోలేకే అల్లూరి శ్రీరామరాజు పోరాటాన్ని విరమించాలనే నిర్ణయం తీసుకున్నాడు.

ఆధునిక యంత్రీకరణ ప్రకృతిని ధ్వంసం చేస్తుంది. దాన్ని ఆదివాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తారు. వాళ్ల పోరాటాల్లో 'జల్ జంగల్ జమీన్' అనేది ప్రాణప్రదమైన నినాదం. ప్రకృతిని విధ్వంసం చేయడాన్ని ఒకప్పుడు పాపకార్యంగా భావించేవారు ఇప్పుడది 'అభివృద్ధి' అని పేరు మార్చుకుని గొప్ప పుణ్యకార్యంగా చెలామణి అవుతోంది.

మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు, దాని ఆచరణల మీద నమ్మకం, అభిమానం లేనివాళ్లు సహితం ఇప్పుడు ఆదివాసుల గురించి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అనేక పౌర సంఘాలు శాంతిచర్చలు నిర్వహించమని ఇటు మావోయిస్టుల్ని అటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాయి. ఈ ప్రతిపాదనలకు మావోయిస్టు పార్టీ సానుకూలంగా స్పందించింది.





**ఇప్పుడు కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీకి బౌద్ధిక సరోవరం ఆరెస్సెస్. అది మొదటి నుంచీ రాజ్యాంగాన్ని స్వదేశీ విలువలు, సాంప్రదాయాలకు వ్యతిరేకమైన విదేశీ భావన అంటూంది. మరోవైపు, మావోయిస్టులు సహితం రాజ్యాంగం పెట్టుబడీదారీ ప్రయోజనాలను నెరవేర్చేందుకు పుట్టింది అని విమర్శిస్తుంటారు. చెరోవైపు నుంచీ చెరో విధంగా రాజ్యాంగాన్ని వ్యతిరేకించే శక్తులు రాజ్యాంగం ప్రాతిపదికగా శాంతి చర్చలు ఎలా సాగిస్తాయో చూడాలి.**

ఇప్పుడు ప్రభుత్వం వంతు.

శాంతి చర్చల విషయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఊగిసలాటలో వుంది. దానికి ఒకవైపు, శాంతి చర్చలు జరిపి మావోయిస్టుల పీడ వదిలించుకోవాలనీ వుంది. మరోవైపు, ప్రస్తుతం వెనుకంజలో ఉన్న మావోయిస్టులు శాంతి చర్చల నెపంతో లభించే వెసులుబాటుతో మళ్ళీ పుంజుకుంటారనే భయాందోళనా వుంది.

మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరుపుతుందా లేదా? అన్నది ఒక అంశం. అయితే, దానికి రాజ్యాంగం ప్రాతిపదికగా వుంటుందా లేదా? అన్నది మరో ఆసక్తికర పార్శ్వం.

ఇప్పుడు కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీకి బౌద్ధిక సరోవరం ఆరెస్సెస్. అది మొదటి నుంచీ రాజ్యాంగాన్ని స్వదేశీ విలువలు, సాంప్రదాయాలకు వ్యతిరేకమైన విదేశీ భావన అంటూంది. మరోవైపు, మావోయిస్టులు సహితం రాజ్యాంగం పెట్టుబడీదారీ ప్రయోజనాలను నెరవేర్చేందుకు పుట్టింది అని విమర్శిస్తుంటారు. చెరో వైపు నుంచీ చెరో విధంగా రాజ్యాంగాన్ని వ్యతిరేకించే శక్తులు రాజ్యాంగం ప్రాతిపదికగా శాంతి చర్చలు ఎలా సాగిస్తాయో చూడాలి.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, మావోయిస్టు పార్టీ కూడా ఇప్పుడు రాజ్యాంగం మీద నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నాయి. మావోయిస్టులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి అని ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్‌శర్మ అంటున్నారు. ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నది అని మావోయిస్టులు ఆరోపిస్తున్నారు. శాంతి చర్చలకు సుముఖత వ్యక్తం చేస్తూ మావోయిస్టులు ఇటీవల విడుదల చేసిన ప్రకటనలో రెండుసార్లు రాజ్యాంగ విలువల ప్రస్తావన వుండడం ఒక విశేషం అనొచ్చు.

'కాల్పుల విరమణ' అనే గంభీరపు మాటల్ని పక్కన పెట్టి మావోయిస్టులే ఒక శాంతి కమిటీనో, ఒక రాయబారినో ప్రభుత్వం దగ్గరికి పంపించాలని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అంటున్నది. అమిత్ షా అయితే, మావోయిస్టులు ఆయుధాలను దించే పక్షంలో వాళ్ళ కోసం ఒక ఆకర్షణీయమైన ప్యాకేజీని అందజేస్తామంటున్నారు. బస్తర్‌లో విద్యా వైద్య సదుపాయాలు, రోడ్లు, కరెంటు, మంచినీటి సరఫరా వంటి మౌలిక సౌకర్యాలను కల్పించడమేగాక, ప్రతి కుటుంబానికి 60 కేజీల బియ్యం, కొంత నగదు, ఒక్కో గ్రామానికి కోటి రూపాయల మంజూరుతో పాటు ప్రముఖ మావోయిస్టుల తలల మీదున్న రివార్డుల్ని కూడా వారికే ఇస్తామంటున్నారు. ఇటీవల బస్తర్ పాండుం ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన అమిత్ షా మావోయిస్టుల్ని 'సోదరులు' అని సంబోధించడం విశేషం. "మీ మరణం మాకేమీ ఆనందాన్ని ఇవ్వదు. ఆయుధాలు వదిలిపెట్టి దేశ అభివృద్ధికి తోడ్పడండి" అని ఆయన పిలుపిచ్చారు.

బస్తర్‌లోనికి మావోయిస్టులు ప్రవేశించిన తరువాత అక్కడ ఒకరకం సమసమాజం ఏర్పడిందనే ప్రచారం ఒకటి జరుగుతోంది. ఇదొక తప్పుడు అవగాహన. ఆదివాసీ సమూహాల్లో అనాదిగానే ఒకరకం కమ్యూనిస్టు సమాజం వుంటుంది. అంతేకాక, మాతృస్వామిక సమాజ లక్షణాలు కూడా వాళ్ళలో వుంటాయి. అక్కడికి బయటి సమాజం ప్రవేశించినపుడే కాలుష్యం మొదలవుతుంది.

ఈ సందర్భంగా, ఒక సైద్ధాంతిక సందేహం కూడా ముందుకు వస్తోంది. సీపీఐ– మావోయిస్టులు ప్రకటిత కార్యక్రమానికీ బస్తర్‌లో వాళ్ళు సాగిస్తున్న కార్యకలాపాలకూ పొంతన వుందా? బయటి ప్రపంచానికి తెలిసినంత వరకు, వ్యవసాయ విప్లవం – నూతన ప్రజాస్వామిక విప్లవం – అంతిమంగా సామ్యవాద సమాజ నిర్మాణం అనే మూడంచెల కార్యక్రమం మావోయిస్టులకు వుంది. ఇందులో మొదటిదైన వ్యవసాయ విప్లవానికి 'దున్నేవానిదే భూమి' అనేది ప్రధాన నినాదం. దానికి అద్భుతంగా అనువైన ప్రాంతం గోదావరి, కృష్ణా మండలాలు. అక్కడి నాలుగు జిల్లాల్లో 95శాతం కమతాల్ని కౌలు రైతులే దున్నుతారు. డెల్టా ప్రాంతంలో వ్యవసాయిక విప్లవానికి అంతటి అనువైన అవకాశాల్ని వదులుకుని అడవులకు వెళ్ళడం అంటే వాళ్ళు తమ ప్రకటిత కార్యక్రమాన్ని రద్దు చేసుకుని వుండాలి.

మావోయిస్టులు విడుదల చేసిన లేఖలో ఫాసిజం ప్రస్తావన వుంది. దానికి ప్రధాన బాధితులు ఆదివాసులు, మత మైనారిటీలు అనే అర్థం వచ్చే వాక్యాలూ వున్నాయి. కార్పొరేట్ మతతత్వ నియంతృత్వానికి బాధితులయిన ఆదివాసులు, మత మైనారిటీలు, తదితర పీడిత సమూహాల విముక్తి కోసం ఒక కొత్త విప్లవ కార్యక్రమాన్ని రూపొందించుకున్నట్టు వాళ్లు ప్రకటించవచ్చు. వాళ్లు ఆ పనీ చేయలేదు. ఈ సైద్ధాంతిక గందరగోళం నుండి బయటపడనంత వరకు మావోయిస్టుల మీద బస్తర్ బయటవున్న సామాన్య ప్రజలకు ఒక స్పష్టత రాదు.

1970లలో నక్సలైట్ల కేసులు విచారణకు వచ్చినపుడు ఒక వాదన బలంగా వినిపించేది. ఆయుధాలతో మాత్రమే ప్రజావ్యతిరేక వ్యవస్థను నిర్మూలించగలమనేది నక్సలైట్ల ప్రధాన సిద్ధాంతం. ప్రభుత్వం కత వేరు. రాజ్యాంగాన్ని అమలు చేస్తామని రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారాన్ని చేపడుతాయి కనుక ప్రభుత్వాలు రాజ్యాంగానికే కట్టుబడి వుండి తీరాలి అనే భావన అప్పట్లో బలంగా వుండేది. ఆయుధాన్ని చేపట్టి నేరానికి పాల్పడిన వారిని మాత్రమే శిక్షించాలనీ, పీడక సమాజాన్ని ఆయుధాలతో కూల్చక తప్పదనే భావాలను శిక్షించరాదనీ అప్పట్లో న్యాయమూర్తులు సహితం బలంగా నమ్మేవారు. ఇప్పుడు ఆ భావన బలహీనపడింది. సమాజాన్ని మార్చడానికి హింస తప్పదని భావించేవారిని సహితం హింసతోనే అణచివేయాలనే భావన బలపడుతోంది.

'దేశ శత్రువులు సరిహద్దుకు ఆవల మాత్రమే వుండరు; దేశం లోపల కూడా ఉంటారు. ఆయుధాల్లోనే గాక ఆలోచనల్లోనూ దేశానికి ప్రమాదం పొంచివుంది' అనే ఒక కొత్త సిద్ధాంతాన్ని రక్షణ వ్యవహారాల సలహాదారు అజిత్ దొవ్వాల్ ముందుకు నెడుతున్నారు. దీనికి వారు పెట్టిన ముద్దు పేరు 'అర్బన్ నక్సల్స్'. ఆయుధాలను చేపట్టిన వారినేగాక, అలాంటి ఆలోచనలు కలిగిన వారిని సహితం శిక్షించాలనేది కొత్త సిద్ధాంతం. భావాలను సహితం శిక్షించాలనేది దీని సారాంశం. ఆలోచనాపరులు, పౌరసమాజం మీద విరుచుకుపడడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసుకుంటోంది అనడానికి ఇది సంకేతం. ఆలోచనాపరులు, పౌరసమాజం దీన్ని తీవ్రంగా ఖండించాలి. లేకుంటే పూడ్చుకోలేని నష్టం జరిగిపోతుంది.

■ డానీ

సమాజ విశ్లేషకులు



## కన్నీళ్ల బాష్పోత్సేకం

వృక్షాలు విలవిల్లాడుతున్నాయి
పచ్చని ఆకులన్నీ కన్నీళ్లు రాలుస్తున్నాయి
తల్లి వేరు శోకాలు తీస్తున్నది
పర్యావరణం మౌనం దాల్చి నిలుచున్నది

విత్తనం వేసిన చెయ్యి నిలిచిపోయి
మొక్కలు పెంచిన జీవి ఆగిపోయింది
అడవి దుఃఖంతో అతలాకుతలమవుతున్నది
చెట్టు చేమా బాధతో తలవంచింది

కోట్ల మొక్కలకు ప్రాణం పోసిన
దరిపెల్లి రామయ్య తల వాల్చిండని
వనంలోని ఆకులన్నీ కన్నీళ్ల బాష్పోత్సేకం

– అన్నవరం దేవేందర్

## ఆ వర్సిటీకి 'వనజీవి' పేరు పెట్టాలి

దాదాపు 50 ఏళ్లకు పైగా పర్యావరణ పరిరక్షణకు జీతం లేని సైనికుడిగా జీవితాంతం పనిచేసి, తుది శ్వాస విడిచిన వనజీవి రామయ్య పేరును తెలంగాణ అటవీ యూనివర్సిటీకి పెట్టాలి. కనపడ్డ చోటల్లా చెట్లు నాటి, పచ్చదనం మించిన ధనం లేదని ఎంతో మందిని చైతన్యవంతులను చేసిన పద్మశ్రీ రామయ్య లేకపోవడం బాధాకరం. ఆయన సేవలకు గుర్తుగా ప్రస్తుత తెలంగాణ అటవీ యూనివర్సిటీ పేరును 'పద్మశ్రీ వనజీవి రామయ్య తెలంగాణ పర్యావరణ, అటవీ యూనివర్సిటీ'గా నామకరణం చేయాలి. కోటికి పైగా మొక్కలు నాటడం ఒక రికార్డ్. ఆయనను ఆ విధంగా స్మరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం.

– అన్నవజ్ఝల కశ్యప

# తెలుగును బొందపెట్టి సంస్కృతానికి ఎరువేసి...

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు 2025–26 విద్యా సంవత్సరం నుంచి ద్వితీయ భాషగా తెలుగు స్థానే సంస్కృతాన్ని ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ ఆలోచన తెలుగు భాషాభిమానుల హృదయాల్లో శతఘ్నుల్ని పేల్చింది. ఇప్పటిదాకా ఈ సంస్కృత భాషా దారిద్ర్యం కేవలం ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలకే పరిమితమైంది. తెలంగాణ ఇంటర్మీడియెట్ బోర్డు తాజా ప్రతిపాదనతో ఇది ప్రభుత్వ కళాశాలలకు కూడా వ్యాపించబోతోంది.

ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ భాషగా సంస్కృతం తప్ప ఇతర భాషను ఎంచుకునే అవకాశం కూడా లేదు. అందులో చేరిన ప్రతి విద్యార్థీ తప్పనిసరిగా సంస్కృతమే తీసుకొని తీరాలి. మార్కుల యావలో పడి తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి తిలోదకాలిస్తున్న ప్రైవేటు కళాశాలల ఒత్తిడికి తలొగ్గి ఇలాంటి విషపూరిత ఆలోచన చేయడం నిజంగానే కూర్చున్న కొమ్మను మనం నరుక్కోవడమే. ఒక వైపు ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలు మాతృభాషలకు, ప్రాంతీయ భాషలకు ఎంతో గౌరవమిచ్చి వాటి అభివృద్ధికి ఎన్నో నిధులు కేటాయిస్తుంటే, జాతీయ విద్యా విధానం–2020 కూడా ప్రాంతీయ భాషలకే ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, తెలంగాణ ఇంటర్మీడియేట్ బోర్డు ఇలాంటి గడ్డు నిర్ణయం తీసుకోవడం తెలుగువారిని అవమానించడమే.

గత రెండున్నర దశాబ్దాలుగా ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్య నిర్లక్ష్యానికి గురై యాభై శాతం మంది విద్యార్థులు తప్పులు లేకుండా తెలుగు అక్షరమాల, గుణింతాలు, ఒత్తులు రాయలేని వారే ఉన్నారు. ఇంటర్మీడియేట్, డిగ్రీ విద్యార్థులకు కూడా దోషాలు లేకుండా ఒక ప్రామాణిక లేఖ రాయరాదు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసన మండలిలో చేసిన ఆవేదనపూరిత ప్రసంగంలో తెలిపినట్లు అయిదవ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో నలభై శాతం మంది విద్యార్థులకు మూడవ తరగతి తెలుగు వాచకం చదవరాదు. మూడవ తరగతి చదువుతున్న విద్యార్థులకు రెండవ తరగతి తెలుగు వాచకం చదవరాదు. తెలుగు పరిస్థితే ఇలా ఉంటే సంస్కృతం పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేయవచ్చు.

తెలుగు నేర్చుకోవడం కంటే సంస్కృతం నేర్చుకోవడం చాలా కష్టం. సంస్కృతంలో కనీస భాషణ, పఠన, లేఖన సామర్థ్యాలు సాధించాలంటే సుమారు మూడు వేల శబ్దాలు నోటికి రావాలి. (రామః–రామౌ–రామాః) కొన్ని వేల క్రియాపదాలు, ధాతువులు, విభక్తులు, అవ్యయములు, సమాసాలు, వృత్తులు, సర్వనామ శబ్దాలు (సర్వ, విశ్వ... యుష్మద్, అస్మద్, కిం, ఇదమ్, అదస్ మొదలైనవి) ఇలా చాలా పద సామగ్రి నేర్చుకోవాలి. ఇంటర్మీడియెట్‌లో రెండేళ్ళ పాటు సంస్కృతం చదివిన తొంభై శాతం మంది విద్యార్థులకు సంస్కృతంలో కనీసం ఐదు వాక్యాలు తప్పులు లేకుండా మాట్లాడరాదు. రెండు వాక్యాలు వ్యాకరణ దోషాలు లేకుండా రాయరాదు. అలాంటి సంస్కృతాన్ని కేవలం మార్కుల కోసం, స్కోరు కోసం అమాయక విద్యార్థుల మీద రుద్దడం ఎందుకు? భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలులో లేని, మాట్లాడని భాషను బలవంతంగా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాల మాయలో పడి విద్యార్థుల మీద రుద్దడం ఎంత వరకు సమంజసం? రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు వెంటనే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలి.

**ఇంటర్మీడియెట్‌లో రెండేళ్ళ పాటు సంస్కృతం చదివిన తొంభై శాతం మంది విద్యార్థులకు సంస్కృతంలో కనీసం ఐదు వాక్యాలు తప్పులు లేకుండా మాట్లాడరాదు. రెండు వాక్యాలు వ్యాకరణ దోషాలు లేకుండా రాయరాదు. అలాంటి సంస్కృతాన్ని కేవలం మార్కుల కోసం, స్కోరు కోసం అమాయక విద్యార్థుల మీద రుద్దడం ఎందుకు?**





సంస్కృత భాష ఇంత ఆకర్షణీయ భాషగా, స్కోరింగ్ సబ్జెక్ట్‌గా మారడానికి ప్రధాన కారణం సంస్కృత అధ్యాపకులు అడ్డగోలుగా మూల్యాంకనం చేసి నూటికి నూరు, తొంభై తొమ్మిది మార్కులు వేయడమే. ప్రశ్నలు కూడా బట్టీయం పట్టి రాసేవి ఎక్కువ. సంస్కృతాన్ని అమితంగా ప్రేమించి ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు దాన్ని ఇంతగా దత్తత తీసుకోవడానికి కారణం సంస్కృతాన్ని ఉద్ధరించడమో, సంస్కృత వాఙ్మయాన్ని రక్షించాలనే దీక్షతోనో ఏమీ కాదు. మిగతా గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్ర అధ్యాపకులను నియమించుకున్నట్లుగా సంస్కృతం అధ్యాపకుడిని సంవత్సరం పాటు నియమించుకొని జీతాలు ఇవ్వక్కరలేదు. చివరి నెల అంటే ఫిబ్రవరి నెలలో మాత్రమే సంస్కృత అధ్యాపకుడిని నియమించుకొని ఒక్క నెలలోనే సిలబస్ అంతా చెప్పించి లేదా అయిందనిపిస్తారు. దాని వల్ల సో కాల్డ్ కళాశాలలకు స్కోరుకు స్కోరు, డబ్బు ఆదాకు ఆదా.

నిజంగానే ఏ రాష్ట్ర ప్రభుత్వం, ఏ రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు కూడా చేపట్టని సంస్కృత భాష ఉద్ధరణను తెలంగాణ ప్రభుత్వం, ఇంటర్మీడియెట్ బోర్డు భుజాన వేసుకున్న మాట వాస్తవమే అయితే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియేట్‌లో సంస్కృతం ద్వితీయ భాషగా తీసుకున్న విద్యార్థులు వార్షిక పరీక్షల్లో సంస్కృతాన్ని తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో కాకుండా దేవనాగరి లిపిలోనే రాయాలనే నిబంధన పెట్టాలి. అప్పుడు సంస్కృతానికి నిజమైన న్యాయం చేసినట్టు. అంతేగాని మార్కుల కోసం ఇలాంటి తప్పుడు నిర్ణయం తీసుకోవడం హాస్యాస్పదం. మార్కుల కోసం చదువా? మానసిక, సాంస్కృతిక వికాసం, విజ్ఞానం, తార్కిక ఆలోచన కోసం చదువా అనేది ముందు తేల్చుకోవాలి. పోనీ అంగ్ల భాష నేర్చుకోవడం ద్వారా కలిగే ఉపాధి అవకాశాలు కూడా సంస్కృత భాష అధ్యయనం ద్వారా ఏమైనా కలిగే అవకాశాలు ఉన్నాయా? అనేది కూడా తల్లిదండ్రులకు వివరించాలి. అంతేకాని కేవలం ప్రైవేటు కళాశాలల మోజులో పడి విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలు ఆడటం సమంజసం కాదు.

ఇంటర్మీడియేట్ విద్యార్థులకు దాదాపుగా తెలుగును పూర్తిగా తొలగించి సంస్కృతాన్ని ప్రవేశపెట్టడం కాదు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోలాగా అన్ని ప్రైవేటు, కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి ఏడవ తరగతి దాకా ప్రతి విద్యార్థి తెలుగు మాధ్యమంలోనే చదివేలా నిబంధన విధించాలి. అలాగే ఎనిమిదవ తరగతి నుంచి డిగ్రీ దాకా తెలుగును ద్వితీయ భాషగా కాదు, ప్రథమ భాషగా చదవాలనే నిర్బంధం రావాలి. ఇంగ్లీష్‌ను ద్వితీయ భాషగా చదవాలి. హిందీ, ఫ్రెంచ్, అరబ్బీ, ఉర్దూ, సంస్కృతం తదితర భాషల్ని తృతీయ భాషగా, లేదా ఐచ్ఛిక భాషగా చదివే వసతి కల్పించాలి. అంతేగాని తెలుగు రాష్ట్రంలో తెలుగును తొలగించడమంటే మన తలను మనం నరుక్కోవడమే.

కొన్నేళ్ళ పోరాటం తర్వాత 2021 నుండి డిగ్రీ ఫైనలియర్‌లో కూడా తెలుగును ప్రవేశపెట్టి బోధిస్తున్నాం. దీన్ని కూడా తొలగించి తెలుగుకు క్రెడిట్స్ తగ్గించాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది కూడా ప్రమాద హేతువే. ఇప్పుడిప్పుడే డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు కొంత మందైనా రచయితలుగా మారుతున్నారు. రచనా ప్రక్రియ పట్ల అవగాహన పెంచుకుంటున్నారు. మరికొంత మంది ఎం.ఏ తెలుగు చదవడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ సందర్భంలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు తెలుగు తీసివేస్తే వారి రచనాసక్తిపైన, సృజనశక్తిపైన నీళ్ళు చల్లినట్టే.

తెలుగు భాషా పునాదులు విద్యార్థుల్లో బలంగా పడాలంటే ప్రాథమిక పాఠశాలల్లోనే తెలుగు భాషోపాధ్యాయులను నియమించాలి. తెలుగు భాష అభివృద్ధికి, ఇలాంటి తప్పుడు నిర్ణయాలు భవిష్యత్‌లో తీసుకోకుండా తెలుగును రక్షించడానికి ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. దానికి తగిన నిధులు కేటాయించాలి. ఇప్పటికీ అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేయలేకపోయాం. తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్‌ను, తెలుగు అకాడమి డైరెక్టర్‌ను నియమించుకోలేకపోయాం. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వానికి తెలుగు భాషపట్లగల చిత్తశుద్ధిని వ్యక్తీకరిస్తున్నాయి.

దశాబ్దాలుగా ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు చేస్తోన్న దోపిడీకి అడ్డుకట్ట వేసి రాష్ట్రంలోని మొత్తం ఇంటర్మీడియేట్ విద్యా వ్యవస్థను, ఆయా ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలను జాతీయం చేసి ప్రభుత్వం చొరవ తీసుకొని ఇంటర్మీడియేట్ విద్యను హస్తగతం చేసుకోసుకోవాలి. లేదంటే "తెలుగెక్కడుందిరా తెలుగోడా...? నీ తెలుగు తెల్లారె తెలుగోడా.." అని శోకంపెట్టి ఏడవాల్సి వస్తుంది. తెలుగును రక్షించుకోవాలన్నా బొందపెట్టి సంస్కృతానికి ఎరువుగా మారాలన్నా అది ప్రజల చేతుల్లో ఉంది.

● డా. వెల్దండి శ్రీధర్

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA

మంగళవారం 15 ఏప్రిల్ 2025






# రాజ్యాంగ ప్రదాతకు జేజేలు

- ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు
- హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో సందడి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు హనుమకొండ జిల్లాలో ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, అధికారులు, వివిధ వర్గాలు అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఉదయం నుంచీ హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌కు తాకిడి పెరిగింది. పలువురు పెద్దఎత్తున తరలివచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. వారిలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్‌నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, మేయర్ సుధారాణి తదితరులు ఉన్నారు.

- వడ్డెపల్లి

6



# పుణ్యక్షేత్రానికి వెళ్లొస్తూ..

ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృత్యువాత

- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- హైవేపై లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- బాధితులంతా ఒకే కుటుంబానికి చెందినవారు
- హైదరాబాద్‌లో స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్ వాసులు
- కాళేశ్వరం దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం
- స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్ వద్ద ఘటన

7



కారులో ఇరుక్కున్న శ్రీను మృతదేహం



రమణకుమారి మృతదేహం



అనూష మృతదేహం

# ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా..

## అంగన్వాడీ కేంద్రాల్లో 'పోషణ పక్షం'

- హనుమకొండ జిల్లాలో ఈనెల 8న ప్రారంభం
- 'విద్య, ఆరోగ్యం' లక్ష్యంగా కార్యక్రమాలు
- వేయి దినాల ప్రాముఖ్యతపై అవగాహన
- గర్భిణులు, బాలింతలు, కుటుంబ సభ్యులకు ఉపయుక్తం
- 15 రోజులపాటు నిర్వహణ.. ఏప్రిల్ 22న ముగింపు..



ఇటీవల పెంబర్తిలో జరిగిన పోషణ పక్షం కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి, సిబ్బందితో పాటు అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు





హనుమకొండ సిటీ, ఏప్రిల్ 14: గర్భిణులు, బాలింతలు, 0-6 ఏళ్ల చిన్నారుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా చేపట్టిన 'పోషణ పక్షం-2025' కార్యక్రమం హనుమకొండ జిల్లాలో కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 'పోషణ్ పక్షం' జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఈ నెల 8న ఆరంభమైంది. 15రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ఏప్రిల్ 22న ముగుస్తుంది. మహిళా, శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో ఇతర ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో 'పోషణ పక్షం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

### లక్ష్యాలు

మహిళా, శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమం, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల భాగస్వామ్యంతో కార్యక్రమం కొనసాగుతోంది. పోషణ్ భీ-పడాయి భీ (పౌష్ఠికాహారం-విద్య) సూత్రంతో పోషణ పక్షం-2025 చేపట్టారు. జిల్లాలోని 778 అంగన్వాడీ కేంద్రాల్లో 15 రోజుల పాటు నిర్వహిస్తారు. అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన బాలింతలు, గర్భిణులు, ప్రీస్కూల్ పిల్లలకు బలమైన పౌష్ఠికాహారం తీసుకోవాల్సిన విధానాలను దృశ్యరూపకంగా, మౌఖిక వివరణ వివిధ మార్గాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ర్యాలీల నిర్వహణ, గ్రామీణ, మండల, నియోజకవర్గకేంద్రాల్లో పాటు జిల్లా కేంద్రంగా వివిధ రూపాల్లో అవగాహన సభలు, సమావేశాల నిర్వహణ ప్రణాళికగా పోషణ్ పక్షం కొనసాగుతోంది. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు, చికిత్సలు, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన పౌష్ఠికాహారం, చిన్నారులకు బలవర్ధక ఆహారం అందించడం, అంగన్వాడీ కేంద్రాల్లో అందచేస్తున్న తీరు తదితర అంశాలను వివరిస్తున్నారు.

### వేయి దినాల ప్రణాళిక విశిష్టత

తల్లితో పాటు శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించేందుకు 'వేయి దినాల' ప్రణాళిక ప్రాముఖ్యత విశిష్టతను అంగన్వాడీ కేంద్రాల్లో తెలియచేస్తున్నారు. గర్భాధారణ నుంచి ప్రసవం దాక గర్భిణీకి తొమ్మిది నెలల సమయం పడుతుంది. ఈ కాలాన్ని 270 రోజులుగా లెక్క కడతారు. ఈ సమయంలో గర్భిణీ తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పౌష్ఠికాహారం అంశాలను అంగన్వాడీ కేంద్రాల్లో వివరిస్తూ ఆ మేరకు వారికి పౌష్ఠికాహారాన్ని అందిస్తున్నారు. ఇక ప్రసవం తరువాత తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్య పరిరక్షణ చర్యలను పోషణ పక్షం కార్యక్రమంలో వివరిస్తున్నారు. శిశువు జననం నుంచి ముర్రుపాలు పట్టించడం, ఆపై రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాల శ్రేష్ఠత, ఆరోగ్యం అంశాలను తల్లితో పాటు భర్త ఇతర కుటుంబ సభ్యులకు సైతం అవగాహన కల్పించే చర్యలను చేపడుతున్నారు. శిశువు రెండేళ్ల వయస్సుకాలాన్ని మొత్తం 730 రోజులుగా లెక్క కడుతున్నారు. ఈ క్రమంలో గర్భిణీ నుంచి ప్రసవం వరకు తల్లి ఆరోగ్యం కోసం 270 రోజులు, శిశువు రెండేళ్ల వయస్సు లెక్కన 730 రోజులు ఈ రెండింటినీ కలిపితే వేయి రోజుల ప్రణాళికతో తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణ కాలంగా పరిగణించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. వేయి దినాల ప్రత్యేకతను అంగన్వాడీ కేంద్రాల్లోనే కాక ఆయా గ్రామాలు, మండలాల ప్రధాన కేంద్రాల్లో దృశ్య శ్రవణ మార్గాలు, పోస్టర్లు, కరపత్రాలు, ఇంటింటి సందర్శన తదితర మార్గాల ద్వారా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఇతర శాఖల అధికారులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు అవగాహన కల్పిస్తున్నారు.

### విద్యకు ప్రాముఖ్యత

'పోషణ్ భీ - పడాయి భీ' (ఆరోగ్యంతో పాటు విద్య కూడా..) సూత్రంతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ దశలో శిశువులకు విద్యపై ఆసక్తి కల్పించే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యత వివరింపు తద్వారా పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపించడం వంటి చర్యలపై దృష్టి పెట్టారు. ఈ మేరకు పక్షత్సవాల్లో అవగాహన కల్పన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యపై ఆసక్తి కల్పించేందుకు వినూత్న పద్ధతుల్లో చేపడుతున్న బోధన మార్గాలను తెలియచేస్తున్నారు. ఆట వస్తువులు, బొమ్మలు ఇతరత్రా మార్గాల ద్వారా వారికి విద్యపై ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకుంటున్నారు. చిరు ప్రాయంలోనే పిల్లలకు విద్యపై ఆసక్తి కల్పించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైనా పునాదులు వేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

### 23తో ముగింపు

ఈ నెల 8న పోషణ పక్షం - 2025 కార్యక్రమాన్ని ఆరంభించారు. 22న ముగుస్తుంది. హనుమకొండ జిల్లా కేంద్రంగా త్వరలో భారీ కార్యక్రమ నిర్వహణకు మహిళా, శిశు సంక్షేమ శాఖ చర్యలు చేపడుతోంది. ఇటీవలే అంగన్వాడీ కేంద్రాల్లోని 0-6 ఏళ్ల చిన్నారులకు నేత్ర పరీక్షలను ప్రభుత్వం చేపట్టింది. రెండు నెలల పాటు జిల్లాలోని 778 అంగన్వాడీ కేంద్రాల్లో ప్రణాళిక మేరకు ఆయా రోజుల్లో పరీక్షలను నిర్వహించి దృష్టి లోపాలను గుర్తిస్తున్నారు. ఒకవైపు నేత్ర పరీక్షలు మరో వైపు పోషణ పక్షం కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు ఇతర సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు తదితరులు తలమునకలయ్యారు.

# వేధింపులతో వృద్ధుడి బలవన్మరణం

ఆస్తి కోసం కొడుకు, కోడలు ఒత్తిడితో ఆత్మహత్య

- వర్ధన్నపేట మండలంలోని కడారిగూడెంలో ఘటన
- కేసు నమోదు చేసిన వర్ధన్నపేట పోలీసులు

6



# ఎంఆర్‌డీలో ప్రతీ పనికో రేటు

సర్టిఫికెట్ల జారీలో ఓ జూనియర్ అసిస్టెంట్ చేతివాటం

6



# నిరుద్యోగులకు 'రాజీవ్' మంచి అవకాశం

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



కాశిబుగ్గ సర్కిల్ ఆఫీసులో దరఖాస్తులు పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 14 ( ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులకు రాజీవ్ యువ వికాసం పథకం మంచి అవకాశం అని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారంతో ముగుస్తుండడంతో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెలవు రోజు అయినా హెల్ప్‌డెస్కులలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఈ నెల 12, 13, 14 తేదీలలో ప్రభుత్వ సెలవులు ఉన్నా కూడా ప్రజల సౌకర్యార్థం బల్దియా, కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాలలో దరఖాస్తులు స్వీకరించామన్నారు. సోమవారం సాయంత్రం వరకు 10,254 దరఖాస్తులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. కమిషనర్ వెంట బల్దియా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కృషి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి




కేయూ నుంచి పెట్రోల్ పంపు వరకు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం, కావ్య తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో 'భాగంగా జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో భాగంగా సోమవారం 52, 53, 44 డివిజన్‌ల లో తలపెట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కేయూ క్రాస్ నుంచి పెట్రోల్ పంపు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు రాజ్యాంగం పట్ల ఏ విధంగా వ్యవరిస్తున్నాయో ప్రజలకు ఈ యాత్ర ద్వారా తెలియజేస్తున్నామన్నారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను అమిత్ షా అవమానపరిచాడన్నారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పదేళ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ.. రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామ్య పాలనను సాగిస్తోందన్నారు. పేద ప్రజలకంటే బడాబాబులే ముఖ్యమన్నట్లుగా ప్రధాని మోదీ దేశాన్ని పాలిస్తున్నారని ఆరోపించారు. అనంతరం డివిజన్‌లలో నాయకులు, కార్యకర్తలు ర్యాలీ తీశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎంపీ కడియం కావ్య, ఎంఎల్‌సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రు పాషా, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ఏఐసీసీ నాయకుడు బెలయ్యనాయక్, 54 డివిజన్ కార్పొరేటర్ గుంటి రజితా శ్రీనివాస్, నాయకులు బంక సంపత్, నాయి ని లక్ష్మారెడ్డి, మట్టెడ అనిల్, రహీమున్నీసా బేగం ఎర్ర మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.53.28 లక్షల
# గంజాయి పట్టివేత
### నలుగురి అరెస్టు : డీఎస్పీ తిరుపతిరావు

కురవి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కురవి మండల కేంద్రం మీదుగా తరలిస్తున్న రూ.53,28,500 విలువైన ఎండు గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇందులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు నిందితుల అరెస్టు చూపుతూ వివరాలను వెల్లడించారు. ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆదేశాలతో ఆదివారం మధ్యాహ్నం ఎస్సై గండ్రాతి సతీష్ కురవిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓం ఫంక్షన్ హాల్ ఎదురుగా రోడ్డుపై అనుమానాస్పదంగా ఆగివున్న ఒడిశా నెంబరు ఓడి 02 ఏజె 3351 గల కారును ఎస్సై సిబ్బందితో తనిఖీ చేశారు. 3 బస్తాల ఎండు గంజాయి లభించగా, కారులోని నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఆపై కారులోని గంజాయిని తూకం వేయగా, 106 కిలోల 960 గ్రాములు ఉందని, బహిరంగ మార్కెట్‌లో దీని విలువ రూ.53 లక్షలు ఉంటుందని తెలిపారు.

మరిపెడ మండలం తండ ధర్మారంకు చెందిన బానోత్ మహేందర్, ఒడిశా మల్కన్‌గిరి జిల్లా గుద్నాద్గ గ్రామానికి చెందిన నర్సింగ్ మడి, రామచంద్ర మడి, అదే జిల్లా బెదురుపల్లికి చెందిన చంద్ర మాఢ్యమిలు ఒడిశాలోని చిత్రకొండ వద్ద గంజాయిని కొనుగోలు చేశారని డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. కారులో విశాఖపట్నం మీదుగా ఖమ్మం తీసుకువచ్చి మరిపెడ, కురవి మీదుగా హైదరాబాద్‌లో గంజాయిని అమ్మేందుకు ప్లాన్ చేసుకున్నట్లు చెప్పారు. కురవి ఎస్సై సతీష్ తనిఖీల్లో గంజాయి స్మగ్లర్లు దొరికిపోయినట్లు పేర్కొన్నారు. స్మగ్లర్లు నలుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరి నుంచి ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్సై సతీష్, ఏఎస్సై జి.వెంకన్న, హెడ్‌కానిస్టేబుల్ ఉపేందర్‌రావు, కానిస్టేబుళ్లు సమ్మయ్య, బి.రమేష్, హరిబాబు, కాశీరామ్, భద్రు, గణపతిలను డీఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు.

# ఎవరికీ పట్టని కార్మికుల కష్టాలు

- తొర్రూరు కార్మిక శాఖ పరిధిలోకి కేసముద్రం
- పథకాల వర్తింపు కోసం కార్మికుల ఇబ్బందులు
- మానుకోట పరిధిలోకి మార్చాలని డిమాండ్
- కేసముద్రం మండలంలో 5 వేల మంది.. జిల్లాలో 82 వేల మంది కార్మికులు

కేసముద్రం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమాన్ని పాలకులు గాలికి వదిలేశారనడానికి ఇదో ఉదాహరణ. కొత్త జిల్లాలు ఏర్పడితే కార్యాలయాలు మరింత దగ్గర అవుతాయని అందరూ భావిస్తారు. ఇందుకు భిన్నంగా 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయాన్ని 32 కిలోమీటర్ల దూరంలోని పట్టణానికి మార్చి కార్మికులను వ్యయ ప్రయాసలకు గురిచేస్తుండడమే గత, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. మహబూబాబాద్ జిల్లాలో కార్మిక శాఖ పరిధిలో మహబూబాబాద్, తొర్రూరు డివిజన్ కేంద్రాల్లో సహాయ కార్మిక శాఖ అధికారి (ఏఎల్‌వో) కార్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 82,919 మంది భవన నిర్మాణం, ఇతర రంగాల్లోని కార్మికులు నమోదై ఉన్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు 12,925 మంది కార్మికులకు రూ.73.13 కోట్ల పరిహారాన్ని కార్మిక శాఖ ద్వారా అందించారు. జిల్లా ఏర్పడక ముందు గూడూరు, కొత్తగూడ మండలాలు నర్సంపేట ఏఎల్‌వో పరిధిలో ఉండగా, బయ్యారం, గార్ల మండలాలు ఇల్లెందు ఏఎల్‌వో పరిధిలో ఉన్నాయి. 2016లో మహబూబాబాద్ జిల్లా ఏర్పాటు అనంతరం కార్మిక శాఖలో మండలాల విభజనను చేశారు. మహబూబాబాద్ ఏఎల్‌వో కార్యాలయ పరిధిలో మహబూబాబాద్, గూడూరు, గంగారం, కొత్తగూడ, బయ్యారం, గార్ల, డోర్నకల్, కురవి మండలాలు, తొర్రూరు ఏఎల్‌వో పరిధిలో తొర్రూరు, పెద్దవంగర, కేసముద్రం, నెల్లికుదురు, నర్సింహులపేట, దంతాలపల్లి, మరిపెడ, చిన్నగూడూరు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లోని సంఘటిత, అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ పథకాలను అమలు చేయడం ఏఎల్‌వో కార్యాలయాల విధి. కార్మికులకు ప్రమాదాలు జరిగిన సమయంలో వాటి పరిహారాన్ని పొందేందుకు ఏఎల్‌వో కార్యాలయాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

### భవన నిర్మాణ కార్మికుల పథకాలివే..

రాష్ట్ర కార్మిక శాఖ నుంచి భవన, ఇతర నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డు ద్వారా ఆర్థిక సహాయం అందించే పథకాలు అమలవుతున్నాయి. కార్మిక శాఖలో నమోదై ఉన్న కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.6 లక్షలు, సహజ మరణానికి రూ.1లక్ష పరిహారం ఇస్తారు. ఆస్పత్రి ఖర్చులను గరిష్ఠంగా నెలకు రూ.4500 చొప్పున, రోజుకు రూ.300 చొప్పున అందిస్తారు. అంత్యక్రియలకు రూ.30వేలు, శాశ్వత అంగవైకల్యానికి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు, మహిళా కార్మికులకు ప్రసూతి అయితే రూ.30వేల సహాయాన్ని అందిస్తారు. కృత్రిమ అవయవాల కొనుగోలుకు నిధులను మంజూరు చేస్తారు. ఇవేకాకుండా కార్మికులకు రోజుకు రూ.300 చొప్పున ఉపకార వేతనం ఇస్తూ నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. భవన నిర్మాణ కార్మికుడిగా నమోదు కాని వ్యక్తి పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.50వేలు, అంగవైకల్యానికి రూ.20వేలు పరిహారం ఇస్తారు. ఇవేకాకుండా తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా దుకాణాలు, సంస్థలు, పరిశ్రమలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంఘాలు, ట్రస్టులలో పనిచేస్తూ కార్మిక సంక్షేమ నిధికి జమచేసే కార్మికులకు పథకాలు అమలు చేస్తున్నారు.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో పని చేస్తున్న కార్మికులు (ఫైల్)

### 32 కిలోమీటర్ల దూరంతో వ్యయప్రయాసలు..

మహబూబాబాద్ జిల్లాలోనే ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా ఉన్న కేసముద్రం మండలాన్ని మానుకోట ఏఎల్‌వో పరిధిలోంచి తొర్రూరు ఏఎల్‌వో పరిధిలోకి మార్చడం కార్మికులను వ్యయప్రయాసలకు గురిచేస్తోంది. కేసముద్రంలోని ప్రధాన కార్మిక సంఘాలకు అనుబంధంగా గుమాస్తాలు, హమాలీ వర్కర్స్, బండ్ల హమాలీలు, పసుపు డోలా, గ్రానైట్ క్వారీ, భవన నిర్మాణ కార్మిక, ట్రాన్స్‌పోర్ట్ కార్మిక, సివిల్ సప్లయిస్ హమాలీ, మిల్లు డ్రైవర్స్, పెయింటింగ్ వర్కర్స్ ట్రాక్టర్ డ్రైవర్స్, మధ్యాహ్న భోజన కార్మిక, దడువాయి, అంగన్‌వాడీ, ఐకేపీ సీఏలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, రిక్షా, కిరాణా షాపు, హోటళ్లలో పనిచేస్తున్న వారితో కార్మిక సంఘాలు ఉన్నాయి. వీరే కాకుండా ఉపాధి హామీ పథకం కూలీలు, బిహార్ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు వెరసి 5వేలకు పైగా మంది కార్మికులు కేసముద్రం మండలంలో ఉన్నారు. వీరందరికీ కార్మిక శాఖ నుంచి సంక్షేమ పథకాలకు రావాల్సిన ప్రయోజనాలు, ప్రమాదాలకు అందాల్సిన పరిహారం పొందేందుకు ఏఎల్‌వో కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. తొర్రూరులోని కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లిరావడం కార్మికులు, వారి కుటుంబ సభ్యులను అనేక ఇబ్బందులకు గురిచేస్తోంది. 32 కిలోమీటర్ల దూరంతోపాటు కేసముద్రం నుంచి రవాణా సౌకర్యాలు సక్రమంగా లేని తొర్రూరుకు వెళ్లి వచ్చేందుకు ఒక రోజంతా సమయం పడుతోంది. ఇప్పటికైనా కేసముద్రం మండలాన్ని గతంలో ఉన్నట్లుగానే మహబూబాబాద్ ఏఎల్‌వో పరిధిలోకి మార్చాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అలా వీలుకాని పక్షంలో తొర్రూరులోని ఏఎల్‌వో కార్యాలయాన్ని అధిక సంఖ్యలో కార్మికులతో పారిశ్రామిక కేంద్రంగా పేరున్న కేసముద్రానికి తరలించాలని, ఈ దిశగా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

**జిల్లాలోని ఏఎల్‌వోల పరిధిలో ఉన్న కార్మికులు**

| ప్రాంతం పేరు | ఏఎల్‌వోగా నమోదైన వారు | రెన్యువల్ చేసుకోని వారు | కొనసాగుతున్న వారు |
|---|---|---|---|
| మహబూబాబాద్ | 38,303 | 14,116 | 24,187 |
| తొర్రూరు | 44,616 | 15,162 | 29,454 |
| మొత్తం | 82,919 | 29,278 | 53,641 |

### చట్టసభల్లో ప్రస్తావించి పరిష్కరించాలి



వేలాది మంది కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న కార్మిక శాఖ కార్యాలయాన్ని తొర్రూరు పరిధి నుంచి మహబూబాబాద్ పరిధికి మార్చాలి. దీనికి అనుగుణంగా ప్రస్తుత పాలకులు చట్టసభల్లో సమస్యను ప్రస్తావించి పరిష్కారం చూపాలి. శాసనసభ గెజిట్ ద్వారా కార్యాలయాన్ని మార్చే వీలుంది. ఈ మేర కు శాసనసభ సభ్యులు చొరవ చూపాలి.

**కంచ వెంకన్న, ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు, కేసముద్రం**

### కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు..



పారిశ్రామిక కేంద్రంగా ఉన్న కేసముద్రం మండలాన్ని 32 కిలోమీటర్ల దూరంలోని తొర్రూరు ఏఎల్‌వో కార్యాలయానికి కలపడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల భవన నిర్మాణ కార్మికులకు పరిహారం కోసం దరఖాస్తు చేసేందుకు వ్యయప్రయాసలకు గురవు తున్నారు. కేసముద్రంలోనే నూతన ఏఎల్‌వో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి.

**ఎం మురళి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, కేసముద్రం**

# రసాభాసగా అంబేద్కర్ జయంతి కార్యక్రమం
### ములుగు కలెక్టర్ తీరుపై అభ్యంతరం

ములుగు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమం రసాభాసగా ముగిసింది. జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు ఏర్పాట్ల పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ జయంతి కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో హాజరవుతారని, అయితే 200 మందిలోపు కూర్చునే వీలున్న కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మహనీయుడికి నివాళులర్పించకుండా సీఎంతో సమావేశమంటూ కలెక్టర్ వెళ్లిపోవడం సరికాదన్నారు. పొరుగు జిల్లాల్లో అక్కడి కలెక్టర్లు అంబేద్కర్‌కు నివాళులర్పిస్తే ములుగు కలెక్టర్ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రతినిధు లుగా ఉండే అధికారులు కేవలం అధికార పార్టీకే అనుకూలంగా వ్యవహరించడం ప్రజామోదం కాదన్నారు. ఇదేక్రమంలో పలువురు దళిత, ప్రజాసంఘాల నాయకులు ప్రసంగిస్తుండగా వ్యాఖ్యాతగా వ్యవహరించిన వ్యక్తి వారిని ప్రసంగం త్వరగా ముగించాలంటూ పదేపదే కోరడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. మహనీయుల కార్యక్రమాలు నిర్వహించడంలో ములుగు జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ పలువురు నాయకులు ఆరోపించారు.

## వరుస చోరీలు

వెంకటాపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని ఉప్పేడు గొల్లగూడెం, మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం సమీపంలో ఆదివారం రెండు చోరీలు జరిగాయి. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పేడు గొల్లగూడెం గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు ఇంట్లో రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి ఎదుట ఉన్న షట్టర్ పగులగొట్టి రూ.50 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. అలాగే మండల కేంద్రంలో బీజేపీ నాయకుడు సంకా హేమసుందర్ ఇంట్లోకి చొరబడి బీరువాను పగులగొట్టి కిలో వెండి వస్తువులు, 18గ్రాముల బంగారు నగలను ఎత్తుకె ళ్లారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.



# పుష్కర స్నానాలకు నీటి కష్టాలు



గోదావరిలో పుష్కరఘాట్ వద్ద నీటి ప్రవాహం లేక తేలిన బండరాళ్లు

మహదేవపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో దివ్య క్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, సరస్వతి పుష్కరాలకు నీటి ఎద్దడి సమస్య ఉంది. పుణ్య స్నానాలు ఆచరించడానికి నీటి సమస్య ఉంది. త్రివేణి సంగమంలో మే 15 నుంచి 26 వరకు సరస్వతి పుష్కరాలు జరుగుతున్న నేపథ్యంలో వివిధ పట్టణ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారు. త్రివేణి సంగమంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమం ఉండగా గోదావరి ప్రవాహం ఎగువ నుంచి ఏ మాత్రం లేదు. సరస్వతి నదీ ప్రవాహం అంతర్వాహినిగా ఉండి కనిపించదు. ప్రాణహిత ప్రవాహంతోనే కాళేశ్వరంలో నీటి కళ ఉండేది. వేసవి కావడంతో ప్రాణహిత నుంచి ఎగువ ప్రాంతం నుంచి నీటి ప్రవాహం తక్కువగా ఉంది. సుమారు నిత్యం 3,125 క్యూసెక్కుల మేర ప్రాణహిత ప్రవాహం రోజువారీగా ఉంటుంది. ఏప్రిల్ ముగిసి మేలో మండుటెండలు మరింతగా ఉండే అవకాశం ఉండడంతో ప్రాణహిత ప్రవాహం మరింత తగ్గే అవకాశం ఉంది. ప్రధాన పుష్కర ఘాట్లలో బండరాళ్లు తేలి నీటి ప్రవాహం భక్తులకు ఇబ్బందులు తప్పేట్లు లేవు. ప్రధాన పుష్కర ఘాట్ నుంచి బోటులో వెళ్లి ప్రాణహిత వైపున స్నానాలు చేయడానికి సౌకర్యవంతంగా ఉంది. సరస్వతి ఘాట్ నుంచి నీటి ప్రవాహం వరకు ఇసుకను తొలగిస్తే వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి వీలు ఉంటుంది. ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివస్తున్నారు. ఈ క్రమంలో పుష్కరఘాట్ల వద్ద నీటి నిల్వలు ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# పేపర్ కర్మాగారాన్ని పునఃప్రారంభించాలి

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర నేతలు
- బిల్ట్ కార్మికులతో కలిసి పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న మానవ హక్కుల వేదిక నేతలు, బిల్ట్ కార్మికులు

ఏటూరునాగారం/మంగపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం పేపర్ కర్మాగారాన్ని ప్రభుత్వం వెంటనే పునఃప్రారంభించాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బాదవత్ రాజు డిమాండ్ చేశారు. సోమవారం మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కమలాపురం బిల్ట్ కార్మికరంగాన్ని పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బెల్ట్ కార్మికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ ఎదుట ప్రారంభమైన పాదయాత్ర అక్కడి నుంచి కమలాపురంలోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. 1977లో ఏపీ రేయాన్స్‌గా ప్రారంభమైందని, ముదున్నర దశాబ్దాల్లో రూ. 9 వేల కోట్ల లాభాలు ఆర్జించినప్పటికీ, నష్టాల సాకుతో 2014లో మూసివేశాయని, దీంతో దాదాపు 2వేల మంది శాశ్వత తాత్కాలిక కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, జేఏసీ నాయకులు యాజమాన్యంతో కుమ్మక్కై, కార్మికులకు రావాల్సిన న్యాయపరమైన బకాయిలను అందకుండా చేశారని రాజు ఆరోపించారు. కార్మికులు హైకోర్టును ఆశ్రయించగా, జీతభత్యాలు వెంటనే చెల్లించాలని ఆదేశించినప్పటికీ యాజమాన్యం, జేఏసీ నాయకులు, రాజకీయ పార్టీల నాయకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ వారికి బకాయిలు అందలేదని తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కర్మాగారాన్ని వెంటనే తెరిపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చలేదని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు రావాల్సిన పాత బకాయిలను చెల్లించాలని, కర్మాగారాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులందరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మానవ హక్కుల వేదిక నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లాల అధ్యక్షుడు పొద్దనూరు యాదగిరి, ప్రధాన కార్యదర్శి వి.దిలీప్, ములుగు జిల్లా ఉపాధ్యక్షులు హనుమాన్ ప్రసాద్, పద్మజ, పాలకుర్తి శ్రీనివాస్, లవకుమార్, కర్నాటక సమ్మయ్య, యుగేందర్, సదానందం, ఖమ్మం జిల్లా బాధ్యులు ఆదినారాయణ, బెల్ట్ కార్మికులు యాదగిరి, వెంకటనారాయణ, విజయరావు, వెంకటేశ్వర్లు, చౌదరి, బుచ్చిరెడ్డి, చిటికెల కుమారి, లక్ష్మీ, అన్నపూర్ణతో పాటు సుమారు 150 మంది కార్మికులు పాల్గొన్నారు.

# యత్నారం అడవుల్లో ఎలుగుబంటి కళేబరం

### విద్యుత్ తీగలు అమర్చి వేటాడి మాంసం తీసుకెళ్లిన వేటగాళ్లు

మహాముత్తారం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో రోజురోజుకు వేటగాళ్లు బరితెగిస్తున్నారు. వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు, ఉచ్చులకు ఎన్నో వన్యప్రాణుల ప్రాణాలు పోతున్నాయి. ముఖ్యంగా మండలంలోని మారుముల గ్రామాల్లో రాత్రి పూట వన్యప్రాణుల వేట జోరుగా సాగుతోంది. పెగడపల్లి రేంజీ పరిధిలోని యత్నారం గ్రామ సమీప కొండెంగల వాగు సమీపంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి ఎలుగుబంటి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. వేటగాళ్లు వాగు సమీపంలో ఎలుగుబంటి మాంసాన్ని, గోర్లను తీసుకొని కలేబారాన్ని అక్కడే వదిలివెళ్లారు. అయితే స్థానిక ఫారెస్టు ఈ విషయం ముందే తెలిసినా గోప్యంగా ఉంచారనే ఆరోపణలు వినిస్తున్నాయి. సోమవారం కొంత మంది గ్రామస్థులకు విషయం తెలియడంతో ఎలుగుబంటి మృతి చెందిన విషయం బయటకు వచ్చింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. యత్నారం గ్రామ సమీప అడవుల్లోంచి వెళ్తున్న త్రీ ఫేజ్ విద్యుత్ తీగలను ఆసరాగా చేసుకొని వేటగాళ్లు ప్రతి రోజు రాత్రి పూట విద్యుత్ తీగలు అమర్చి వేట కొనసాగిస్తున్నారు. వన్యప్రాణుల మాంసాన్ని స్థానికేతరులకు గుట్టుగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకొంటున్నారని, ఈ విషయంలో స్థానిక ఫారెస్టు అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామస్థులు అంటున్నారు. గ్రామానికి సమీపం నుంచి అడవిగుండా వెళ్తున్న పెద్దవాగులో నిత్యం నీళ్లు ఉండడంతో దాహం తీర్చుకోవడానికి అటుగా వచ్చిన వన్యప్రాణులు వేటగాళ్లకు బలవుతున్నాయి. వేటగాళ్లను కట్టడి చేయడంలో ఫారెస్టు అధికారులు విఫలమౌతుండడంతో వేటగాళ్లు రోజురోజుకు రెచ్చిపోతున్నారు. ఈ విషయంలో భూపాలపల్లి డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి వివరణ కోరగా ఎలుగుబంటి మృతి చెందిన ఘటనలో విచారణ జరుగుతుందని, పంచనామా, పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన అనంతరం అన్ని విషయాలు తెలుస్తాయని ఆయన తెలిపారు.



మాంసం తీసుకెళ్లి కళేబరం వదిలి వెళ్లిన వేటగాళ్లు

### ఎలుగుబంటి మృతిపై విచారణ

మహాముత్తారం మండలం యత్నారం అడవిలో ఎలుగుబంటి కళేబరం లభ్యమైన ఘటనలో అటవీ శాఖ కాళేశ్వరం జోనల్ ఫ్లయిగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో జోగేందర్ సోమవారం సాయంత్రం విచారణ జరిపారు. ఎలుగుబంటి రెండు రోజుల క్రితం మృతి చెందితే ఇప్పటి వరకు వేటగాళ్లను ఎందుకు పట్టుకోలేకపోయారని పెగడపల్లి రేంజ్ అటవీశాఖ అధికారులను ప్రశ్నించారు. ఒక్కరోజులో వేటగాళ్లను గుర్తించాలని ఆదేశించారు. విచారణ జరిపిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆయన తెలిపారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి
### ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ యువతకు సూచించారు. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామంలో సోమవారం ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో డ్రగ్స్ పోక్సో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతేకాకుండా శిక్షణ పొందిన నార్కోటిక్ స్నిపర్ డాగ్ స్క్వాడ్ బృందాలతో గ్రామంలో తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్, పోక్సో చట్టాల అవగాహన సదస్సులో ఏఎస్పీ మాట్లాడారు. డ్రగ్స్, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్‌లపై గ్రామాల్లో యువత, విద్యార్థులను చైతన్యం చేయడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. డ్రగ్స్ సరఫరా చేయడం, వాటిని తీసుకోవడం ద్వారా యువత, విద్యార్థులు అనేక నష్టాలు, సమస్యలను కొనితెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు డ్రగ్స్ సరఫరా చేసినా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, పోలీస్, స్నిపర్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కూలీకి వచ్చి అనంతలోకాలకు..
### హార్వెస్టర్ ఢీకొని ఒకరి మృతి ▸ మరొకరికి గాయాలు

టేకుమట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కూలి పని కోసం వచ్చిన ఓ మహిళ పైకి హార్వెస్టర్ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. రోడ్డుపై సేదతీరుతున్న ఆ మహిళపైకి ఒక్కసారి హార్వెస్టర్ వెనక్కి దూసుకురావడంతో పెద్దపల్లి జిల్లా మొట్లపల్లి గ్రామానికి చెందిన దాసరి కనకమ్మ(46) అక్కడికక్కడే మృతి చెందింది. మరో మహిళ వసంత గాయాల పాలైయిన ఈ ఘటన భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మొట్లపల్లి గ్రామానికి చెందిన కొంతమంది కూలీలు వరి పొలంలో బెరుకులు తీసే పని నిమిత్తం మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి వచ్చారు. కాగా పని చేయాల్సిన పొలానికి వెళ్తుండగా ప్రధాన రహదా రిపై హార్వెస్టర్, ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా రావడంలో కూలీల ఆటోను డ్రైవర్ పక్కకు ఆపినట్లు తెలిపారు. కాగా ఆటోలో నుంచి మొట్లపల్లి గ్రామా నికి చెందిన దాసరి కనుకమ్మ, రాగుల వసంతలు దిగి పక్కన నిలుచోగా బస్సుకు దారిచ్చే క్రమంలో హార్వెస్టర్ డ్రైవర్ తన వాహనాన్ని ఒక్కసారిగా వెనక్కి అనడంతో ప్రమాదంలో జరిగినట్లు తెలిపారు. కాగా ప్రమాదంలో కనకమ్మ అక్కడి క్కడే మృతి చెందగా, పక్కనే ఉన్న వసంతకు గాయాలు అయినట్లు తెలిపారు. కాగా స్థానికులు 108లో గాయాలపాలైన వసంతను చిట్యాల సామాజిక ఆసుపత్రికి తరలించారు.



కనకమ్మ (ఫైల్)



గాయపడిన వసంత

# పులి జాడ కోసం గాలింపు

తాడ్వాయి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని బయ్యక్కపేట శివారు ముసలమ్మపెంట గొత్తికోయ గూడెంలోని పొడియం సత్యం అనే వ్యక్తికి చెందిన ఆవుపై మూడు రోజుల క్రితం శుక్రవారం పులి దాడి చేసిన విషయం తెలిసిందే.. అయితే అటవీ అధికారులు గాలింపు చర్యలు సోమవారం ముమ్మరంగా చేపట్టారు. పులి ఎటు వెళ్లిందని పలు రకాలుగా విచారణ చేస్తున్నారు. కాగా వట్టివాగు పరిసరాల్లో, నీలంతోగు, ముసలమ్మపెంట ప్రాంతాల్లో కలియదిరిగారు. ట్రాప్ కెమెరాలను పరిశీలించారు. సమాచారం లభించకపోవడంతో పక్క రేంజ్ అధికారులకు సమాచారం అందించడం జరిగిందని ఓ అటవీ శాఖ అధికారి తెలిపారు. పరిసర గ్రామాల్లో ప్రజలకు సరైన సమాచారం తెలియక పోవడంతో పశు, జంతువుల కాపరులు, రైతులు భయంతో ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు పరిసర గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేయకపోవడంతో అసలు పులి ఉందా.... లేదా... అనే అంశంపై గ్రామస్థుల్లో చర్చ మొదలైంది.

# విద్యుత్ ఆదాతోనే గృహజ్యోతి

## 200 యూనిట్లు మించి వాడితే మొత్తం చెల్లించాల్సిందే..




వర్ధన్నపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వచ్చిన అనూహ్య మార్పులతో వేసవికి ముందే ప్రజలు వేడికి తాళలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి తాపం నుంచి రక్షించుకోవడానికి పట్టణ, మండల, గ్రామస్థాయిలో ఏసీలు, కూలర్లు వాడుతుండడంతో మార్చి మొదటివారంలోనే విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. విచ్చలవిడిగా వాడితే గృహజ్యోతి పథకం వర్తించకుండా పోయే ప్రమాదం ఉంది. 200 యూనిట్లకు ఒక్క యూనిట్ అదనంగా వచ్చినా బిల్లు కట్టాల్సిందే. ఒక వైపు వేసవితాపం.. మరోవైపు విద్యుత్ బిల్లుల భారం.. ఒకటి కావాలంటే మరొకటి వదులుకోవాల్సిన పరిస్థితి. దీని నుంచి గట్టెక్కాలంటే విద్యుత్‌ను పొదుపుచేసుకోవడమే మార్గం. అలా అని ఉపకరణాలను పక్కనపడేయకుండా విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే మేలు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఇంట్లో నిరంతరాయంగా గృహజ్యోతిని వెలిగించవచ్చు.

### మన ఇళ్లలో ఇలా చేద్దాం..

మార్కెట్‌లో ఎన్నో కంపెనీల విద్యుత్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఏసీలు, కూలర్లు, ఫ్రిడ్జిలు, ఫ్యాన్లు, ఎల్ఈడీ బల్బులను 1-5 స్టార్లతో విక్రయిస్తారు. వీటిలో 5 స్టార్ రేటింగ్ ఉపకరణాలే విద్యుత్‌ను తక్కువగా ఖర్చు చేస్తాయి. ఐఎస్ఐ మార్కు గల ఉత్పత్తుల వాడకం అన్ని విధాలా సురక్షితమైనది. వీటి వల్ల ప్రమాదాలను నివారించవచ్చు. పాత తీగలుంటే మార్చుకోవడం శ్రేయస్కరం. టీవీని అవసరం లేనపుడు రిమోట్‌తో కాకుండా పూర్తిగా ఆఫ్ చేయాలి. సెల్‌ఫోన్ చార్జింగ్ నిండాక చార్జర్‌ను ప్లగ్ నుంచి తొలగించాలి. బయటకు వెళ్లినా, అవసరం లేదనిపించినా ఫ్యాన్ స్విచ్ఛాఫ్ చేయాలి. కాలానుగుణంగా ఆధునిక సాంకేతికత గల ఫ్రిజ్‌ను మార్చుకుంటే నెలవారి విద్యుత్ వాడకం ఆదా అవుతుంది. అంతేకాకుండా ఏసీలను 24-28 డిగ్రీల మధ్య నడుపుకోవాలి. మార్కెట్‌లో పలు కంపెనీల సింగిల్, డ్యూయల్ ఇన్వెర్టర్ల ఏసీలు అందుబాటులో ఉన్నాయి. నిర్దేశిత ఉష్ణోగ్రతకు వాతావరణం మారగానే ఆటోమెటిక్‌గా ఆఫ్ అయ్యేవాటిని వాడాలి. పాతవాటికి సకాలంలో మరమ్మతులు చేయించాలి. అన్నిచోట్ల ఎల్ఈడీ బల్బులు వినియోగం అత్యుత్తమం.

### ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

ఇళ్లల్లో విద్యుత్ ఆదాకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ సరఫరా అయ్యే తీగలు, ఇంట్లో గదులకు సరఫరా చేసే తీగల్లో గేజ్ అధికంగా ఉండేలా చూసుకోవాలి. ఎక్కువగా ఎల్ఈడీ బల్బులు వినియోగించాలి. నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు వాడాలి. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడాలంటే ప్రణాళికబద్ధంగా ఉపకరణాలు వినియోగించుకోవాలి. గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- తరుణ్, ఏఈ, వర్ధన్నపేట

| | సామర్థ్యం (వాట్స్‌లో | వాడకం (రోజులో గంటల్లో) | నెలకు ఖర్చయ్యేది |
|---|---|---|---|
| ఫ్యాన్ | 60 | 15 | 27 |
| టీవీ | 100 | 06 | 18 |
| ఎల్ఈడీ బల్బు | 40 | 10 | 01 |
| వాషింగ్ మెషిన్ | 300 | 02 | 18 |
| మిక్సీ/గ్రైండర్ | 450 | 01 | 13 |
| వాటర్ హీటర్ | 3000 | 01 | 20 |
| బోర్ మోటర్ | 300 | 01 | 20 |
| ఏసీ | 1500 | 2-5 | 90-120 |

# పుస్తకంతో నేస్తం చేద్దాం..

- పుస్తక పఠనంతో ప్రయోజనాలు అనేకం
- వేసవి సెలవులు చిన్నారులకు అనుకూలం
- సెల్‌ఫోన్ పక్కన పెడితే కావలసినంత సమయం
- విద్యార్థుల్లో పరిజ్ఞానం పెంచేందుకు దోహదం





కరీమాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ప్రతీ ఇంట్లో పుస్తకాలు తప్పకుండా ఉండేవి. నేడు వాటి స్థానంలో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు వచ్చేశాయి. సమాజం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందినా పుస్తకా స్థానాన్ని భర్తీ చేయలేవు. పుస్తకాలు మనకు నేస్తాల్లాంటివి. అందుకే 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. మంచి పుస్తకం కొనుక్కో' అన్నారు పెద్దలు. 'పుస్తకం హస్తభూషణం' అని వర్ణించారు కవులు. కానీ నేటి సమాజంలో పుస్తకాలు కనుమరుగవుతున్నాయి. పాఠ్య పుస్తకాలు పెరిగిపోయి.. విజ్ఞానం, కథల పుస్తకాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. గ్రంథాలయాలకు వెళ్లి చదువుకునేంత తీరిక, ఓపిక తగ్గిపోతున్న రోజులివి. ఇంటిల్లిపాదీ ఆనందంగా ఒక మంచి పుస్తకాన్ని గురించి మాట్లాడుకునే పరిస్థితి ఎప్పుడో పోయింది. కేవలం స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌ల కాలంలో ఉన్నాం మనం. మనసుతో మాట్లాడే నేస్తాలు పుస్తకాలే అనే విషయాన్ని విస్మరించాం. ఈ వేసవిలో అయినా పిల్లలకు మంచి నేస్తాల్లాంటి పుస్తకాలను పరిచయం చేద్దాం. పెద్దలు చెప్పిన మాటను నిజం చేద్దాం..

### పుస్తకాలతో తెలివితేటలు

పిల్లలు పెరిగే క్రమంలో తమ చుట్టూ కనిపించే ప్రతీ విషయం మీద ఆసక్తి పెంచుకుంటారు. వాటి గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. తల్లితండ్రులు వివేకవంతులైతే వారి సందేహాలను నివృత్తి చేస్తూ వారికి విషయ పరిజ్ఞానాన్ని అందిస్తారు. లేదంటే వారి అనుమానాలు అలాగే ఉండిపోతాయి. అవి తీరాలంటే పుస్తక పఠనం తప్పనిసరి. పుస్తకాలు చదవడం వల్ల విషయం విజ్ఞానంతో పాటు భాషా పరిజ్ఞానం కూడా పెరుగుతుంది. ప్రతీరోజు నిద్రపోయే ముందు చిన్నారులతో కథల పుస్తకాలు చదివిస్తే భవిష్యత్తులో వారి తెలివితేటలు బాగా అభివృద్ధి చెందుతాయని ఓ అధ్యయనంలో తేలింది. పడుకునే ముందు 20 నిమిషాల పాటు కథల పుస్తకాలు చదివే పిల్లల్లో అక్షరాస్యత శాతం మెరుగుపడుతుంది. చిన్న వయసులో పిల్లలు కథలంటే ఎలాగూ ఆసక్తి చూపుతారు. అలాంటి వారికి కథల పుస్తకాలు చదివే అలవాటు చేయాలని విద్యావంతులు అభిప్రాయపడుతున్నారు.

### అలవాటు చేయండిలా...

పుస్తక పఠనం పిల్లలకు ఎంత తొందరగా అలవాటు చేస్తే అంత మంచిది. బాలల సాహిత్యానికి సంబంధించిన ఆసక్తికర పుస్తకాల ను కూడా చదివించాలి. ఇలా చేయడం వల్ల పిల్లలు తమకు తెలియకుండానే పుస్తకాల పట్ల ఆకర్శితులవుతారు. వారికి ఏమైనా సందేహాలు వస్తే మనమే నివృత్తి చేయాలి. పుస్తక పఠనం ద్వారా కొత్త కొత్త పదాలు నేర్చుకుంటారు. కొత్త విషయాలు తెలుసుకుంటారు. పిల్లల వయసుకు తగ్గ పుస్తకాలనే చదివించాలి. అలా కాకుండా ఏదో ఒక పుస్తకం ఇచ్చి చదివించడం అంటే పుస్తక పఠనంపై వాళ్ళకి ఆసక్తి నశించే ప్రమాదం ఉంది.

- పిల్లలను తల్లిదండ్రులు తరుచూ లైబ్రరీకి తీసుకెళుతూ ఉండాలి. అలా చేయడం వల్ల పిల్లల్లో పుస్తకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. పిల్లలను లైబ్రరిల్లో సభ్యులుగా కూడా చేర్పిస్తే ఇంకా మంచిది. దీని వల్ల పిల్లలు కొత్త స్నేహితులను సంపాదించుకోవడమే కాకుండా పుస్తకాలంటే కూడా అమితంగా ఇష్టపడతారు.
- పిల్లల చేత బాలల సాహిత్యంలో మాస్టర్ పీస్‌లుగా చెప్పుకునే పుస్తకాలు చదివించాలి.
- పిల్లల ఆసక్తి తగ్గట్టు పుస్తకాలను చదివించడం వల్ల పిల్లల్లో అభ్యసనా సామర్థ్యం పెరుగుతుంది.
- మంచి పుస్తకాలను పిల్లలకు బహుమతిగా ఇస్తుండాలి. ఇలా చేయడం వల్ల పిల్లలు మెల్లగా పుస్తక పఠనంపై మక్కువ చూపెడతారు. అలాగే తల్లిదండ్రులు కూడా పుస్తకాలు చదవడం వల్ల పిల్లలకు స్ఫూర్తిగా నిలబడతారు. చిన్నప్పటి నుంచి పిల్లలు పుస్తక పఠనం అలవాటు చేసుకుంటే మంచి తెలివితేటలతో అన్నింటా ముందు వరుసలో ఉంటారు.
- బొమ్మలుండే పుస్తకాలను పిల్లలకు అందిస్తే పిల్లలు అందులోని సారాంశాన్ని తొందరగా అర్థం చేసుకుంటారు. పిల్లల చదువుపై కూడా పుస్తక పఠనం ప్రభావం ఉంటుంది. కథల పుస్తకాలు చదివిస్తుండటం వల్ల తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య ప్రేమ మరింత పెరుగుతుంది.



జేఎన్ స్టేడియంలో పావురాలకు గింజలను ఆహారంగా అందజేస్తున్న వాకర్స్

# జేఎన్ఎస్‌కు కపోతాల కళ

- స్టేడియం వద్ద ముచ్చట గొలుపుతున్న పావురాలు
- ఆహారం అందిస్తున్న వాకర్స్

హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఔట్ డోర్ స్టేడియం ప్రధాన ప్రాంగణం వద్ద కపోతాలు ప్రతీరోజు ఉదయం సందడి చేస్తున్నాయి. ఉదయం వాకింగ్‌కు వచ్చే వాకర్స్ గేటు ముందుకు వచ్చే సమయంలో కపోతాలు పెద్ద ఎత్తున గుంపులుగా గుమికూడి అలరించడంతో వాటిని చూసి సంబరపడిపోతున్నారు. అక్కడే గేటు ముందు చిరు ధాన్యాలు విక్రయాలు చేయడంతో వాటిని వాకర్స్, పక్షి ప్రేమికులు కొనుగోలు చేసి పావురాలకు అహారంగా అందించడంతో పెద్ద ఎత్తున గుంపులు గుంపులుగా చేరుకొని చిరు ధాన్యాలను స్వీకరిస్తూ, ముచ్చట గొలుపుతున్నాయి. చిరు ధాన్యాలు అందించే వ్యక్తి చేతిపై వాలి మొలకలు, గింజలను ఆరగిస్తూ కనివిందు చేస్తున్నాయి. దీంతో వాకింగ్ వచ్చే వారు కపోతాలకు చిరు ధ్యాన్యాలు అందించి వాటితో సెల్ఫీలు, ఫోటోలు దిగేందుకు ఆసక్తిని కనబర్చుతున్నారు. చిన్న పిల్లలు కపోతాలను చూసి వాటితో ఆడుకోవాలను ఆరాటంతో గింజలను చల్లుతూ వాటిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

- వరంగల్ స్పోర్ట్స్

# పుణ్యక్షేత్రానికి వెళ్లొస్తూ..

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృత్యువాత

- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- హైవేపై లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రాఘవపూర్ వద్ద ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్



ప్రమాదానికి కారణమైన లారీ

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు అతివేగంగా ఢీకొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం సాయంత్రం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్ పూర్ మండలంలోని రాఘవపూర్ గ్రామ పరిధిలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సత్తి రాజేశ్వరరావు - అనంతలక్ష్మిల కుటుంబం హైదరాబాద్‌లోని గాజుల రామారంలో కొన్నేళ్ల కిందట వచ్చి స్థిరపడింది. రాజేశ్వర్‌రావు - అనంతలక్ష్మి దంపతుల కుమారుడు శ్రీను (50), కోడలు రమణకుమారి (40), మనువడు సత్య అరవింద్, మనువరా లు అనూష (22)లు కలిసి సోమవారం ఉదయం కారులో గాజులరామారం నుంచి భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. అక్కడ పూజలు ముగించుకొని సాయంత్రం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం 5గంటల సమయంలో మండలంలోని రాఘవపూ ర్ గ్రామ శివారులో ముందువెళ్తున్న లారీని వెనుక నుంచి కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న శ్రీను, ఆయన భార్య రమణకుమారి, కూతురు అనూషలు అక్కడికి అక్కడే మృతి చెందారు. కారులో వెనుక కూర్చున్న రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి, శ్రీను కుమారుడు సత్య అరవింద్‌లు తీవ్రంగా గాయపడ్డారు.

ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కొని తీవ్రంగా గాయపడిని రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి, సత్య అరవింద్‌లను జనగామ ఏరియా అస్పత్రికి తరలించారు. కారులో ఇరుక్కున్న మృతదేహాలను పోలీసులు వెలికితీయడానికి శ్రమించాల్సి వచ్చింది. డ్రైవర్‌సీటులో ఉన్న శ్రీను తలపగిలిపోయి కారులో ఇరుక్కుపోయాడు. పోలీసులు క్రేన్‌ను తీసుకువచ్చి మృతదేహాన్ని వెలికితీయడానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి, సత్యఅరవింద్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో జనగామ ఏరియా ఆస్పత్రి నుంచి మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న డీసీపీ రాజమహేంద్రనాయక్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. సీఐలు జి.వేణు. ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు వినయ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, నరేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు.



తీవ్రంగా గాయపడిన రాజేశ్వర్‌రావు, అనంతలక్ష్మి

# ప్రమాదకరంగా మట్టి పెల్లలు





హనుమకొండ భద్రకాళి చెరువునుంచి మట్టి తరలిస్తుండటంతో హంటర్ రోడ్‌లోని డి కన్వెన్షన్ హాల్ సమీపంలో రోడ్డుపై మట్టిదిబ్బలు ప్రమాదకరంగా మారాయి. లారీల ద్వారా తరలిస్తున్న మట్టి.. రోడ్డుపై పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీనిని రోడ్డు పైనుంచి తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా మారిన మట్టి పెల్లలు

ఫోటోలు: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ / హనుమకొండ

# మండే ఎండలో ఉపశమనం ఎలా..?

- వేసవిలో ఉపాధి హామీ కూలీల కష్టాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు



ఎండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

వర్ధన్నపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఎండల తీవ్రత రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఇలాంటి తరుణంలో మట్టి పనులు చేయడం ఉపాధి హామీ కూలీలకు కష్టసాధ్యంగా మారింది. పైగా పని ప్రదేశాల్లో నీడ సౌకర్యం ఉండడం లేదు. ఎవరికి వారే తాగునీటి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అత్యవసర ఔషధాల కిట్లు అందుబాటులో ఉండడం లేదు.

### గతంలో ఇలా..

ఉపాధిహామీ పథకంలో గతంలో ఫిబ్రవరి నుంచి మే వరకు కూలీలు చేసిన పనికి 30 శాతం అదనపు భత్యం చెల్లించేవారు. ప్రయాణ, కరువు భత్యం ఖర్చు కింద గడ్డపారకు రూ.10లు, తట్టకు రూ.5లు, ఐదు కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చే వారికి రూ.20లు చొప్పున ఇవ్వాలి. వీటితోపాటు పని ప్రదేశంలో నీడ కల్పించి విశ్రాంతి తీసుకునేలా చూడాలి. రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం వీటిని నిలిపివేయడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.

### ఎదురయ్యే సమస్యలు ఇవే...

ఎండలో ఎక్కువ సేపు పనిచేయడం వల్ల కూలీలకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. పని ప్రదేశాల్లో తాగు నీరు సరిపడా లేకపోవడం వల్ల నీరసం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతాయి. మధ్యాహ్నం పూట ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. నీడ సౌకర్యం లేకపోవడంతో కూలీలు శారీరకంగా బలహీనమవుతారు. ఎండల వల్ల చర్మ సమస్యలు, అలసట, తలనొప్పివంటివి ఎదురవుతాయి.

### స్వీయ జాగ్రత్తలే కీలకం

ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు తగినంత నీరు తాగాలి. శరీరం డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ద్రావణం లేదా నిమ్మకాయ నీళ్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలు ఎక్కువగా ఉన్నపుడు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3గంటల వరకు పనిచేయడం మంచిది. పని మధ్యలో చిన్నచిన్న విరామాలు తీసుకోవాలి. శరీరం అలసిపోయినట్లు అనిపిస్తే విశ్రాంతి తీసుకోవాలి. తలనొప్పి, మైకం, వాంతులు, చెమట ఆగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యుల సహాయం తీసుకోవాలి. బాధిత వ్యక్తిని నీడప్రదేశంలోకి చేర్చి శరీరాన్ని తుడవాలి. ఉప్పు, చెక్కెర కలిపిన ఆహారం లేదా పండ్లు తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి, లవణాలు నిల్వ ఉంటాయి. పని ప్రదేశానికి సమీపంలోని వైద్య కేంద్రం వివరాలు తెలుసుకోవాలి.

# నన్ను జర బాగు చేయరూ..

- ఎందరికో సమాచారం అందించా..
- ఓ పోస్టు బాక్స్ మనోవేదన

నేనొక పోస్ట్ బాక్స్‌ను. హనుమకొండ బాలసముద్రంలో సుమారు 30 ఏళ్ల కిందట నన్ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ మీకు సేవ చేశాను. ఎన్నో ఉత్తరాలను నాలో భద్రపరిచాను. నా వాళ్ల (సిబ్బంది) చేత మీ వాళ్లకు వేల సంఖ్యలో ఉత్తరాలు అందించాను. అందరి యోగ క్షేమాలు పరస్పరం తెలియపరిచాను. ఎన్నో శుభ, అశుభ కార్యాల సమాచారం అందించాను. ఇప్పుడంటే సెల్‌ఫోన్లు వచ్చాయి. కానీ సుమారు పదిహేనేళ్ల కిందటివరకు మీరు ఎక్కడున్నా.. మీ క్షేమ సమాచారాన్ని మీ కుటుంబ సభ్యులకు అందించింది నేనే. ఎంతోమంది నిరుద్యోగులకు సమాచారం ఇచ్చి ఉద్యోగాలు పొందేందుకు దోహదపడింది నేనే. దేశ, విదేశాల్లో ఉన్న మీ వాళ్ల బాగోగుల సమాచారం ఇచ్చింది నేనే. నేను పంపే ఉత్తరం కోసం మీరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసే వారు. అలాంటి నేను ఇపుడు వృద్ధాప్య దశ (శిథిలావస్థ)కు చేరుకున్నాను. నన్ను బాగు చేయించడానికి నా వాళ్లు (అధికారులు) కనికరించడం లేదు. అందరూ ఉన్నా అనాథలా ఉండిపోతున్నాను. దయచేసి మీలో ఎవరైనా నా అవస్థను మా పుట్టింటికి (తపాలా శాఖకు) తెలియజేసి నన్ను బాగుచేయించాలని చేతులెత్తి నమస్కరిస్తున్నాను.

ప్రేమతో..
మీ పోస్ట్ బాక్స్

- హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి)



బాలసముద్రంలో శిథిలావస్థలో ఉన్న పోస్టు బాక్స్

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని కంచెరకుంట, కుడా ఆఫీస్, చింతల నర్సింహా బుక్‌స్టాల్, ఏకశిల ఆస్పత్రి, పినాకిల్ ఆస్పత్రి, వాసెన్ ఐ ఆస్పత్రి, ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు, ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫాతిమానగర్‌లో ఉదయం 8 గంటల నుంచి 10గంటల వరకు, కలెక్టరేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్, సుబేదారి, పోస్టల్‌కాలనీ, ఎక్సైజ్ కాలనీ, అదాలత్ జంక్షన్ ఏరియా, అడ్వకేట్‌కాలనీ, ఎస్ఆర్ స్కూల్, హంటర్‌రోడ్డు ఏరియా, వరంగల్ పబ్లిక్ స్కూల్, అదాలత్ జంక్షన్ నుంచి జూపార్కు వరకు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, వడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని వడ్డేపల్లి, విజయ్‌పాల్‌కాలనీ, రాఘవేంద్రనగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ పేర్కొన్నారు.

### అంబేద్కర్ భవన్‌లో ..

వడ్డేపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ గొప్ప దార్శనీకుడు, ప్రపంచ దేశాలు మెచ్చిన మేధావి అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ చిత్రపటం వద్ద ఆయనతోపాటు రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎమ్మార్పీఎస్ జాతీయ నేత మంద కుమార్ మాదిగ, ఇతర ప్రజా సంఘాల నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. బుద్ధం శరణ ం గచ్ఛామి గీతాన్ని ఆలాపించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మన దేశ రాజ్యాంగాన్ని చూసి గర్వపడేలా చేసిన ఘనత అంబేద్కర్‌దేనని పేర్కొన్నారు. సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ.. ప్రజల కోసం ప్రజాస్వామ్యాన్ని అందించిన గొప్ప మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నవీన్‌కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి గంగవరపు వెంకట భాను ప్రసాద్, ఎంఎస్‌పీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్ నాయక్, మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ అంకేశ్వరపు రాంచందర్‌రావు, వైస్ చైర్మన్ సుకుమార్, 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణిరెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, చుంచు రాజేందర్, సింగారపు రవిప్రసాద్, జవ్వాజి కిషన్, కూనమల్ల అనిత, కన్నం సునిల్, బోడ డిన్నా, జోరిక రమేష్, చిట్యాల బాబు, కొంగర జగన్, మంద మల్లేషం, మంద సంపత్, దొగ్గెల తిరుపతి, మంద నరేష్ తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ కార్పొరేషన్ : అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సెక్రెటరి అలివేలు, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, హెచ్‌వో రమేష్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, జేఏవో సరితతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ 134వ జన్మదిన వేడుకలు బల్దియా జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరై జాక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు రమేష్, కోశాధికారి స్వర్ణన్‌రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, కార్యదర్శి బాలునాయక్, ముఖ్యసలహాదారుడు బొట్ల బిక్షపతి, నాయకులు పాల్గొన్నారు. అదే విధంగా దేశాయిపేటలోని బల్దియా ఫిల్టర్ బెడ్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బల్దియా సిబ్బందితో పాటు డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

● కేయూ క్యాంపస్ : కేయూ దూరవిద్య కేంద్రం ఆవరణలో సోమవారం అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని కాంస్య విగ్రహనికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ఎస్సీఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కీలక వక్త కవి, విమర్శకులు, ప్రముఖ అంబేద్కరిస్టు డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ బి. సుకుమారి, డాక్టర్ అనితారెడ్డి, అడ్వకేట్ బాలు చౌహన్, డాక్టర్ బి. రమ, డాక్టర్ చిర్ర రాజుగౌడ్, కేయూ ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్‌లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు.

వడ్డేపల్లిలో..

వడ్డేపల్లి: గాంధీనగర్‌లో 57వ డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆయనతో పాటు బీజేపీ నేత అల్లం మల్లికార్జున్‌రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హనుమకొండలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ పశ్చిమ నియోజక వర్గ అడహక్ కమిటీ సభ్యులు ఎం.డి. రహీం ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తదితరులు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వాంకుడోత్ వీరన్న, మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, బీజేపీ జిల్లా నేత బింగి శ్రీనివాస్ తదితరులు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హనుమకొండ వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ , పీజీ కళాశాలలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్ర మౌళి గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అంబేద్కర్ భవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం తదితరులు


అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నిట్ సిబ్బంది

# అంబేద్కర్ గొప్ప దార్శనికుడు

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**

**ఊరూరా రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకలు**

● వరంగల్ క్రైం: అంబేద్కర్ జయంతి వేడుకలను సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆవరణలోని పరిపాలన విభాగం కార్యాలయం ఎదుట ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షేక్ సలీమా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి, ఏఆర్ అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, ఏసీపీలు ఇన్స్‌పెక్టర్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.


అంబేద్కర్‌కు పూలతో నివాళులర్పిస్తున్న డీసీపీ సలీమా

● రాంనగర్ : ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్‌కుమార్, టి.సదర్‌లాల్, వి తిరుపతిరెడ్డి పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఈలు తిరుమల్‌రావు, రాజు చౌహాన్, రవీంద్రనాథ్, వెంకటరమణ, జీఎంలు పాల్గొన్నారు.

● అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం హంటర్‌రోడ్డులోని జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వరకు చేరుకొని పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, పాల్గొన్నారు.

● హనుమకొండ (ఆంధ్రజ్యోతి) : నిట్ సెమినార్ హాల్, బోస్ కాంప్లెక్స్ సోమవారం అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఉమామహేశ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్‌లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

● వరంగల్ మెడికల్: అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను సోమవారం ఎంజీఎం హాస్పిటల్‌లో మూడు విభాగాల కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంజీఎం మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, డాక్టర్ రాజమోహన్ హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శశికుమార్, డాక్టర్ రాంమోహన్, స్థానిక కార్పొరేటర్ శిరిష్, ఎంజీఎం నర్సింగ్ సూపరింటెండెంట్ ఆనంద అర్చణ తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ ఎడ్యుకేషన్: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని హనుమకొండలోని అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రిటైర్డ్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ హనుమకొండ మహిళా అధ్యక్షురాలు కోలెపాక సంగీత, జిల్లా అధ్యక్షుడు పులి సారంగపాణి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే కాజీపేటలోని టెస్ట్ క్యాంపు, యూటీఎఫ్, విద్యావారధి తదితర కార్యాలయాల్లో వివిధ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● న్యూశాయంపేట: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, తదితర నాయకులు ఉన్నారు.

● హనుమకొండ కలెక్టరేట్‌లో టీఎన్‌జీఓస్ భవన్‌లో సోమవారం ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, కోశాధికారి పనికెల రాజేష్, పుల్లూరు వేణు, శ్యాంసుందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

● హనుమకొండ సిటీ: హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం అంబేద్కర్ జయంతి కార్యక్రమం జరిగింది. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన రాజేందర్‌రెడ్డి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డితో పాటు టీపీసీసీ నాయకులు కూచన రవళి, ఈవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ టౌన్: హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్, లక్ష్మీనారాయణ, నయీమొద్దీన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

● రాంనగర్: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ ఎస్సీ అండ్ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ అండ్ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం కంపెనీ అధ్యక్షుడు ఎ.ఆనందం, కార్యదర్శి ఎస్.కుమారస్వామి, ఫైనాన్స్ సెక్రటరీ నరసింహారావు, ఉద్యోగ సంఘ నాయకులు చొక్కారావు, మొలిగయ్య, రవిశ్, సురేందర్, రామచంద్రం, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ లీగల్ : అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు కోర్టులోని అంబేద్కర్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్ అధ్యక్షత వహించగా, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పులి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉభయ జిల్లాల ప్రధాన కార్యదర్శులు డి. రమాకాంత్, కొత్త రవి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సిరికొండ సంజీవరావు, బైరపాక జయాకర్, దుస్స జనార్ధన్, వరంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మైదం జయపాల్, మహిళా జాయింట్ సెక్రటరీలు నాగేంద్ర, శశిరేఖ, కోశాధికారులు చింత సాంబశివరావు, సిరిమల్ల అరుణ, స్పోర్ట్స్ సెక్రటరీలు మల్లేష్, శివప్రసాద్, లైబ్రరి సెక్రటరీలు వెంకటేష్, శ్రీధర్, కార్యవర్గ సభ్యులు కె. రాజేశ్వర్‌రావు, ఎస్. శ్రీనివాస్, సురేష్, ఆశీర్వాదం, ఇందిరా వేదవతి, నిర్మల జ్యోతి, అరుణ, స్వాతి, కమలాకర్, నిఖిల్, శివకుమార్, సునిల్ , జె.రవి, మహేందర్, మర్రి రాజు, మేగనాథ్, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

● జూలైవాడ: 59వ డివిజన్‌లోని వికాస్‌నగర్ కాలనీలో అంబేద్కర్ చిత్రపటానికి స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కాజీపేట: కాజీపేట చౌరస్తాలో మాదిగ మహాజనుల వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.

●మడికొండ: మడికొండలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని సోమవారం కొవ్వొత్తులు వెలిగించి, పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు. 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పలు కుల సంఘాల నాయకులు, పెద్దలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

● హనుమకొండ టౌన్: హనుమకొండలోని అక్యూమెన్ కళాశాలలో అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ ముక్కాల సందీప్, డాక్టర్ ఆర్. శ్రావణ్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బీజేపీ కార్యాలయంలో..


అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డైరెక్టర్లు


వరంగల్, హనుమకొండ న్యాయవాదుల ఆధ్వర్యంలో..


బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్, పార్టీ నాయకులు


అక్యూమెన్ కళాశాలలో..

## మంత్రపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

హసన్‌పర్తి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని మంత్రపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా పావుశెట్టి శ్రీధర్, అధ్యక్షుడిగా సిరిగినేని మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా వీరమల్ల మల్లారెడ్డి, ముద్దసాని కోటేశ్వర్, ప్రధాన కార్యదర్శి వీసం అనిల్‌రెడ్డి, కోశాధికారిగా తోకల ప్రభాకర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా ఆలపాటి ప్రభుకుమార్, కార్యదర్శులుగా గంగినేని రవికుమార్, బూర కుమారస్వామి, గౌరవ సలహాదారులుగా చిటి కేసి సదానందం, (సాయిరాం), డాక్టర్ పుల్ల సదానందం, పిట్టల కుమారస్వామి, ఆకుల కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా మామిడాల భిక్షపతి, పోన్నోజు శివప్రసాద్, గొల్లపల్లి సుదర్శన్, మైదం సురేందర్‌లతో కూడిన నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు కమిటీ ప్రకటించింది.

## అధ్యాపకురాలికి ఆర్థిక సాయం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోరుట్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు అర్చనకు వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థు సంఘం ఆర్థిక సాయం అందజేశారు. వరంగల్‌లోని ఆమె నివాసంలో ఆదివారం రూ.30వేల ఆర్థి క సాయం అందజేశారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈవీ శ్రీనివాసరావు, కోస్గి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీనివాసులు, లెక్చరర్ సత్యనారాయణ, మేకల అక్షయ్‌కుమార్, హనుమకొండ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దాసరి మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



# రైతులకు చుట్టం 'భూభారతి'

**రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి**

మడికొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రైతుకు చుట్టం భూభారతి అని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. సోమవారం కొత్త ఆర్‌వోఆర్ చట్టం హైదరాబాద్ శిల్పకళావేదిక నుంచి సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా జరిగిన కార్యక్రమం మడికొండలోని రైతు వేదిక వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతును రాజు చేయడానికి ఇందిరమ్మ రాజ్యం, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు కొనియాడుతూ సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, వస్కుల శంకర్, సందెల విజయ్, రాజారపు స్వామి, గుర్రపు కోటి, బోయిన కుమార్, దువ్వ విజయ్, కొప్పుల నవీన్, నీలం రజిని వేణుయాదవ్, పెనుకుల వినయ్, గడుసు రా జు, యాదవరెడ్డి, బషీర్, చంటి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


మడికొండ రైతు వేదిక వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జంగా రాఘవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

## భారత్ వికాస్ పరిషత్‌ను బలోపేతం చేయాలి

న్యూశాయంపేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్‌ను బలోపేతం చేయాలని భారత్ వికాస్ పరిషత్ ఓరుగల్లు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్ అన్నారు. హనుమకొండలోని భారత్ వికాస్ పరిషత్ కార్యాలయంలో సోమవారం సంవత్సరాంతపు కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. కిందటేడు భారత్‌వికాస్ పరిషత్ నిర్వహించిన కార్యక్రమాలు గణనీయంగా ఉన్నాయని, ముందుముందు కూడా ఇలాగే ముందుకువెళదామన్నారు. భారత్ వికాస్ పరిషత్ కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ.. 2024-25లో సుమారు 100మంది పేద రైతులకు 10 పవర్ స్ప్రేయర్‌లను గీసుగొండ, దామెర, కమలాపూర్ మండలాల్లో పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే కొంతమంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇచ్చామని, రాబోయే రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకెళతామన్నారు. సమావేశంలో భారత్ వికాస్ పరిషత్ కార్యదర్శి కె.సత్యనారాయణ, కోశాధికారి వెంకట్‌రెడ్డి, చంచల్ అరిర్వాల్, జయపాల్‌రెడ్డి, రామారావు, వివేకానంద్, లక్ష్మణాచార్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుధీర్

## అంబేద్కర్ జయంతి వేడుకలకు అధికారుల గైర్హాజరు

**షోకాజు నోటీసులు జారీ చేసిన అదనపు కమిషనర్**


వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో వివిధ విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న వింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం బల్దియాలో జరిగిన అంబేద్కర్ 134వ జయంతి ఉత్సవాలకు గైర్హాజరు కావడంతో 37 మంది అధికారులపై చర్యలు తీసుకున్నారు. రెండు రోజుల ముందే అంబేద్కర్ జయంతి వేడుకలకు అందరు తప్పకుండా హాజరు రావాలని కమిషనర్ కార్యాలయం నుంచి సర్క్యులర్ జారీ చేసినా కొందరు అధికారులు ఖాతరు చేయక పోవడంతో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. దీంతో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా విచారణ చేసిన అనంతరం 37 మంది ఉన్నతాధికారులు, సిబ్బందికి షోకాజు నోటీసులు జారీ చేశారు. ప్రధానంగా ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, ఫైర్, సర్కిల్ కార్యాలయాల అధికారులు, రెవెన్యూ అధికారులకు నోటీసులు జారీ చేశారు. బల్దియా సీ-1 సెక్షన్ అధికారి రావుల ఆనంద్ గైర్హాజరైన అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేశారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

హసన్‌పర్తి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. సోమవారం మండలంలోని సీతంపేట కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన సఖీ అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సఖీ వన్ స్టాప్ సెంటర్ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పోలీసు, తాత్కాలిక వసతి వంటి ఐదు రకాల సేవాలను గురించి వివరించారు. సఖీ సెంటర్ 24 గంటలు పనిచేస్తుందని సమస్య ఉన్న మహిళలు 181 మహిళా హెల్ప్‌లైన్, చైల్డ్ లైన్ నెంబర్ 1098, 0870 - 2452112, 73829 83088 అనే నెంబర్‌కు కాల్ చేసి బాధిత మహిళలు సహాయం పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సఖి లీగల్ కౌన్సిలర్ మెంబర్ అనూష, వీవోఏ విజయ, ఎస్ఎస్‌జీ గ్రూప్ మెంబర్లు, లీడర్లు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సఖి లీగల్ కౌన్సిలర్ మెంబర్లు

అందం చందం



# చక్కని రూపం కోసం... సురక్షిత చికిత్సలు

**ఏ ఇద్దరి వేలి ముద్రలూ ఒకేలా ఉండనట్టే, ఏ ఇద్దరి శరీరాలూ ఒకేలా ఉండవు. అలాగే కొవ్వు పేరుకునే అవయవాలు, చర్మం సాగిపోయే స్వభావాలు కూడా వ్యక్తుల్లో వేర్వేరుగా ఉంటాయి. పెరిగే వయసుతో పాటు మారిపోతూ ఉంటాయి. ఈ ఇబ్బందులను సరిదిద్దుకోగలిగే సౌందర్య చికిత్సలెన్నో ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి అసౌకర్యాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఈ చికిత్సలను ఆశ్రయించడం అవసరమేనని అంటున్నారు వైద్యులు.**

15 నుంచి 60 ఏళ్ల మధ్య మహిళల శరీరాలు పలు రకాల మార్పులకు లోనవుతూ ఉంటాయి. హార్మోన్ల హెచ్చుతగ్గులు, శరీరంలో కొవ్వు పేరుకుపోయే తత్వాలు, ముఖంలో చోటుచేసుకునే వృద్ధాప్య లక్షణాల వల్ల ఆకర్షణ తగ్గిన మహిళలు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడంతో పాటు, శారీరక అసౌకర్యాలకు కూడా లోనవుతూ ఉంటారు. అయితే అవగాహన లోపంతో, అశ్రద్ధతో ఈ అసౌకర్యాలను నిర్లక్ష్యం చేసే మహిళలే ఎక్కువ. కానీ నిజానికి మనసుకూ, శరీరానికీ ఇబ్బందిగా తోచే ఏ ఒక్క మార్పునూ నిర్లక్ష్యం చేయవలసిన అవసరం లేదు. అందుబాటులో ఉన్న సౌందర్య చికిత్సలతో వాటిని సరిదిద్దుకుని ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేసుకోవచ్చు. అనుభవజ్ఞులైన వైద్యుల సహాయంతో, చిన్న కోతలతో, దుష్ప్రభావాలు లేని చికిత్సలతో చక్కని ఫలితాన్ని రాబట్టుకుని, జీవితాన్ని ఆనందమయం చేసుకోవచ్చు.

## పెద్ద రొమ్ముల సమస్య

ప్రస్తుతం పెళ్లీడు యువతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య 'జైగాంటియోమాస్టియా'! చిన్న వయసులోనే తొలి నెలసరి మొదలు కావడం, పెద్ద రొమ్ముల కుటుంబ చరిత్రను కలిగి ఉండడం వల్ల, కొందరు యువతుల్లో రొమ్ముల పరిమాణం పెరిగిపోయి, మెడ నొప్పి, వెన్ను నొప్పి వేధిస్తూ ఉంటాయి. ఈ సమస్యను బయటకు చెప్పుకోలేక రకరకాల బ్రాసరీలను ప్రయత్నించే అమ్మాయిలు ఉంటారు. నలుగురిలో కలవలేక, ఉద్యోగాలు మానుకుని ఇళ్లకే పరిమితమైపోయే అమ్మాయిలూ ఉంటారు. ఇలాంటి యువతుల రొమ్ముల సమస్యకు రెండు కారణాలుంటాయి.

**లేజర్ లైపోసక్షన్:** పెద్ద పరిమాణానికి కారణం కొవ్వు మాత్రమే అయితే, నాలుగు మిల్లీమీటర్ల రంధ్రం ద్వారా, లేజర్, పవర్ అసిస్టెడ్, వేజర్ లైపోసక్షన్‌లతో కొవ్వును కరిగించి తొలగించవచ్చు. కానీ ఈ సర్జరీతో సాగిన రొమ్ములను సరి చేసే వీలుండదు.

**సర్జరీతో:** ఒకవేళ పెద్ద రొమ్ములకు, కొవ్వుతో పాటు గ్రంథులు కూడా కారణమైన పక్షంలో, సర్జరీతో రెండు రొమ్ముల్లోని అదనపు కొవ్వు, గ్రంథులనూ తొలగించవలసి వస్తుంది. ఈ సర్జరీతో కిందకు జారిన రొమ్ములను పైకి సరిచేసే వీలు కూడా ఉంటుంది. మూడు గంటల నిడివి ఉండే ఈ సర్జరీ చేయించుకున్న రోజు సాయంత్రమే ఇంటికి వెళ్లిపోవచ్చు. మరుసటి రోజు నుంచి స్నానం చేయొచ్చు, డెస్క్ జాబ్స్ చేసుకోవచ్చు. సర్జరీ చిన్న కోతతో పూర్తవుతుంది. కాబట్టి గాయం మానిపోయిన తర్వాత స్కార్ క్రీమ్స్ వాడుకుంటే, మచ్చ ఎబ్బెట్టుగా కనిపించకుండా చర్మంలో కలిసిపోతుంది. ఇక నొప్పి విషయానికొస్తే, సర్జరీ చేసే సమయంలోనే నర్వ్ బ్లాక్స్ ఇంజెక్షన్లు ఇవ్వడం జరుగుతుంది కాబట్టి సర్జరీ తర్వాత 16 గంటల వరకూ నొప్పి పూర్తిగా అదుపులోకి వచ్చేస్తుంది. ఆ తర్వాత అవసరాన్ని బట్టి కొన్ని మందులు వాడుకుంటే సరిపోతుంది. ఇలా రొమ్ముల్లోని కొవ్వును తొలగించే క్రమంలో కొన్ని పాల గ్రంథులు దెబ్బతింటాయి. కాబట్టి పెళ్లై, తల్లైన తర్వాత బిడ్డకు సరిపడా పాలు తయారు అవకపోవచ్చు. సాధారణ మహిళలతో పోలిస్తే, ఇలా రొమ్ము సర్జరీ చేయించుకున్న వారిలో చనుపాల ఉత్పత్తి 40 నుంచి 50% మేరకు తగ్గుతుంది.



## పెళ్లీడు యువతుల్లో...



అవాంఛిత రోమాలు, రొమ్ముల్లో లోపాలు పెళ్లీడు యువతులను వేధిస్తూ ఉంటాయి. వీటికి లేజర్ చికిత్సలతో పాటు, ఇంప్లాంట్స్, బ్రెస్ట్ రిడక్షన్ సర్జరీలు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఆకర్షణీయంగా కనిపించడం కోసం స్కిన్ బూస్టర్స్, లేజర్ టోనింగ్‌లను ఆశ్రయించవచ్చు. కొందరు యువతులకు శరీరంలోని కొన్ని ప్రదేశాల్లోనే కొవ్వు పేరుకుపోతూ ఉంటుంది. కొందరికి చేతుల్లో, పిరుదుల్లో, పొట్టలో, రొమ్ముల్లో ఎక్కువ కొవ్వు పేరుకుంటూ ఉంటుంది. ఈ కొవ్వును తొలగించుకోవడం కోసం లేజర్ లైపోసక్షన్‌ను ఆశ్రయించవచ్చు. లేజర్స్‌తో పాటు అల్ట్రాసౌండ్ లైపోసక్షన్‌లో భాగంగా 'వేజర్స్' కూడా ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. జనరల్ అనస్థీషియాలో, ఈ సర్జరీలతో ఆయా శరీర భాగాల్లోని అదనపు కొవ్వును తొలగించి, చక్కని ఆకృతిలోకి మలుచుకోవచ్చు.

## ముక్కులోలోపాలు



పుట్టుకతోనే సంక్రమించిన వంకర ముక్కు, చట్టి ముక్కు, బండ ముక్కులను సరిదిద్దే రైనోప్లాస్టీ చికిత్సలు కూడా ఉన్నాయి. శ్వాసలో సమస్యలు, ముక్కు నుంచి నీరు కారే అలర్జిక్ రైనైటిస్‌లకు కారణమయ్యే నాశికా లోపాలను సరిచేసే చికిత్సలతో పాటు ఆకారాన్ని సరిదిద్ది ఆకర్షణీయంగా మలిచే సర్జరీలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ సర్జరీలకు, సమస్య తీవ్రతను బట్టి గంటన్నర నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. ఇలాంటి రైనోప్లాస్టీ సర్జరీల్లో కూడా మూడు రకాలుంటాయి.

**లిక్విడ్ రైనోప్లాస్టీ**

ముక్కు మీద గుంటలున్నప్పుడు సర్జరీతో పని లేని లిక్విడ్ రైనోప్లాస్టీతో జెల్‌తో అవకారాలను సరిదిద్దే వీలుంటుంది. కానీ ఈ ప్రభావం ఏడాదికి మించి ఉండదు.

**ఇంప్లాంట్స్**

ముక్కు ఎత్తు పెంచడానికి సిలికాన్ ఇంప్లాంట్స్‌ను వాడుకోవచ్చు.

**సర్జికల్ రైనోప్లాస్టీ**

ముక్కు మొత్తాన్నీ తెరిచి, లోపాన్ని సమూలంగా సరిదిద్దే సర్జరీ ఇది. దీన్లో ముక్కులోని ఎముక, మృదులాస్థిలను పునర్నిర్మిస్తారు.

## డొప్ప చెవుల కోసం



కొంతమందికి పుట్టుకతోనే గబ్బిలం చెవుల్లా చెవులు విప్పారి ఉంటాయి. చెవుల్లోని మృదులాస్థిలో ముడతలు ఏర్పడని సందర్భాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంటుంది. ఇలాంటి వాళ్లకు చెవి వెనక కోత పెట్టి మృదులాస్థిని మడత పెట్టడం జరుగుతుంది. దాంతో చెవులు వెనక్కి వెళ్లిపోతాయి. లోకల్ అనస్థీషియాతో చేసే ఈ సర్జరీ పూర్తయిన తర్వాత, రెండు గంటల్లో ఇంటికి వెళ్లిపోవచ్చు.

## బిగుతును పెంచే 'వెజైనోప్లాస్టీ'

సాధారణ ప్రసవంతో వెజైనా చుట్టూరా ఉన్న కండరాలన్నీ వదులైపోతాయి. ఫలితంగా కొందర్లో మూత్రం మీద నియంత్రణ తప్పుతుంది. దాంతో దగ్గినా, తుమ్మినా మూత్రం లీక్ అవుతూ ఉంటుంది. ఈ సమస్య తీవ్రత తక్కువగా, మొదటి రెండు దశలకే పరిమితమై ఉన్నప్పుడు వెజైనోప్లాస్టీ సర్జరీని ఎంచుకోవచ్చు. సమస్య మొదటి దశలో ఉన్న వాళ్లకు లేజర్ వెజైనోప్లాస్టీ సరిపోతుంది. ఈ సర్జరీ తర్వాత లైంగిక కలయిక కోసం ఆరు వారాలు ఆగవలసి ఉంటుంది. వదులు మరీ ఎక్కువగా ఉన్నప్పుడు సర్జరీ తప్పదు. అలాగే వరుస ప్రసవాల వల్ల లేబియా వ్యాకోచించి, చమటతో, పిగ్మెంటేషన్‌తో బాధపడే మహిళలు కూడా ఉంటారు. ఇలాంటివారికి 'లేబియోప్లాస్టీ' సర్జరీ అందుబాటులో ఉంది.

## అమ్మలకు... మమ్మీ మేకోవర్



పిల్లలను కన్న తర్వాత మహిళల శరీరాల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. పైబడే వయసుతో ముఖంలో మార్పు రావచ్చు. రొమ్ములు జారిపోవచ్చు. పొట్టలో కొవ్వు పేరుకుపోవచ్చు.

**రొమ్ముల్లో మార్పులు:** రొమ్ములు బిగుతు సడలి, గాలి తీసిన బెలూన్లలా కిందకు జారిపోతాయి. కొందరికి పరిమాణం పెరిగి మెడ నొప్పి, వెన్ను నొప్పి వేధిస్తాయి. వీళ్లకు కొవ్వు తగ్గించే బ్రెస్ట్ రిడక్షన్, బిగుతును పెంచే బ్రెస్ట్ ఎన్‌హ్యాన్స్‌మెంట్, పైకి లేపే బ్రెస్ట్ లిఫ్ట్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

**ఎత్తు పొత్తికడుపు:** వరుస ప్రసవాల వల్ల పొట్టలోని కండరాలు వదులై, కిందకు జారడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. టమ్మీ టక్ చికిత్సతో ఈ సమస్యను సరిదిద్దే వీలుంది. పిరుదులు, నడుము, పొట్ట చుట్టూరా లైపోసక్షన్ చేసి, కండరాల బిగుతును పెంచి, అదనపు చర్మాన్ని తొలగించే సర్జరీ ఇది.



డాక్టర్ గురు కర్ణ వేముల
డైరెక్టర్, పెర్సోనిక్స్ కాస్మెటిక్ అండ్
ప్లాస్టిక్ సర్జరీ సెంటర్, మణికొండ, హైదరాబాద్.

ఆహారంలో ఆరోగ్యం

# రోజూ పెరుగు తిందాం

వేసవిలో చల్లదనం కోసం తప్పనిసరిగా పెరుగు తింటూ ఉండాలని అంటూ ఉంటారు. ఇదెంత వరకూ నిజమో తెలుసుకుందాం!

పెరుగులో నీటి శాతం ఎక్కువ. అలాగే దీన్లోని ప్రొబయాటిక్ పరిమాణం పొట్టను చల్లగా ఉంచుతుంది. అలాగని పెరుగుతో, వేసవిలో పెరిగే శరీర ఉష్ణోగ్రత తగ్గిపోతుందనడానికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలూ లేవు. అయితే మధ్యాహ్న భోజనం తర్వాత పెరుగు తీసుకోవడం వల్ల, జీర్ణశక్తి పెరుగుతుంది. పేగుల ఆరోగ్యం, పోషకాల శోషణ పెరుగుతాయి. అయితే ల్యాక్టోజ్ ఇంటాలరెన్స్ సమస్య ఉన్నవారు ప్రతి రోజూ పెరుగు తీసుకోవడం వల్ల కడుపుబ్బరం, డయేరియా బారిన పడే అవకాశం ఉంటుంది. అలాగే పరిమితికి మించి పెరుగు తిన్నా, జీర్ణాశయ సమస్యలు తప్పవు. బరువు కూడా పెరుగుతారు. అలాగే పెరుగు ద్వారా అందే అదనపు క్యాల్షియం వల్ల ఐరన్, జింక్ పోషకాల శోషణ కుంటుపడే అవకాశం ఉంటుంది. కాబట్టి పెరుగు ప్రయోజనాలను పొందాలంటే, పరిమితంగానే తినాలి. మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా సరిపడా పెరుగు తింటూ ఉండాలి.



ఇదీ నిజం

# తీపి తడాఖా తగ్గేలా...

బరువు తగ్గే ప్రయత్నంలో భాగంగా ఆహార నియమాలు పాటించేవాళ్లు, తీపి విషయంలో కూడా అదే సూత్రాన్ని అనుసరిస్తూ ఉంటారు. కానీ ఇలా మనసు చంపుకోవలసిన అవసరం లేకుండా, సంతృప్తి పొందేలా తీపి తినేయాలని సూచిస్తున్నారు ప్రముఖ సెలెబ్రిటీ డైటీషియన్ రుజుత దివేకర్. ఆమె ఏమంటున్నారంటే...

సాధారణంగా ఆహార నియమాలు పాటించేవాళ్లు మైదాకు బదులుగా బాదం పిండి, లేదా తృణధాన్యాలతో తయారైన కేకులు, బిస్కెట్లు ఎంచుకుంటూ ఉంటారు. కానీ నేనైతే మైదా, చక్కెర, నెయ్యి దట్టించి తయారుచేసిన పిండి వంటలనే ఎంచుకుంటాను. తినే ప్రతి పదార్థాన్నీ పిండిపదార్థాలు, కొవ్వులు, క్యాలరీల్లో లెక్కించుకుంటూ ఉంటే, తినడంలో ఉండే సంతోషాన్ని కోల్పోతాం! దాంతో తినే పదార్థాలన్నీ రుచిని కోల్పోయి, అసంతృప్తిని మిగులుస్తాయి. కాబట్టి ఈ లోటు తెలియకుండా ఉండాలంటే పాలు తాగాలనుకుంటే వెన్న తీయని పాలే ఎంచుకోవాలి. గుడ్డు తింటే పచ్చసొనతో సహా మొత్తం గుడ్డు తినేయాలి. ఇలా తినగలిగితే తర్వాత అసంతృప్తి వేధించదు, తినాలనే యావ పెరగదు. పరిమిత ఆహారం తీసుకునేవారు అప్పుడప్పుడూ తీపి తినడం వల్ల ఒరిగే నష్టం పెద్దగా ఉండదు. తీపి తినాలనుకుంటే, షుగర్ లేదని చెప్పుకునే చాక్లెట్లకు బదులుగా నచ్చిన స్వీటును తినేయాలి. ఇలా తినడం వల్ల మానసిక సంతృప్తి దక్కి, తీపి మీద యావ



పోతుంది. అలాగే తీపితో రక్తంలోని చక్కెర మోతాదులు వేగంగా పెరుగుతాయి కాబట్టి తీపిని ఖాళీ కడుపుతో కాకుండా, భోజనం తర్వాత తినాలి. ఇలా తినడం వల్ల భోజన పదార్థాల్లోని పోషకాలు, తీపి పదార్థం లోని చక్కెరల శోషణను క్షీణింపచేస్తాయి. ఫలితంగా శరీరం మీద తీపి ప్రభావం తగ్గుతుంది.

మీకు తెలుసా?

# మూత్రవిసర్జన ఆపుకుంటే?

అత్యవసర సమావేశంలో ఉన్నప్పుడు లేదా వాష్‌రూమ్స్ అందుబాటులో లేనప్పుడు మూత్రవిసర్జనను నియంత్రించుకుంటూ ఉంటాం. అయితే ఇదే అలవాటుగా మారితే మూత్రాశయం, మూత్రపిండాల సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మూత్రవిసర్జనను బలవంతంగా ఆపుకున్నప్పుడు, మూత్రాశయం దాని సహజసిద్ధ సామర్థ్యానికి మించి సాగుతుంది. ఇదే పరిస్థితి దీర్ఘకాలం పాటు కొనసాగితే, కండరాలు బలహీనమవుతాయి. ఫలితంగా మూత్రాశయం పూర్తిగా ఖాళీ అవక, మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి. కొన్ని సందర్భాల్లో మూత్రాశయ పనితీరు దెబ్బతింటుంది. కొందర్లో మూత్రాన్ని ఆపుకోలేని పరిస్థితి తలెత్తుతుంది. అలాగే ప్రోస్టేట్ గ్లాండ్ పెరిగిన వాళ్లకు రెట్టింపు ముప్పు పొంచి ఉంటుంది. మూత్రాశయంలో మూత్రం ఎక్కువ సమయం పాటు నిల్వ ఉండిపోయినప్పుడు, మూత్రంలోని బ్యాక్టీరియా విస్తృతి చెందే వాతావరణం నెలకొంటుంది. దాంతో ఇన్‌ఫెక్షన్ పెరిగి తరచూ మూత్రవిసర్జన చేయవలసి రావడం, మూత్రవిసర్జన సమయంలో మంట, నొప్పి, పొత్తికడుపు నొప్పి, జ్వరం లాంటివి వేధిస్తాయి. అలాగే మూత్రవిసర్జనను నియంత్రించుకోవడం వల్ల మూత్రపిండాల మీద భారం పెరిగి, వాటి పనితీరు దెబ్బతింటుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశాలు కూడా పెరుగుతాయి. కాబట్టి శరీర సంకేతాలకు సకాలంలో స్పందిస్తూ, మూత్రాశయాన్ని ఖాళీ చేస్తూ ఉండాలి. మూత్రవిసర్జనను నియంత్రించుకునే పరిస్థితులకు దూరంగా ఉండాలి. సరిపడా నీళ్లు తాగుతూ, పరిశుభ్రత పాటిస్తూ ఉండాలి.



అవగాహన



# 50 ఏళ్లు దాటితే షింజిల్స్ షురూ

**చికెన్‌పాక్స్ వైరల్ ఇన్‌ఫెక్షన్ అనే విషయం మనందరికీ తెలిసిందే! ఇదే వైరస్ 'షింజిల్స్' అనే తీవ్రమైన చర్మ సమస్యకు కూడా కారణమవుతుంది. 50 ఏళ్లు పైబడిన వాళ్లను వేధించే ఈ సమస్య గురించి వైద్యులు ఏమంటున్నారంటే...**

షింజిల్స్ ప్రాణాంతకమైన ఇన్‌ఫెక్షన్ కాదు. కానీ అది జీవితాన్ని మార్చేస్తుంది. ఈ ఏడాది మన దేశంలో చేపట్టిన ఇండియా షింజిల్స్ అవగాహన సర్వేలో 50 ఏళ్లు పైబడిన 56.6% మంది పెద్దలకు షింజిల్స్ గురించి ఏమాత్రం అవగాహన లేదనే విషయం తేలింది. కానీ ఈ సమస్య గురించి పూర్తి అవగాహన ఏర్పరుచుకోగలిగితే, మరింత మెరుగ్గా దాన్ని ఎదుర్కోగలుగుతాం!

## వ్యాధి కాదు, వైరస్ వ్యాపిస్తుంది

చికెన్‌పాక్స్‌కు కారణమయ్యే వైరస్ వల్లే షింజిల్స్ సోకుతుంది. అయితే షింజిల్స్ సోకిన వ్యక్తుల నుంచి ఆ వ్యాధి ఇతరులకు వ్యాపించదు. కానీ షింజిల్స్‌కు కారణమైన వైరస్ ఇతరులకు వ్యాపిస్తుంది. అప్పటివరకూ చికెన్‌పాక్స్ బారిన పడని వ్యక్తులు షింజిల్స్ సోకిన వ్యక్తులకు బహిర్గతమైతే, వారికి షింజిల్స్ సోకడానికి బదులుగా, చికెన్‌పాక్స్ సోకుతుంది. ఈ ఇన్‌ఫెక్షన్ తగ్గిపోయిన తర్వాత కూడా సదరు వైరస్ శరీరంలో నిద్రాణంగా ఉండిపోయి, తర్వాతి కాలంలో 50 ఏళ్లు పైబడిన తర్వాత షింజిల్స్ రూపంలో వేధిస్తుంది.

## పొరపాటు పడకూడదు

దురదలతో కూడిన షింజిల్స్‌ను, ఎగ్జిమ అనే చర్మ వ్యాధిగా పొరపాటు పడేవాళ్లు ఉంటారు. దాంతో షింజిల్స్ చికిత్స ఆలస్యమైపోతుంది. ఫలితంగా వైరస్ మరింత అభివృద్ధి చెంది, దీర్ఘకాలిక సమస్యలు తెచ్చిపెడుతుంది. ఎగ్జీమాకు భిన్నమైన షింజిల్స్‌లో నొప్పి, మంట, తిమ్మిర్లు ఉంటాయి. ఆ తర్వాత శరీరం మీద పుండ్లు ఏర్పడతాయి.

## ఏళ్ల తరబడి నొప్పి

షింజిల్స్ సోకిన కొందర్లో పుండ్లు మానిన వెంటనే నొప్పి తగ్గదు. షింజిల్స్‌తో నాడుల చివర్లు దెబ్బతిని, పోస్‌థెరపిటిక్ న్యూరాల్జియా అనే పరిస్థితి ఏర్పడుతుంది. ఈ పరిస్థితిలో నాడులు అవసరానికి మించిన నొప్పి సంకేతాలను చర్మం నుంచి మెదడుకు సరఫరా చేస్తూ ఉంటాయి. దాంతో తట్టుకోలేనంత బాధ వేధిస్తుంది. ఈ నొప్పి నెలలు, సంవత్సరాల పాటు కొనసాగుతుంది. దాంతో నిద్రాభంగం కలగడం, రోజువారీ పనులకు ఆటంకం ఏర్పడడం, జీవన నాణ్యత దెబ్బతినడం జరుగుతుంది. వయసు ఎంత ఎక్కువగా ఉంటే, ఈ నొప్పి అంత ఎక్కువగా ఉంటుంది.

## ఇతర అవయవాలు కూడా...

షింజిల్స్ చర్మంతో పాటు, కీలక అవయవాలను కూడా ప్రభావితం చేస్తాయి. కంటి చుట్టూరా తలెత్తిన షింజిల్స్‌తో కళ్లు దెబ్బతిని, కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అరుదైన సందర్భాల్లో మెదడు ఇన్‌ఫ్లమేషన్, ముఖ పక్షవాతం, వినికిడి, సంతులన సమస్యలు తలెత్తుతాయి. బలహీనమైన వ్యాధినిరోధకశక్తి కలిగిన వారిలో ఈ సమస్యలు అత్యధికం.

## షింజిల్స్ పలుసార్లు

షింజిల్స్ ఒక్కసారే సోకుతుందన్నది అపోహ. ఎక్కువ శాతం మంది జీవితంలో ఒక్కసారే షింజిల్స్ బారిన పడితే, అంతకంటే ఎక్కువ సార్లు ఈ ఇన్‌ఫెక్షన్ సోకిన వాళ్లు కూడా లేకపోలేదు. అయితే రెండోసారి షింజిల్స్ సోకినప్పుడు, మొదటిసారి పుండ్లు ఏర్పడిన అదే ప్రదేశంలో పుండ్లు ఏర్పడవు.

## చికిత్స ఇలా...

- **యాంటీవైరల్:** వైరస్ తీవ్రత, వ్యవధిని తగ్గించడం కోసం మరీ ముఖ్యంగా ప్రారంభంలో ఈ మందులు వాడుకోవచ్చు.
- **నొప్పి నివారణ:** వైద్యులు సూచించే నొప్పిని తగ్గించే మందులు వాడుకోవచ్చు
- **ఉపశమనం:** ఉపశమనం కోసం పుండ్లను, దురదను తగ్గించే జెల్స్ క్రీమ్స్ వాడుకోవచ్చు.

భారతదేశంలో 50 ఏళ్లకు పైబడిన 90% మంది ఈ వైరస్‌ను శరీరాల్లో కలిగి ఉన్నారు కాబట్టి ఈ వ్యాధి పట్ల అవగాహన పెంచుకుని, నివారణ చర్యలు పాటించాలి. అందుకోసం షింజిల్స్ గురించి వైద్యులతో చర్చించి, టీకాలతో నివారణ చర్యలు చేపట్టాలి. అలాగే క్రమంతప్పకుండా వ్యాయామం చేయడం, బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధినిరోధకశక్తిని దృఢంగా ఉంచుకోవాలి.



డాక్టర్ మేక సత్యన్నారాయణ
సీనియర్ కన్సల్టెంట్
ఫ్యామిలీ ఫిజీషియన్,
అశ్విని ఐడి క్లినిక్, హైదరాబాద్

## రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు వ్యక్తిగతం

» కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఎక్కువ: మహేశ్ గౌడ్



హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణపై పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. తమ పార్టీలో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఎక్కువని.. అయితే ఆయన పార్టీ గీత దాటి మాట్లాడారా.. లేదా అన్నది పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తనకు తెలిసి ఫలానా వారికి మంత్రి పదవి ఇవ్వొద్దంటూ అధిష్ఠానానికి జానారెడ్డి లేఖ రాయలేదన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణ అన్నది పార్టీ సమష్టిగా తీసుకునే నిర్ణయమని, అనేక సమీకరణాలతో కూడుకున్న అంశమని తెలిపారు. పార్టీలో చేరికలపై ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, రాజగోపాల్‌రెడ్డి.. ఆనాటి పరిస్థితుల దృష్ట్యా కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రాకూడదంటే కాంగ్రెస్‌లో చేరడమే శరణ్యమని భావించి పార్టీలో చేరారని చెప్పారు. వారి చేరికతో అసెంబ్లీ ఎన్నికల్లో విజయావకాశాలూ మెరుగుపడ్డాయన్నారు. అయితే తాము కాంగ్రెస్‌లో చేరాం కాబట్టే పార్టీ గెలిచిందని వారనుకోవడము..కాంగ్రెస్ గెలుస్తుందనే వారు పార్టీలో చేరారని అనుకోవడం.. రెండూ నిజమే కావచ్చని వ్యాఖ్యానించారు. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ, పార్టీ కార్యవర్గం ఏర్పాటు ఉంటుందని ఆశిస్తున్నానన్నారు.

### కేటీఆర్ పగటి కలలు మానుకోవాలి..

'పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ఏం వెలగబెట్టిందని మళ్లీ అధికారంలోకి వస్తది? తెలంగాణను దోచుకున్న కేసీఆర్ కుటుంబానికి ప్రజలు మళ్లీ ఓటెందుకు వేస్తరు? ఆ పార్టీ అధికారంలోకి వచ్చే ప్రశ్నే లేదు. కేటీఆర్ పగటి కలలు కనడం మానుకుంటే మంచిది' అని మహేశ్‌గౌడ్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా, లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు వచ్చినా బీఆర్ఎస్ నేతలకు బుద్ధి రాలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబ సభ్యుల ప్రమేయంతో పెద్ద ఎత్తున రైస్ స్కామ్ జరిగిందని, దొడ్డు బియ్యాన్ని సన్న బియ్యంగా మార్చి ఎగుమతి చేయడం ద్వారా రూ.వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వీటన్నింటిపైనా విచారణ చేస్తామన్నారు. దేశ చరిత్రలో నిలిచిపోయేలా సన్న బియ్యం పంపిణీ చేపట్టామని, ఎస్సీ వర్గకరణ జీవోను విడుదల చేశామని, ధరణితో విసిగి వేసారిన ప్రజలకు భూ భారతితో మోక్షం లభించిందని చెప్పారు.

### ప్రధాని హోదాలో చౌకబారు మాటలా?: మహేష్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని హోదాలో ఉండి.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై చౌకబారు విమర్శలు చేయడం మోదీకి తగదని టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ అన్నారు. హెచ్‌సీయూ భూముల విషయంలో ఆయన వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదన్నారు. హెచ్‌సీయూలో మున్సిపల్, అటవీ, పర్యావరణ అనుమతులు లేకుండా నిర్మించిన 5 భవనాలను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన సంగతి మరిచారన్నారు. దేశంలో లక్షలాది ఎకరాల అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు మోదీ కట్టబెట్టారని ఆరోపించారు. కాగా, కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి ఏఐ మార్ఫింగ్ ఫొటోలను నమ్మిన ప్రధాని మోదీ.. వాస్తవాలు తెలుసుకోకుండా తెలంగాణ ప్రభుత్వంపై మాట్లాడుతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. అంబేడ్కర్ జయంతి రోజునే ఆయన వాక్ స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఎంత ఖర్చు చేస్తుందన్న సమాచారాన్ని ప్రధాని అధికారుల నుంచి తెలుసుకుని వెళ్లాలన్నారు.

# అవి ప్రభుత్వ భూములే..

## ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ రికార్డుల్లోనే కంచ గచ్చిబౌలి భూమి.. అడవి అయి ఉంటే అటవీ శాఖ పరిధిలోనే ఉండేది

» న్యాయ వివాదం వల్ల ఏళ్ల తరబడి ఆ స్థలం ఖాళీగా ఉంది
» చెట్లు పెరిగి అడవిలా కనిపిస్తోంది
» సుప్రీంకోర్టులో సర్కారు అఫిడవిట్
» రేపు విచారణ చేపట్టనున్న ధర్మాసనం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానికి చెందినవేనని, ఎన్నో ఏళ్లుగా అవి రెవెన్యూ భూములుగా రికార్డుల్లో నమోదై ఉన్నాయని సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. న్యాయ వివాదం వల్ల ఏళ్ల తరబడి ఖాళీగా ఉండటంతో ఆ స్థలంలో చెట్లు పెరిగి, చూడడానికి అడవిలా కనిపిస్తోందని తెలిపింది. ఒకవేళ అది అడవి అయి ఉంటే.. అటవీ శాఖ పరిధిలోనే ఉండేదని, రెవెన్యూ పరిధిలో కాదని వివరించింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో ఈ నెల 3న సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన విషయం తెలిసిందే. జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ నుంచి ఈ వ్యవహారంపై నివేదిక తెప్పించుకుని పరిశీలించింది. అనంతరం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వయంగా కంచ గచ్చిబౌలి ప్రాంతాన్ని సందర్శించి ఈ నెల 16లోపు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. తమ ఆదేశాలు పాటించకుంటే సీఎస్ వ్యక్తిగతంగా బాధ్యులవుతారని, అక్కడే చెరువు పక్కన తాత్కాలికంగా నిర్మించే జైలుకు వెళ్లాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించింది. ఈనేపథ్యంలో సీఎస్ శాంతికుమారి నేతృత్వంలో పది మంది సీనియర్ అధికారుల బృందం శనివారం ఢిల్లీకి వచ్చింది. ఆదివారం వరకు అక్కడే ఉండి సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతోపాటు మరికొందరితో సుదీర్ఘంగా చర్చించింది. తాజాగా సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది.

### ఖాళీగా ఉండటంతో చెట్లు పెరిగాయి

కంచ గచ్చిబౌలి భూములు తెలంగాణ ప్రభుత్వానివేనని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి ఆ భూములతో సంబంధం లేదని రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. "అక్కడ ఉన్నది అటవీయేతర ప్రాంతమే. రెవెన్యూ, అటవీ శాఖల రికార్డుల్లో ఎక్కడా అది అటవీ భూమిగా నమోదు కాలేదు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి ఆ భూములను ఐఎంజీ భారత అనే సంస్థకు అప్పగించారు. కానీ సదరు సంస్థ ఎటువంటి కార్యకలాపాలు ప్రారంభించకపోవడంతో ఆ భూములను తర్వాతి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీనిపై ఐఎంజీ భారత కంపెనీకి చెందిన బిల్లీ రావు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అప్పటి నుంచి ఈ భూవిపై న్యాయ వివాదం కొనసాగుతోంది. ఆ భూమి ప్రభుత్వానిదేనని ఇటీవల న్యాయస్థానం తేల్చింది. సుదీర్ఘకాలం ఖాళీగా ఉండటంతో ఆ భూముల్లో చెట్లు పెరిగాయే తప్ప ఆ భూములతో అటవీశాఖకుగానీ, హెచ్‌సీయూకుగానీ ఎటువంటి సంబంధం లేదు. అక్కడ నిబంధనల ప్రకారమే చెట్లను తొలగించాం. చట్టాలకు లోబడే వ్యవహరించాం. అక్కడ అనుమతి తీసుకోవాల్సిన చెట్లు పదుల సంఖ్యలోనే ఉన్నాయి. ఆ చెట్ల జోలికి వెళ్లలేదు"అని ప్రభుత్వం పేర్కొన్నట్టు తెలిసింది. ఇక కోర్టు సహాయకులు (అమికస్ క్యూరీ) లేవనెత్తిన ఐదు ప్రశ్నలకూ అందులో స్పష్టత ఇచ్చినట్టు సమాచారం. కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు సుమోటో పిటిషన్‌తోపాటు 'బీద ఛేంజ్ వెల్ఫేర్ సొసైటీ' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పైనా 16న సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది.

# తెలంగాణలో అడవులపైకి బుల్డోజర్లు

(మొదటిపేజీ తరువాయి)


ర్యాలీలో మాట్లాడారు. "తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయింది. అదే సమయంలో అడవులపైకి బుల్డోజర్లను నడపడంలో బిజీగా ఉంది. పర్యావరణాన్ని దెబ్బతీయడం.. వన్యప్రాణులను ప్రమాదంలో పడేయడం.. అదే కాంగ్రెస్ పనితీరు. మేం చెత్త నుంచి విద్యుత్ తయారు చేస్తుంటే.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం అడవులను నాశనం చేస్తోంది.." అని మోదీ వ్యాఖ్యానించారు.

### ప్రజలకు కాంగ్రెస్ విశ్వాసఘాతుకం

కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రజల పట్ల ఆ పార్టీ విశ్వాసఘాతుకానికి పాల్పడుతోందని ప్రధాని మోదీ విమర్శించారు. ఆ రాష్ట్రాల్లో అభివృద్ధిని, సంక్షేమాన్ని అటకెక్కించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలోని కర్ణాటకలో విద్యుత్ నుంచి పాల దాకా, బస్సు చార్జీల నుంచి విత్తనాలకు దాకా ప్రతిదాని ధరలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. సిద్ధరామయ్య ప్రభుత్వం అవినీతిలో కర్ణాటకను దేశంలోనే నంబర్ వన్ చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం ప్రజల ముందు రెండు మోడళ్లు ఉన్నాయని మోదీ చెప్పారు. అందులో కాంగ్రెస్ మోడల్ పూర్తిగా అబద్ధమని నిరూపితమైందని, ఆ పార్టీలో కుర్చీ గురించి మాత్రమే ఆలోచిస్తారని పేర్కొన్నారు. రెండో మోడల్ సత్యం ఆధారంగా బీజేపీ చేస్తున్న పరిపాలన అని మోదీ చెప్పారు. అంబేడ్కర్ ఆలోచనల దిశలో బీజేపీ పాలన కొనసాగుతోందన్నారు.

### ముస్లింలపై అంత ప్రేముంటే కాంగ్రెస్ అధ్యక్షుడిగా చేయాలి

తమ కొత్త వక్ఫ్ చట్టంపై కాంగ్రెస్ రాద్ధాంతం చేస్తోందని.. యూపీఏ హయాంలో 2013లో తెచ్చిన చట్టం భూమాఫియాకు మాత్రమే పనికొచ్చిందని ప్రధాని మోదీ మండిపడ్డారు. తాము తెచ్చిన కొత్త చట్టం ముస్లింలలోని పేద, పస్మాండ కుటుంబాలకు న్యాయం చేస్తుందని, ఇది అసలైన సామాజిక న్యాయమని చెప్పారు.



ముస్లిం యువత ఇంకా టైర్లకు పంచర్లు వేసుకుంటూ బతకాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్యానించారు. ముస్లింల విషయంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ముస్లింలపై అంత ప్రేమే ఉంటే కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముస్లింను ఎన్నుకోవాలని.. కాంగ్రెస్ పార్టీ తరఫున 50 శాతం ఎంపీ టికెట్లను ముస్లింలకు ఇవ్వాలని సవాల్ చేశారు. ఒక్క ముస్లింలు అని మాత్రమేకాదు, కాంగ్రెస్ ఎవరికీ కూడా మంచి చేయాలని చూడదని, అది కాంగ్రెస్ నైజమని మోదీ ఆరోపించారు. కర్ణాటకలో మత ప్రాతిపదిక రిజర్వేషన్లు ఇవ్వాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగానికి, అంబేడ్కర్ ఆశయాలకు విరుద్ధమని పేర్కొన్నారు.

## రెండు డీపీఆర్‌లు ఒకేసారి ఇవ్వండి

» మెట్రో రెండో దశ పార్ట్-బీ కారిడార్లపై మెట్రో అధికారులకు ప్రభుత్వం ఆదేశం!

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో మెట్రో రెండోదశ పార్ట్-బీలోని మూడు కారిడార్లకు(జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు- ఫోర్త్‌సిటీ) సంబంధించిన డీపీఆర్‌లను ఒక్కొక్కటిగా కాకుండా రెండింటినీ ఒకేసారి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం మెట్రో అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట్ కారిడార్లు రెండింటికి కలిపి అధికారులు నార్త్ సిటీ పేరిట ఒక డీపీఆర్‌ను, ఎయిర్‌పోర్టు-ఫోర్త్ సిటీ కారిడార్‌కు మరో డీపీఆర్‌ను రూపొందిస్తున్నారు. నార్త్ సిటీ కారిడార్ల డీపీఆర్ రూపకల్పన 80% పూర్తైందని ఇటీవల సమీక్ష సందర్భంగా మెట్రో అధికారులు ప్రభుత్వానికి తెలియజేయగా.. ఫోర్త్ సిటీ మెట్రో డీపీఆర్‌ను కూడా రూపొందించి, రెండింటిని కలిపి తీసుకురావాలని ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు సమాచారం. అప్పుడే క్యాబినెట్ సమావేశంలో రెండింటిపై చర్చించి ఆమోదిస్తామని చెప్పడంతో అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించినట్లు తెలిసింది. హడావుడిగా డీపీఆర్‌లను తయారు చేయొద్దని, ఒకటికి రెండు సార్లు ఆలోచించి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని రూపొందించాలని ప్రభుత్వ పెద్దలు మెట్రో అధికారులకు సూచించారు. ప్రధానంగా ఫోర్త్‌సిటీకి వెళ్లే మెట్రోపై స్థానిక పరిస్థితులు, అవసరాలపై అధ్యయనం చేయాలని, జనసాంద్రత కలిగిన ప్రదేశాల్లోనే స్టేషన్లను నిర్మించాలన్నారు. ఇదిలా ఉండగా, మెట్రో రైలు సంస్థలో పదవి విరమణ చేసి కాంట్రాక్టుపై పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో 28 మంది సీనియర్లను తొలగించారు. ఈ నేపథ్యంలో పార్ట్-బీ కారిడార్ల డీపీఆర్‌ల తయారీ, వివిధ రకాల పనులకు అవసరపడే సీనియర్ అధికారులకు మళ్లీ అవకాశం కల్పించాలని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. కీలక అధికారుల సర్వీసును పొడిగిస్తే మే నెలలోగా రెండు డీపీఆర్‌లను పూర్తి చేసి సమర్పిస్తామని చెప్పినట్లు సమాచారం. ఫలితంగా 8-10 మందికి సర్వీస్ రెన్యువల్ అయ్యే అవకాశాలున్నాయి.

### బీజేపీ నేత చీకోటి ప్రవీణ్‌పై కేసు

రామగిరి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు, క్రైస్తవులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకుగాను బీజేపీ నేత చీకోటి ప్రవీణ్‌కుమార్‌పై నల్లగొండ పోలీసులు కేసు నమోదు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా 12వ తేదీన నల్లగొండలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. ర్యాలీలో ప్రవీణ్.. ముస్లింలు, క్రైస్తవులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడారు. ఈ మేరకు చీకోటి ప్రవీణ్‌కుమార్‌పై సుమోటోగా కేసు నమోదు చేసినట్లు నల్లగొండ సీఐ తెలిపారు.

# చిత్రజ్యోతి

SINCE 1965

## భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

## సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫీమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

## మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

## విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తీకేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

## పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

## జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపీచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

## తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్టు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచవ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

## బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

## ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హరిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

## వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురులంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

**నేటి మ్యాచ్** | వేదిక చండీగఢ్
**పంజాబ్ x కోల్‌కతా** | రా.7.30 నుంచి

# సలీమాకే పగ్గాలు

### ఆసీస్ టూర్‌కు భారత మహిళల హాకీ జట్టు


సలీమా టెటే

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలో పర్యటించే భారత మహిళల హాకీ జట్టులో ఐదు కొత్తముఖాలకు చోటు దక్కింది. మిడ్‌ఫీల్డర్ సలీమా టెటే సారథ్యంలోని 26 మంది సభ్యుల జట్టును హాకీ ఇండియా సోమవారం ప్రకటించింది. జ్యోతి సింగ్, సుజాత కుజుర్, అజ్మీనా కుజుర్, పూజా యాదవ్, సలీమా సోదరి మహిమ టెటే తొలిసారి జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి మే 4 వరకు జరిగే పర్యటనలో ఆతిథ్య ఆసీస్‌తో భారత్ ఐదు మ్యాచ్‌లు ఆడనుంది. ఆసీస్-ఎతో రెండు మ్యాచ్‌లు, సీనియర్ జట్టుతో మూడు మ్యాచ్‌ల్లో మనమ్మాయిలు తలపడనున్నారు.

# రుతురాజ్ స్థానంలో మాత్రే

### జంపా బదులు స్మరణ్



న్యూఢిల్లీ: గాయపడిన చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో ఆయుష్ మాత్రేను జట్టులోకి తీసుకొన్నట్టు ఐపీఎల్ నిర్వాహకులు తెలిపారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ స్పిన్నర్ ఆడమ్ జంపా కూడా గాయంతో టోర్నీకి దూరమయ్యాడు. దీంతో అతడి స్థానాన్ని స్మరణ్ రవిచంద్రన్‌తో భర్తీ చేశారు. ముంబై తరఫున దేశవాళీ క్రికెట్ ఆడుతున్న మాత్రేతో రూ. 30 లక్షలకు చెన్నై ఒప్పందం చేసుకొంది. 9 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఆయుష్ 962 పరుగులు చేశాడు. కర్ణాటకకు చెందిన ఎడమచేతి వాటం బ్యాటర్ స్మరణ్‌ను సన్‌రైజర్స్ రూ. 30 లక్షలకు కొనుగోలు చేసింది.

# ఆర్చరీ కమిటీ సభ్యుడిగా శంకరయ్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఆర్చరీ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా మహబూబాబాద్‌కు చెందిన పుట్టా శంకరయ్య నియమితులయ్యారు. ఈ కమిటీలో మొత్తం ఎనిమిది మందికి చోటు కల్పించారు. చైర్మన్‌గా విజయవాడకు చెందిన చెరుకూరి సత్యనారాయణ, కన్వీనర్‌గా సుమంత చంద్ర మొహంతి, జమ్యాంగ్ సెరింగ్, దేవానంద సింగ్, అలాగే సంజీవ్ సింగ్, పూర్ణిమ, జీవన్‌జ్యోత్ సింగ్ (ఈ ముగ్గురూ ద్రోణాచార్య అవార్డీలు)కు కమిటీలో చోటు లభించింది.

# ధీరజ్‌కు కాంస్యం



న్యూఢిల్లీ: ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1లో తెలుగు ఆటగాడు బొమ్మదేవర ధీరజ్ కాంస్యం సాధించాడు. అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడాలో ముగిసిన ఈ ఈవెంట్‌లో భారత్ ఓ స్వర్ణం సహా నాలుగు పతకాలతో నాలుగో స్థానంలో నిలిచింది. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం కాంస్య పోరులో ధీరజ్ 6-4 పాయింట్ల తేడాతో ఆండ్రెస్ టెమినో (స్పెయిన్)ను ఓడించాడు. ఆరంభంలోనే 2-4తో వెనుకబడిన ధీరజ్.. తీవ్ర ఒత్తిడి మధ్య అద్భుత ప్రదర్శనతో కంచు పతకం సొంతం చేసుకొన్నాడు.

### అక్షర్ పటేల్‌కు రూ.12 లక్షల జరిమానా


న్యూఢిల్లీ: స్లో ఓవర్ రేట్ కారణంగా ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. ముంబై ఇండియన్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో డీసీ నిర్ణీత సమయంలో ఓవర్ల కోటాను పూర్తి చేయలేకపోయింది. ఈ మ్యాచ్‌లో ముంబై 12 రన్స్ తేడాతో నెగ్గిన విషయం తెలిసిందే.

# డిస్కస్ త్రోలో ప్రపంచ రికార్డు



రమోనా (యూఎస్): డిస్కస్‌త్రోలో లిథువేనియా అథ్లెట్ మైకోలాస్ అలెక్‌నా చరిత్ర సృష్టించాడు. పురుషుల డిస్కస్ త్రోలో తొలిసారి 75 మీటర్లు విసిరి నయా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఓక్లహామా త్రోస్ సిరీస్ వరల్డ్ ఇన్విటేషనల్ పోటీల్లో 22 ఏళ్ల మైకొలాస్ ఒక్క రోజే రెండుసార్లు ప్రపంచ రికార్డు త్రోలు విసరడం విశేషం. తొలి త్రోలోనే మైకొలాస్ రికార్డుస్థాయిలో 74.89 మీటర్ల దూరం విసిరాడు. రెండో త్రోలో డిస్కస్‌ను 75.56 మీటర్ల దూరం విసిరి తన రికార్డును తానే బద్దలుకొట్టుకొన్నాడు.

# ధోనీ పనైపోయిందని అనుకోవద్దు



న్యూఢిల్లీ: వరుసగా ఐదు మ్యాచ్‌లు ఓడిన చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకొంది. అయితే, మెగా లీగ్‌లో చెన్నై ఇప్పటికీ గట్టిపోటీదారు అని టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ విశ్వాసం వ్యక్తం చేశాడు. చెన్నై కష్టాల్లో ఉన్నా ధోనీ సారథ్యంలో పుంజుకొనే అవకాశాలున్నాయన్నాడు. వయసు పైబడడం అనేది మహీకి వర్తించదన్నాడు. ఢిల్లీ, ముంబై, చెన్నై, సన్‌రైజర్స్ జట్లు బలంగా ఉన్నాయని తాను విశ్వసిస్తున్నట్టు చెప్పాడు.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.రరే |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 6 | 4 | 2 | 0 | 8 | 1.081 |
| ఢిల్లీ | 5 | 4 | 1 | 0 | 8 | 1.006 |
| బెంగళూరు | 6 | 4 | 2 | 0 | 8 | 0.672 |
| లఖ్‌నవూ | 7 | 4 | 3 | 0 | 8 | 0.086 |
| కోల్‌కతా | 6 | 3 | 3 | 0 | 6 | 0.803 |
| పంజాబ్ | 5 | 3 | 2 | 0 | 6 | 0.065 |
| ముంబై | 6 | 2 | 4 | 0 | 4 | 0.027 |
| రాజస్థాన్ | 6 | 2 | 4 | 0 | 4 | -0.838 |
| హైదరాబాద్ | 6 | 2 | 4 | 0 | 4 | -1.245 |
| చెన్నై | 7 | 2 | 5 | 0 | 4 | -1.276 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

# చెన్నై గెలిచిందోచ్..

- సత్తా చాటిన బౌలర్లు
- ఆదుకున్న దూబే, ధోనీ
- 5 వికెట్ల తేడాతో లఖ్‌నవూ ఓటమి


షేక్ రషీద్ (27)


శివమ్ దూబే (43 నాటౌట్)

లఖ్‌నవూ: ఒకటా.. రెండా.. వరుసగా ఐదు ఓటములతో నిరుత్సాహపర్చిన చెన్నై సూపర్ కింగ్స్ ఎట్టకేలకు విజయం రుచి చూసింది. సీజన్‌లో తొలిసారిగా బౌలర్లు అద్భుత ప్రదర్శన కనబర్చగా.. అటు బ్యాటింగ్‌లో శివమ్ దూబే (43 నాటౌట్) నిలకడ, ఎంఎస్ ధోనీ (11 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 26 నాటౌట్) మెరుపు ఆటతీరుతో చివరి ఓవర్‌లో చెన్నై గట్టెక్కింది. మరోవైపు హ్యాట్రిక్ విజయాల జోష్‌లో ఉన్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ 5 వికెట్ల తేడాతో ఓడాల్సి వచ్చింది. ఇక మూడేళ్లగా చెన్నై జట్టుతోనే ఉంటున్న ఆంధ్ర క్రికెటర్ షేక్ రషీద్ (19 బంతుల్లో 6 ఫోర్లతో 27) అరంగేట్రంలోనే రాణించాడు. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లకు 166 పరుగులు చేసింది. రిషభ్ పంత్ (63), మిచెల్ మార్ష్ (30) రాణించారు. జడేజా, పథిరనలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 19.3 ఓవర్లలో 5 వికెట్లకు 168 పరుగులు చేసి గెలిచింది. రచిన్ (37) ఆకట్టుకున్నాడు. బిష్ణోయ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ధోనీ నిలిచాడు.

**రషీద్-రచిన్ శుభారంభంతో..:** ఓ మాదిరి ఛేదనలో చెన్నైకి అదిరే ఆరంభం లభించింది. తొలి ఐపీఎల్ మ్యాచ్‌లోనే షేక్ రషీద్ ఓపెనర్‌గా బరిలోకి దిగి బెదురులేకుండా ఆడాడు. చూడముచ్చటైన షాట్లతో జట్టుకు తనపై నమ్మకం కుదిరేలా ఆకట్టుకున్నాడు. తొలి ఓవర్‌లో మరో ఓపెనర్ రచిన్ రెండు ఫోర్లు బాదగా.. ఆ తర్వాతి ఓవర్‌లో రషీద్ మూడు ఫోర్లు బాది వహ్వా అనిపించాడు. అంతేకాకుండా శార్దూల్ వేసిన ఓవర్‌లోనూ మరో మూడు ఫోర్లతో 14 రన్స్ అందించాడు. అయితే ఆత్మవిశ్వాసంతో కనిపించిన అతడు భారీ షాట్‌కు యత్నించి అవేశ్‌కు చిక్కాడు. రషీద్ 27 పరుగుల్లో ఆరు ఫోర్లు ఉండడం విశేషం. అతని జోరుతో పవర్‌ప్లేలో చెన్నై 59/1 స్కోరుతో పటిష్ఠంగా కనిపించింది. కానీ ఆ తర్వాత స్పిన్నర్లు హవా చూపడంతో ఒక్కసారిగా తడబడింది. స్కోరు నెమ్మదించడంతో పాటు స్వల్ప వ్యవధిలోనే రచిన్, త్రిపాఠి (9), జడేజా (7), విజయ్ శంకర్ (9)ల వికెట్లను కోల్పోయింది. అప్పటికి స్కోరు 111/5. ఈ స్థితిలో ప్రేక్షకుల హోరు మధ్య అడుగుపెట్టిన ధోనీ 16వ ఓవర్‌లో రెండు ఫోర్లు, తర్వాత శార్దూల్ ఓవర్‌లో భారీ సిక్సర్‌తో ఒత్తిడి తగ్గించాడు. ఇక 19వ ఓవర్‌లో దూబే 4,6.. ఎంఎస్ 4తో 19 రన్స్ రావడంతో ఎల్‌ఎస్‌జీ ఆశలు వదులుకుంది. ఆరు బంతుల్లో ఐదు రన్స్ కావాల్సిన వేళ దూబే 4తో మరో మూడు బంతులుండగా చెన్నైకి విజయం దక్కింది.

**పంత్ పోరాటం:** సీజన్‌లో తొలిసారిగా చెన్నై బౌలర్లు క్రమశిక్షణాయుత బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు. మధ్య ఓవర్లలో మరింత కట్టుదిట్టం చేయడంతో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ పరుగుల కోసం చెమటోడ్చింది. ముఖ్యంగా స్పిన్నర్ నూర్ అహ్మద్ తన మ్యాజిక్ బంతులతో వణికించాడు. అయితే పంత్ మాత్రం తొలిసారి బ్యాట్ ఝుళిపించాడు. చివరి మూడు ఓవర్లలో అతడి ఎదురుదాడికి లఖ్‌నవూ 44 రన్స్‌తో గౌరవప్రదమైన స్కోరందుకుంది. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ మార్‌క్రమ్ (6)ను ఖలీల్ అవుట్ చేశాడు. కవర్ పాయింట్‌లోకి కొట్టిన బంతి గాల్లోకి లేవగా త్రిపాఠి వేగంగా పరిగెత్తుతూ డైవింగ్ క్యాచ్ అందుకున్నాడు. అలాగే నాలుగో ఓవర్‌లోనే ప్రమాదకర పూరన్ (8)ను అన్షుల్ కాంబోజ్ ఎల్బీ చేయడంతో జట్టు పవర్‌ప్లేలో 42/2 స్కోరుతో నిలిచింది. క్రీజులో మార్ష్, పంత్ ఉన్నా బంతి బ్యాట్ మీదికి రాకపోవడంతో భారీ షాట్లకు ఇబ్బందిపడ్డారు. మూడో వికెట్‌కు 50 పరుగులు చేరిన వెంటనే మార్ష్‌ను జడేజా బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత 12వ ఓవర్‌లో బదోని (22) రెండు వరుస సిక్సర్లతో కాస్త కదలిక తెచ్చాడు. అయితే తర్వాతి ఓవర్‌లోనే తను క్యాచ్ అవుటైనా అది నోబ్‌గా తేలింది. అలాగే 14వ ఓవర్ తొలి బంతికి అంపైర్ ఎల్బీ ఇచ్చినా రివ్యూలో బతికిపోయాడు. కానీ నాలుగో బంతికి ధోనీ స్టంప్ చేయడంతో వెనుదిరగక తప్పలేదు. మరోవైపు 14-17 ఓవర్ల మధ్య చెన్నై బౌలర్లు 18 పరుగులే ఇవ్వడంతో 150 స్కోరు కూడా కష్టమే అనిపించింది. ఈ దశలో పంత్ రెండు సిక్సర్లతో 18వ ఓవర్‌లో 18 రన్స్ రాబట్టాడు. అలాగే ఐపీఎల్‌లో 19 ఇన్నింగ్స్ తర్వాత తను అర్ధసెంచరీ కూడా పూర్తి చేశాడు. తర్వాతి ఓవర్‌లోనూ పంత్, సమద్‌ల సిక్సర్లతో 16 రన్స్ సమకూరాయి. ఇక చివరి ఓవర్‌లో పంత్, శార్దూల్ (6)ల వికెట్లను పథిరన తీయగా సమద్ రనౌటయ్యాడు. అయితే 10 రన్స్‌తో ఎల్‌ఎస్‌జీ 160 స్కోరు దాటగలిగింది.

### స్కోరుబోర్డు

**లఖ్‌నవూ:** మార్‌క్రమ్ (సి) త్రిపాఠి (బి) ఖలీల్ 6; మార్ష్ (బి) జడేజా 30; పూరన్ (ఎల్బీ) కాంబోజ్ 8; పంత్ (సి) ధోనీ (బి) పథిరన 63; బదోని (స్టంప్) ధోనీ (బి) జడేజా 22; సమద్ (రనౌట్) 20; మిల్లర్ (నాటౌట్) 0; శార్దూల్ (సి) రషీద్ (బి) పథిరన 6; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 166/7. వికెట్ల పతనం:** 1-6, 2-23, 3-73, 4-105, 5-158, 6-158, 7-166; **బౌలింగ్:** ఖలీల్ 4-0-38-1; కాంబోజ్ 3-0-20-1; ఒవర్టన్ 2-0-24-0; జడేజా 3-0-24-2; నూర్ అహ్మద్ 4-0-13-0; పథిరన 4-0-45-2.

**చెన్నై:** రషీద్ (సి) పూరన్ (బి) అవేశ్ 27; రచిన్ (ఎల్బీ) మార్‌క్రమ్ 37; త్రిపాఠి (సి అండ్ బి) బిష్ణోయ్ 9; జడేజా (సి) మార్‌క్రమ్ (బి) బిష్ణోయ్ 7; దూబే (నాటౌట్) 43; విజయ్ శంకర్ (సి) అవేశ్ (బి) దిగ్వేష్ 9; ధోనీ (నాటౌట్) 26; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 19.3 ఓవర్లలో 168/5. వికెట్ల పతనం:** 1-52, 2-74, 3-76, 4-96, 5-111; **బౌలింగ్:** శార్దూల్ 4-0-56-0; ఆకాశ్ 1-0-13-0; దిగ్వేష్ 4-0-23-1; అవేశ్ 3.3-0-32-1; బిష్ణోయ్ 3-0-18-2; మార్‌క్రమ్ 4-0-25-1.

### చెన్నై కాదు.. లఖ్‌నవూనే



ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. సొంత గడ్డపైనే కాదు.. దేశంలో ఏ వేదికపై ఆడినా అభిమానులకు కొదవుండదు. తాజాగా వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై లఖ్‌నవూకు వచ్చినప్పటికీ.. సీఎస్‌కేపై తమ ప్రేమను చాటుకుంటూ స్టేడియం మొత్తం పసుపుమయమైంది. దీనికంతటికీ కారణం ఎంఎస్ ధోనీయేనని వేరే చెప్పనవసరం లేదు. స్థానిక జట్టు అభిమానులకన్నా రెండింతలు ఎంఎస్ నెంబర్ 7 జెర్సీలతోనే ఫ్యాన్స్ కనిపించడంతో మ్యాచ్ జరుగుతోంది చెపాక్‌లోనా? ఏకనా స్టేడియంలోనా? అనే సందేహం కలిగింది.

# రుణగ్రహీతలకు గుడ్‌న్యూస్

### ఎస్‌బీఐ రెపో అనుసంధానిత రుణ రేటు 0.25 శాతం తగ్గింపు

- అదే బాటలో బీఓఎం, బీఓఐ, ఐఓబీ
- నేటి నుంచి కొత్త రేట్లు అమలులోకి..

న్యూఢిల్లీ: రెపో అనుసంధానిత రుణ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్)ను 0.25 శాతం తగ్గిస్తున్నట్లు దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ సోమవారం ప్రకటించింది. దాంతో బ్యాంక్ ఆర్ఎల్ఎల్ఆర్ 8.50 శాతం నుంచి 8.25 శాతానికి తగ్గనుంది. తద్వారా బ్యాంక్ నుంచి కొత్తగా రుణం తీసుకోబోయే వారికి కాస్త చౌకగా రుణం లభించనుండటంతో పాటు ఇప్పటికే రుణం తీసుకున్నవారిపై నెలవారీ వాయిదా (ఈఎంఐ) చెల్లింపుల భారం కూడా తగ్గనుంది. కాగా, బహిరంగ మార్కెట్ ప్రామాణిక రుణ రేటు (ఈబీఎల్ఆర్)ను సైతం పావు శాతం తగ్గించి 8.65 శాతానికి కుదిస్తున్నట్లు బ్యాంక్ వెల్లడించింది. సవరించిన రేట్లు ఈ నెల 15 (మంగళవారం) నుంచి అమలులోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ నెల 9న ప్రకటించిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం తగ్గించింది. దాంతో బ్యాంకులు కూడా రెపో తగ్గింపు ప్రయోజనాన్ని తమ కస్టమర్లకు బదిలీ చేస్తున్నాయి.

- ఎస్‌బీఐతో పాటు బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం), ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ) కూడా రుణాలపై వడ్డీ రేట్లను మంగళవారం నుంచి అమలులోకి వచ్చేలా తగ్గించాయి.
- కొత్త, పాత కస్టమర్లకు ప్రయోజనం కలిగేలా గృహ రుణాల వడ్డీ రేటును 0.25 శాతం తగ్గిస్తున్నట్లు బీఓఐ ప్రకటించింది. దాంతో బ్యాంక్ గృహ రుణ రేటు 7.90 శాతానికి తగ్గింది. హోమ్ లోన్‌తో పాటు ఎంపిక చేసిన రిటైల్ రుణాల (వాహన, వ్యక్తిగత, విద్య, తనఖా రుణాలు) పైనా వడ్డీ రేటును పావు శాతం తగ్గిస్తున్నట్లు బీఓఐ స్పష్టం చేసింది.
- ఆర్ఎల్ఎల్ఆర్‌ను 0.25 శాతం తగ్గిస్తున్నట్లు బీఓఎం తెలిపింది. దాంతో బ్యాంక్ ఆర్ఎల్ఎల్ఆర్ 9.05 శాతం నుంచి 8.80 శాతానికి తగ్గింది. ఐఓబీ సైతం పావు శాతం తగ్గించడంతో పాటు బ్యాంక్ ఆర్ఎల్ఎల్ఆర్ 9.10 శాతం నుంచి 8.85 శాతానికి దిగివచ్చింది.

### డిపాజిట్ రేట్లకూ కోత



ఆర్‌బీఐ రెపో తగ్గింపు నేపథ్యంలో బ్యాంకులు రుణాలపై వసూలు చేసే వడ్డీ రేట్లతో పాటు డిపాజిట్లపై చెల్లించే వడ్డీ రేటునూ తగ్గిస్తున్నాయి. ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చేలా ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లను 0.10- 0.25 శాతం వరకు తగ్గిస్తున్నట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. అలాగే, 444 రోజుల కాలపరిమితితో కూడిన అమృత వృష్టి పథకం రేటును సైతం 7.05 శాతానికి తగ్గించింది. సీనియర్ సిటిజన్లకు (60-80 ఏళ్ల వారు) ఈ డిపాజిట్‌పై 7.55 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు (80 ఏళ్ల పైబడిన వారు) 7.65 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. కాగా, బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) తన 400 రోజుల స్పెషల్ టర్మ్ డిపాజిట్‌ను ఉపసంహరించుకుంది. ఈ డిపాజిట్‌పై బ్యాంక్ 7.30 శాతం వార్షిక వడ్డీ ఆఫర్ చేసింది.

### పొదుపు ఖాతాపై వడ్డీ 2.75 శాతానికి తగ్గింపు
**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్**

ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పొదుపు ఖాతాపై చెల్లించే వార్షిక వడ్డీ రేటును 0.25 శాతం తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. దాంతో బ్యాంక్ సేవింగ్ డిపాజిట్ రేటు 2.75 శాతానికి తగ్గింది. ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో సేవింగ్ ఖాతాపై ఆఫర్ చేస్తున్న అతి తక్కువ వడ్డీ రేటు ఇదే. రూ.50 లక్షలకు పైగా డిపాజిట్‌పై వడ్డీ రేటును సైతం 3.50 శాతం నుంచి 3.25 శాతానికి తగ్గించినట్లు, ఈ నెల 12 నుంచే కొత్త రేట్లు అమలులోకి వచ్చినట్లు బ్యాంక్ తెలిపింది.

# రూ.40,000 కోట్లకు నెలవారీ సిప్!

- వచ్చే 18-24 నెలల్లో చేరుకోవచ్చు..
- యూనియన్ ఏఎంసీ సీఈఓ మధు నాయర్ అంచనా



న్యూఢిల్లీ: వచ్చే 18-24 నెలల్లో దేశీయ మ్యూచువల్ ఫండ్ పథకాల్లోకి వచ్చే నెలవారీ క్రమానుగత పెట్టుబడులు (సిప్) రూ.40,000 కోట్ల స్థాయికి పెరగవచ్చని యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) సీఈఓ మధు నాయర్ అంచనా వేశారు. భారతీయ కుటుంబాల ఆదాయంతో పాటు క్రమశిక్షణతో కూడిన పెట్టుబడులపై అవగాహన కూడా పెరుగుతుండటం ఇందుకు దోహదపడనుందని ఆయన పేర్కొన్నారు. ఈ మార్చిలో ఫండ్ పథకాల్లోకి 'సిప్'లు రూ.25,925 కోట్లుగా నమోదయ్యాయి. అయితే, స్టాక్ మార్కెట్లో తీవ్ర ఒడుదుడుకుల కారణంగా గత నాలుగు నెలలుగా క్రమానుగత పెట్టుబడులు తగ్గుతూ వచ్చాయి. అయితే, ఇది తాత్కాలిక పరిణామమేనని.. సిప్‌లు మళ్లీ పుంజుకోనున్నాయని ఫండ్ మార్కెట్ వర్గాలు అంటున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో నెలవారీ సిప్ సగటు రూ.24,113 కోట్లకు పెరిగింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇది రూ.16,602 కోట్లుగా నమోదైంది.

# 'కొలువుల కోత' నిజం కాదు

### డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్



ముంబై: తమ కంపెనీలో ఉద్యోగుల తీసివేతలు జరగబోతున్నాయన్న వార్తలను ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ తోసిపుచ్చింది. ఈ వార్తల్లో ఏ మాత్రం నిజం లేదని కంపెనీ సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. వ్యయాల తగ్గింపులో భాగంగా ఉద్యోగుల జీతాల ఖర్చులు 25 శాతం తగ్గించుకునేందుకు కంపెనీ సిద్ధమైనట్టు అభిజ్ఞ వర్గాలను ఉటంకిస్తూ బిజినెస్ స్టాండర్డ్ పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఇందులో భాగంగా కొన్ని విభాగాల్లో వార్షిక జీతం రూ.కోటి మించిన 50-55 సంవత్సరాల మధ్య వయసు ఉన్న సీనియర్ ఉద్యోగులను రాజీనామా చేయమని కోరినట్టు పేర్కొంది. దీంతో డాక్టర్ రెడ్డీస్‌కు ఏటా రూ.1,200 కోట్ల నుంచి రూ.1,300 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని ఆ పత్రిక పేర్కొంది. అయితే ఈ వార్తలు పూర్తిగా అవాస్తవమని కంపెనీ స్పష్టం చేయడంతో ఈ పుకార్లకు తెరపడింది. కంపెనీ ఉద్యోగులూ ఊపిరి పీల్చుకున్నారు. గత ఏడాది మార్చి నాటికి ప్రపంచవ్యాప్తంగా కంపెనీలో 26,343 మంది పనిచేస్తుంటే, వారిలో 21,757 మంది పర్మినెంట్ ఉద్యోగులు. కాగా ఉద్యోగుల జీతభత్యాల కోసం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.5,030 కోట్లు ఖర్చు చేసింది.

# బిజినెస్

### రూ.11.30 లక్షల కోట్లు పోయే..

- ట్రంప్ సుంకాలు ప్రకటించినప్పటి నుంచి మదుపరులు కోల్పోయిన సంపద ఇది..

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై అదనపు సుంకాలు ప్రకటించిన నాటి నుంచి ఇప్పటి వరకు బీఎస్ఈ సెన్సెక్స్ 1,460.18 పాయింట్లు (1.90 శాతం) క్షీణించింది. ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.11.30 లక్షల కోట్లకు పైగా తరిగిపోయి ప్రస్తుతం రూ.401.67 లక్షల కోట్లకు పడిపోయింది. ఈ నెల 2న ట్రంప్ భారత్ సహా 60కి పైగా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై అదనపు సుంకాలు ప్రకటించారు. ఈ నెల 9 నుంచి అమలులోకి రావాల్సిన సుంకాలను మళ్లీ 90 రోజుల పాటు వాయిదా వేశారు. చైనాపైన మాత్రం సుంకాలను 145 శాతానికి పెంచి మరీ అమలు చేశారు. అందుకు ప్రతీకారంగా చైనా కూడా అమెరికాపై సుంకాలను 125 శాతానికి పెంచింది.

# 40 వేల టన్నుల రొయ్యల ఎగుమతులకు సన్నాహాలు



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలను 90 రోజుల పాటు వాయిదా వేసిన నేపథ్యంలో దేశానికి చెందిన సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులు 35 వేల నుంచి 40 వేల టన్నుల రొయ్యలను అమెరికాకు ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ట్రంప్ సుంకాల ప్రభావంతో కొద్ది కాలం క్రితం నిలిపివేసిన రొయ్యల ప్రాసెసింగ్‌ను తిరిగి ప్రారంభిస్తున్నట్లు సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారుల సంఘం సెక్రటరీ జనరల్ కేఎన్ రాఘవన్ తెలిపారు. ట్రంప్ తాజా నిర్ణయం ఫలితంగా గతంలో నిలిపివేసిన రెండు వేల కంటైనర్లను ఎగుమతి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం భారత రొయ్యలపై అమెరికా 17.7% సుంకాలు విధిస్తోంది. 5.7% కౌంటర్ వీలింగ్ సుంకం, 1.8% యాంటీ డంపింగ్ సుంకం కూడా అందులో భాగంగా ఉన్నాయి. భారత రొయ్యలకు అతి పెద్ద మార్కెట్ అయిన అమెరికా నుంచి ఆర్డర్లు ఏ మాత్రం తగ్గలేదని ఆ సంస్థ చెబుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ 270 కోట్ల డాలర్ల విలువ గల రొయ్యలను ఎగుమతి చేసింది.

# ఐటీ షేర్లకు దూరంగా ఉండటం బెటర్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. డొనాల్డ్ ట్రంప్ చైనా మినహా విగిలిన దేశాలపై సుంకాలను 90 రోజులకు వాయిదా వేయటంతో ఆర్థిక మాంద్య భయాలను పోగొట్టింది. అయితే చైనాపై సరఫరాలు ఆధారపడటం గమనించదగిన అంశం. ఈ వాణిజ్య యుద్ధంతో భారత్‌కు మేలు జరిగే అవకాశం ఉండటంతో కొన్ని రంగాల షేర్లలో మూమెంటమ్ పెరగొచ్చు. ట్రంప్ వ్యాఖ్యలు, జియో పొలిటికల్ సమీకరణాలను బట్టే మార్కెట్ గమనం ఉంటుంది. గతవారం కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ, పీఎస్ఇయూ, చమురు కంపెనీల షేర్లు పెరిగాయి. ఈ వారం ఐటీ షేర్లకు దూరంగా ఉండటం మంచిది.

### స్టాక్ రికమండేషన్స్

**పవర్‌గ్రిడ్:** కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరు ప్రస్తుతం మూమెంటమ్ అందుకుంది. కీలకమైన రూ.250 స్థాయిలో మద్దతు తీసుకుని టర్న్ అరౌండ్ అయ్యాయి. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.304 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.300 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.322/330 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.292 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**గుజరాత్ గ్యాస్ లిమిటెడ్:** గత ఏడాది ఆరంభం నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి బేస్ ఏర్పడుతోంది. రూ.380 స్థాయిలో స్థిరంగా కొనసాగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.428 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.410/420 శ్రేణిలో ప్రవేశించి రూ.490 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.400 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**పతంజలి ఫుడ్స్:** నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ బాగున్నాయి. కొన్ని నెలలుగా రూ.1,800 స్థాయిలో డార్వాస్ బాక్స్ ప్యాటర్న్‌లో చలిస్తోంది. గత శుక్రవారం రూ.1,886 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,850 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,150 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,810 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**లారస్ ల్యాబ్స్:** కొన్ని నెలలుగా ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుతం గరిష్ఠ స్థాయి వద్ద రేంజ్‌బౌండ్‌లో కదలాడుతోంది. షార్ట్‌టర్మ్ మూమెంటమ్ బాగుంది. సగటు వాల్యూమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.605 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.600 వద్ద పొజిషన్ తీసుకుని రూ.655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.585 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్:** కొన్ని నెలలుగా ఈ షేరు డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. వాల్యూమ్ తక్కువగా నమోదవుతుండటాన్ని బట్టి చూస్తే పతనం ఆగే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం రూ.542 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.530/540 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.610 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.520 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 125 | విజయవాడ | 130 |
| వరంగల్ | 125 | గుంటూరు | 127 |
| కరీంనగర్ | 125 | ఒంగోలు | 127 |
| మహబూబ్‌నగర్ | 125 | చిత్తూరు | 93 |
| కర్నూలు | 125 | నెల్లూరు | 98 |
| విశాఖపట్నం | 124 | అనంతపురం | 98 |
| గోదావరి | 130 | | |

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 400 | విజయవాడ | 420 |
| వరంగల్ | 402 | గోదావరి | 405 |
| చిత్తూరు | 460 | విశాఖపట్నం | 420 |
| | | డజను గుడ్లు రూ. 60 | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 95,510 ▼ | 87,550 ▼ | 1,09,900 ▼ |
| విజయవాడ | 97,000 ▼ | 91,000 ▼ | 98,000 ▼ |
| విశాఖపట్నం | 94,010 ▲ | 86,180 ▲ | 94,650 ▲ |
| రాజమండ్రి | 95,510 ▼ | 87,550 ▼ | 97,600 ▲ |
| ప్రొద్దుటూరు | 93,200 ▲ | 85,740 ▲ | 97,500 ▲ |
| ముంబై | 93,353 ▲ | 85,511 ▲ | 92,929 ▲ |



మంచిర్యాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న భట్టి

## అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

- విద్యార్థుల కోసం యంగ్ ఇండియా స్కూళ్లు
- 3.10 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ: భట్టి
- మంచిర్యాలలో రూ.565 కోట్ల పనులకు శంకుస్థాపన

మంచిర్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో రూ.565 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సోమవారం భట్టి ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉచిత విద్యను అందించేందుకు రూ.220 కోట్లతో నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభిస్తున్నామని తెలిపారు. గిరిజన కుటుంబాలు అటవీ భూములను సాగు చేసుకునేందుకు వీలుగా ఇందిరా గిరి జల వికాసం పేరుతో రూ.12,500 కోట్లతో పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గడచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని మరచిపోయిందని.. తాము కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే ఉద్దేశంతో రూ.లక్ష కోట్లతో వడ్డీ లేని రుణాలు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకంతో 43 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతోందని వెల్లడించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ.5,500 కోట్లను ఆర్టీసీకి చెల్లించామన్నారు. గృహజ్యోతి పథకం కింద 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని, అందు కోసం విద్యుత్ శాఖకు రూ.1,795 కోట్లను చెల్లించినట్లు తెలిపారు. నిరుద్యోగ యువత కోసం రూ.9వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టి సబ్సిడీ రుణాలు అందిస్తున్నామని తెలిపారు. జూన్ 2న యువ వికాసం పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇస్తామని వెల్లడించారు. ఒక్కో ఇల్లుకు రూ.5 లక్షల చొప్పున 4లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని అసెంబ్లీలో ప్రకటించడమే కాకుండా తీర్మానం కూడా చేశామన్నారు. దానిని దేశంలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాహుల్ గాంధీ నాయకత్వంలో ఢిల్లీలో ఆందోళనలు చేసినట్లు తెలిపారు.

## కనీస వేతనాల పెంపుపై గెజిట్ ప్రచురించండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- జీవోలు జారీచేసి అమలు చేయలేదేమని ప్రశ్న

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికుల కనీస వేతనాలు పెంచుతూ 2021లో ఇచ్చిన జీవోలను అధికారిక గెజిట్‌లో ప్రచురించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జీవోలు జారీ చేసి అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించింది. ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదో కారణాలు వివరించాలని సూచించింది. ప్రస్తుతం ఇచ్చిన ఉత్తర్వుల అమలుపై నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీచేసింది. కనీస వేతనాల చట్టం-1948 ప్రకారం కనీస వేతనాలను ప్రతి అయిదేళ్లకోసారి సమీక్షించి పెంచాల్సి ఉండగా ప్రభుత్వం 2012 నుంచి ఎటువంటి సవరణ చేయలేదని పేర్కొంటూ తెలంగాణ రీజినల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై గతంలో విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 2021లో అయిదు జీవోలు జారీచేసినందున వాటిని గెజిట్‌లో ప్రచురించాలని 2023 అక్టోబర్ 19న ఆదేశాలు జారీచేసింది. సెక్యూరిటీ సర్వీసెస్, భవనాలు- రోడ్డు నిర్మాణం, నిర్వహణ రంగం, క్రషింగ్ పరిశ్రమ, ప్రాజెక్టుల నిర్మాణం, ప్రైవేట్ మోటారు రవాణా రంగాలకు సంబంధించి 2021లో ఇచ్చిన అయిదు జీవో (నెంబర్ 21, 22, 23, 24, 25)లను గెజిట్‌లో ప్రచురించాలని తెలిపింది. ఆదేశాలు జారీచేసి దాదాపు 18 నెలలు గడుస్తున్నా ఇంకా గెజిట్‌లో ప్రచురించ లేదని, పెంచిన కనీస వేతనాలు అమలు చేయడం లేదని పేర్కొంటూ మళ్లీ కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలయింది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ ఎస్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదిస్తూ.. ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రభావం 47 లక్షల కుటుంబాలపై పడిందని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం ప్రభుత్వానికి ఆదేశాలు ఇస్తూ తదుపరి విచారణను జూన్ 10కి వాయిదా వేసింది.

## గ్రూప్-1 ఉద్యోగాల భర్తీలో పెద్ద కుంభకోణం

- రూ.కోట్లు చేతులు మారాయి: పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఉద్యోగాల భర్తీలో పెద్దకుంభకోణం దాగుందని, ఇందులో కోట్ల రూపాయలు చేతులు మారాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపించారు. తక్షణం గ్రూప్-1 పరీక్షలు రద్దుచేసి.. సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రిలిమ్స్‌లో ఒక హాల్‌టికెట్, మెయిన్స్‌లో మరో హాల్ టికెట్ ఇవ్వడంలోనే అక్రమం ఉందన్నారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష 21,093 మంది రాస్తే.. 21,103 మందికి ఫలితాలు ఇచ్చారని, పది మంది అదనంగా ఎక్కడి నుంచి వచ్చారని ఆయన ప్రశ్నించారు. 1,494 మంది మహిళలు రాసిన 18, 19 నంబర్ పరీక్షా కేంద్రాల్లో 74 మందికి ఉద్యోగాలు వచ్చాయని, ఆ రెండు కేంద్రాలు కోఠి మహిళా కళాశాలలో ఉన్నాయన్నారు. ఉర్దూమీడియంలో 9 మంది పరీక్ష రాస్తే ఏడుగురికి ఉద్యోగాలు వచ్చాయని, అదే తెలుగు మీడియంలో 7 వేల మంది పరీక్ష రాస్తే 70 మందికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని.. దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై కిషన్‌రెడ్డి, సంజయ్ ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు.

## పోలీసులపైనా ఫిర్యాదు చేయొచ్చు

- సామాన్యుడి కోసం పోలీస్ కంప్లైంట్ అథారిటీలు
- రాష్ట్ర అథారిటీ చైర్మన్‌గా జస్టిస్ శివ శంకర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడినా లేదా సామాన్యులను ఇబ్బంది పెట్టిన సందర్భాల్లో వారికి ఉచిత న్యాయ సాయం అందించేందుకు ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా పోలీస్ కంప్లైంట్ అథారిటీలను ఏర్పాటు చేసింది. పోలీసులు నిందితులను స్టేషన్‌కు తీసుకొచ్చి కొట్టినా, దాడి చేసినా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకున్నా, కస్టడీలో నిందితులు మృతిచెందినా బాధితుల పక్షాన ఎవరైనా ఫిర్యాదు చేస్తే, సుమోటోగా వాటిని స్వీకరించి బాధితులకు ఉచితంగా న్యాయం అందించేందుకు ఈ అథారిటీలు కృషి చేస్తాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర, జిల్లాలకు వేర్వేరుగా పోలీసు ఫిర్యాదు ప్రాధికార సంస్థలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు సోమవారం హోంశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా జీవోఆర్‌టీ నెం.315ను జారీ చేశారు. రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీలో చైర్మన్‌గా ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శివ శంకర్ రావు, సభ్యులుగా పి. ప్రమోద్ కుమార్ (విశ్రాంత ఐపీఎస్), వర్రే వెంకటేశ్వర్లు న్యాయవాది, (సమాచార కమిషన్ మాజీ సభ్యుడు), సభ్యకార్యదర్శిగా అదనపు డీజీపీ (శాంతి భద్రతలు) ఉంటారు. హైదరాబాద్ రీజియన్ జిల్లా పోలీస్ కంప్లైంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా విశ్రాంత జిల్లా జడ్జి కె.సుదర్శన్, సభ్యులుగా పి.రామ్మోహన్ (మాజీ జర్నలిస్ట్), రామనర్సింహారెడ్డి (విశ్రాంత ఏఎస్పీ), సభ్యకార్యదర్శిగా ఇన్‌స్పెక్టర్ జనరల్(మల్టీజోన్-2)ఉంటారు. వరంగల్ రీజియన్ జిల్లా పోలీస్‌కంప్లైంట్ అథారిటీ చైర్‌పర్సన్‌గా వై.అరవింద్ రెడ్డి (విశ్రాంత జిల్లా జడ్జి), సభ్యులుగా నారాయణ (విశ్రాంత ఐపీఎస్), సామల రాజేందర్, సభ్యకార్యదర్శిగా ఇన్‌స్పెక్టర్ జనరల్(మల్టీజోన్-1)ను ప్రభుత్వం నియమించింది.

# అమల్లోకి ఎస్సీ వర్గీకరణ

(మొదటిపేజీ తరువాయి)

ఇక నుంచి వర్గీకరణ ప్రకారం అమలుకానున్నాయి. సర్కారు ఇచ్చిన జీవోల్లో ఏం ఉందంటే..

**జీవో నంబరు 33:** శాసనసభ, మండలిలో ఆమోదం పొందిన ఎస్సీ వర్గీకరణ తీర్మానం ఏప్రిల్ 8న గవర్నర్ ఆమోదం పొందింది. ఆ విషయాన్ని తెలుపుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ చట్టం (15) 2025ను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూలో గెజిట్‌లో ప్రచురించినట్టు న్యాయశాఖ పేర్కొంది. జీవో నంబరు 9లో.. తెలంగాణ షెడ్యూల్డు కులాల(రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) చట్టం-2025' ఏప్రిల్ 14 నుంచి అమల్లోకి వస్తున్నట్టు పేర్కొంది.

**జీవో నంబరు 99:** 'తెలంగాణ షెడ్యూల్డు కులాల(రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) చట్టం-2025' మేరకు ఉద్యోగ నియామకాల్లో అనుసరించాల్సిన రోస్టర్ పాయింట్లను వర్గీకరించింది. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1996ను సవరించారు. వంద పోస్టులను భర్తీ చేయాలనుకున్నప్పుడు.. షెడ్యూల్డు కులాలన్నింటికీ కలిపి ఇదివరకు 15 రోస్టర్ పాయింట్లు అమలయ్యేవి. తాజాగా ఈ పాయింట్లను గ్రూపులవారీగా వర్గీకరించారు. గ్రూపు-1కు 7వ నెంబరు, గ్రూపు-2కు 2, 16, 27, 47, 52, 66, 72, 87, 97, గ్రూపు-3కి 22, 41, 62, 77, 91 రోస్టర్ పాయింట్లు అమలవుతాయని పేర్కొన్నారు.

**జీవో నంబరు 10:** రిజర్వేషన్‌లో ఒక గ్రూపు కోసం నోటిఫై చేసిన పోస్టులు, భర్తీకాని ఖాళీలను తదుపరి ప్రాధాన్య గ్రూపులోని అభ్యర్థులతో భర్తీ చేయాలని సూచించింది. దీని ప్రకారం.. గ్రూప్-1లో గుర్తించిన కులాల వారితో ఉద్యోగ ఖాళీలు భర్తీకాకపోతే.. వాటిని తదుపరి ప్రాధాన్య గ్రూప్-2లోని కులాల ద్వారా భర్తీ చేయాలని.. అలా కూడా భర్తీ కానివాటిని ఆ తరువాత ఉన్న గ్రూప్-3లోని కులాల వారి ద్వారా భర్తీ చేయాలని సూచించింది. ఒకవేళ ఈ మూడు గ్రూపుల్లో తగిన అభ్యర్థులు లేకపోతే భర్తీ చేయని ఖాళీలను (మహిళా అభ్యర్థులతో సహా) క్యారీ ఫార్వర్డ్ చేయాలని పేర్కొంది. అంతే తప్ప, ఇతర కులాల అభ్యర్థులతో భర్తీ చేయొద్దని స్పష్టతనిచ్చింది. ఇప్పటికే ప్రకటించిన ఉద్యోగ ప్రకటనలకు ఈ రిజర్వేషన్లు వర్తించవని పేర్కొంది. ఏప్రిల్ 14, 2025 నుంచి వచ్చే ఉద్యోగ ప్రకటనలకే ఇది వర్తించనున్నట్టు తెలిపింది. కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, కేంద్రం ఆధీనంలోని విద్యా సంస్థల్లో పోస్టులు, ప్రవేశాలకు వర్గీకరణ నిబంధనలు వర్తించవు. కాగా.. ఈ జీవోలో గ్రూపులవారీగా వర్తించే రోస్టర్ పాయింట్ల వివరాలను కూడా పేర్కొన్నారు.



ఎస్సీ వర్గీకరణ జీవో కాపీని సీఎం రేవంత్‌కు అందజేస్తున్న మంత్రులు ఉత్తమ్, దామోదర, పొన్నం, పొంగులేటి

- విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఉద్యోగ భర్తీల్లో గ్రూపులవారీగా కేటాయించిన రిజర్వేషన్ ప్రకారం నిబంధనలు వర్తిస్తాయి. గ్రూపు-1కు 1 శాతం, గ్రూపు-2కు 9శాతం, గ్రూపు-3కు 5శాతం చొప్పున రిజర్వేషన్లు అమలుకానున్నాయి.
- మహిళలకు ప్రస్తుతం అమల్లో ఉన్న 33.1/3 శాతం ప్రకారమే ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు అమలవుతాయి.

## ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ

- వర్గీకరణపై మాట్లాడిన పార్టీలన్నీ తీర్మానాలకే పరిమితం
- ఇకపై ఇచ్చే అన్నినోటిఫికేషన్లకు ఎస్సీ రిజర్వేషన్ల వర్తింపు
- మీడియాతో మంత్రులు ఉత్తమ్, దామోదర, పొన్నం

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు తర్వాత దేశంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సగర్వంగా ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణ జీవోను విడుదల చేసి, మొదటి ప్రతిని సీఎం రేవంత్‌కు అందజేసిన అనంతరం.. మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి సోమవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. వర్గీకరణపై గతంలో అసెంబ్లీలో అన్ని పార్టీల నేతలూ మాట్లాడేవారని.. కానీ, ఆ పార్టీలన్నీ ఈ అంశంపై శాసనసభలో తీర్మానానికి మాత్రమే పరిమితమయ్యాయని ఉత్తమ్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే ఎస్సీ వర్గీకరణకు ప్రయత్నాలు మొదలుపెట్టామని.. సుప్రీం తీర్పు రాగానే ఆ ప్రక్రియను వేగవంతం చేసి, మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసుకుని, వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ముందుకెళ్లామని చెప్పారు. రాజకీయాలకు చోటు లేకుండా న్యాయబద్ధంగా ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయడానికి వన్‌మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్ పనిచేసిందని ఆయన పేర్కొన్నారు. సోమవారం (ఏప్రిల్ 14) నుంచే.. ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలవుతుందని, అన్ని శాఖల్లోని ఖాళీల లెక్కలూ తీసి, త్వరలో ఎస్సీ వర్గీకరణ ప్రకారం వాటి భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తామని మంత్రి చెప్పారు. అయితే.. గత ఏడాది ఆగస్టు ఒకటో తేదీకి ముందు ఇచ్చిన నోటిఫికేషన్లకు ఈ రిజర్వేషన్లు వర్తించవని, సుప్రీం కోర్టు తీర్పుకు లోబడి రిజర్వేషన్లు వర్తిస్తాయని ఉత్తమ్ వివరించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సామాజిక స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణను ప్రకటించామని ఆయన పేర్కొన్నారు. ఇక.. దళితుల్లో సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలు ఉండకూడదని మంత్రి దామోదర రాజనర్సింహ అభిప్రాయపడ్డారు. ఆ ఉద్దేశ్యంతోనే మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన కేబినెట్ కమిటీ ఏర్పాటు చేసుకుని.. వేల సంఖ్యలో వచ్చిన విజ్ఞప్తులపై అధ్యయనం చేశామని ఆయన వెల్లడించారు. విద్య, ఉద్యోగాల్లో ఇకపై ఇచ్చే నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ అమలవుతుందని.. భారీ స్థాయిలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నామని ఆయన స్పష్టంచేశారు. ఎస్సీ వర్గీకరణ 20ఏళ్ల పోరాటమని గుర్తు చేశారు.

## 2-3 వారాల్లో వేల సంఖ్యలో ఉద్యోగాలకు నోటిఫికేషన్లు!

- వర్గీకరణ చట్టం మేరకే భర్తీ.. పరీక్షలకు సిద్ధం కండి: దామోదర

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): "రాబోయే రెండు, మూడు వారాల్లో వేల సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు వస్తాయి. వర్గీకరణ చట్టం ప్రకారమే ఉద్యోగాల భర్తీ జరుగుతుంది. మీ పిల్లలను ఉద్యోగాల పరీక్షలకు సిద్ధం చేయండి. వారికి అవసరమైన గైడెన్స్, కోచింగ్ ఇప్పించేందుకు సహకారం అందించే బాధ్యత నాది. వారు ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందాలి" అని రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ.. తనను కలిసిన మాదిగ, మాదిగ ఉపకులాల సంఘ నేతలతో అన్నారు. దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఆకాంక్ష సంపూర్ణంగా నెరవేరిన సందర్భంగా వారంతా మంత్రిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ దార్శనికత, చిత్తశుద్ధి, అందరి సమిష్టి కృషితోనే వర్గీకరణ కల నెరవేరిందని ఈ సందర్భంగా దామోదర వ్యాఖ్యానించారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ మొదటి నుంచి మద్దతు ఇచ్చిందని.. 2005లోనే వైఎస్ఆర్ ప్రభుత్వం అసెంబ్లీలో వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేస్తే, దాని ఆధారంగా నాటి యూపీఏ ప్రభుత్వం జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్‌ను నియమించిందని ఆయన గుర్తుచేశారు. 2023లో అధికారంలోకి వచ్చిన వెంటనే సుప్రీంకోర్టులో వర్గీకరణకు అనుకూలంగా వాదించేందుకు సీనియర్ న్యాయవాదిని సీఎం నియమించారని.. మేధావులు, నాయకులను పలుమార్లు ఢిల్లీకి తీసుకెళ్లి, అవసరమైన సూచనలు చేస్తూ వచ్చారని పేర్కొన్నారు. నిరుడు ఆగస్టు ఒకటిన కోర్టు తీర్పు వచ్చిన అరగంటలోనే అసెంబ్లీలో వర్గీకరణకు అనుకూలంగా సీఎంతో ప్రకటన చేయించుకున్నామని.. తర్వాత 8నెలల్లో వర్గీకరణ పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇన్నాళ్లుగా చేసిన పోరాట ఫలితాలను పొందే సమయం వచ్చిందన్నారు.

## నాపై జరిగిన మర్డర్ ప్లాన్‌ను సినిమాలో చూస్తారు...

- జగ్గారెడ్డి- ఏ వార్ ఆఫ్ లవ్‌లో నా ప్రేమ కథ ఉండదు.. కానీ ప్రేమికులకు అండగా ఉంటా
- కథను ప్రిపేర్ చేయడంలో మా డైరెక్టర్ బిజీ
- పోలీసుల ఒత్తిళ్లు, నిర్బంధాలను ఎదుర్కొని జీవితంలో నేను ఎదిగిన తీరు.. ఓ కలెక్టర్‌ను ట్రాన్స్ఫర్ చేసేదాకా పోరాడిన ఘటనలు సినిమాలో ఉంటాయి
- మూడు పాత్రల్లో మరొక యాక్టర్ .. తర్వాత నేను ఎంటర్ అవుతా
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 14 ఆంధ్రజ్యోతి: ఓ రాజకీయ పార్టీ నాయకుడు తనను చంపడానికి మర్డర్ ప్లాన్ చేస్తే... ఆ మర్డర్ ప్లాన్‌ను తాను వ్యూహాత్మకంగా ఎదుర్కొన్న తీరు... తనపై పోలీసుల ఒత్తిళ్లు, నిర్బంధాలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించి తాను ఎదిగిన తీరు... ఎలాంటి పొలిటికల్ బ్యాగ్రౌండ్, ధన బలం లేకున్నా అంతకు మించిన జన బలం, కార్యకర్తల బలగంతో తన నిజ జీవితం ఎలా ముందుకెళ్లిందనే సన్నివేశాలను జగ్గారెడ్డి- ఏ వార్ ఆఫ్ లవ్ సినిమాలో చూడబోతున్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. జగ్గారెడ్డి- ఏ వార్ ఆఫ్ లవ్ సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికరమైన విషయాల గురించి ఆయన విలేకరులతో చిట్‌చాట్‌గా చర్చించారు. సినిమా కథను ప్రిపేర్ చేయడంపైనే డైరెక్టర్ రామానుజం నిమగ్నమయ్యారని చెప్పారు. ఈ సినిమాలో తన ప్రేమ కథ ఉండదని, కానీ ప్రేమికులకు అండగా ఉంటానని తెలిపారు. సంగారెడ్డిలో స్టూడెంట్ లీడర్‌గా, మున్సిపల్ కౌన్సిలర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా తన నిజజీవితంలోని కీలక ఘట్టాలను ఈ సినిమాలో చూడబోతున్నారని జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. ఓ పోలీసు అధికారిని ఎదిరించడం, ఓ కలెక్టర్‌ను ట్రాన్స్ఫర్ చేసే దాకా పోరాటం చేసిన సన్నివేశాలు ఈ సినిమాలో వీక్షిస్తారని వివరించారు. తనకు సంబంధించిన మూడు పాత్రల్లో మరొక యాక్టర్ నటిస్తాడని.. తర్వాత తాను ఎంటర్ అవుతానని చెప్పారు. తన నిజ జీవితంలో జరిగిన సంఘటనలతోనే సినిమా ఆద్యంతం రక్తి కట్టించేలా డైరెక్టర్ రామానుజం స్క్రిప్ట్ రెడీ చేస్తున్నారని జగ్గారెడ్డి వెల్లడించారు.



## వక్ఫ్ సవరణ చట్టాన్ని అంగీకరించం

- తెలంగాణ సర్కారు కీలక నిర్ణయం
- ముస్లిం నేతలతో సీఎం రేవంత్ చర్చ
- 17న ప్రకటించనున్న టీపీసీసీ అధ్యక్షుడు

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా ముస్లింల తీవ్ర ఆందోళనలకు కారణమవుతున్న వక్ఫ్ సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో ఆదివారం ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన నిరసన ప్రదర్శనలో వేలాదిమంది ముస్లింలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొని మద్దతు తెలిపారు. సోమవారం జిల్లాల్లోనూ నిరసన ప్రదర్శనలు జరిగాయి. మహబూబ్‌నగర్‌లో జరిగిన ప్రదర్శనలో వేలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఎంఐఎం ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో నిరసనలు పెరుగుతుండటంతో ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కాంగ్రెస్‌లోని కీలక ముస్లిం నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా వక్ఫ్ సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయకూడదని నిర్ణయించారు. ఈ విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ ఈ నెల 17న గాంధీ భవన్ లోమీడియా సమావేశం నిర్వహించి ప్రకటించనున్నారు.

## రాజీవ్ యువ వికాసానికి 15.56లక్షల దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు వెల్లువల వచ్చాయి. మార్చి 17 నుంచి మొదలైన ఈ దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారంతో ముగిసింది. చివరి రోజు అర్ధరాత్రి 12 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించారు. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు అధికారుల లెక్కల ప్రకారం 15.56 లక్షల మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. రాత్రి10 గంటల వరకు 15.95 లక్షల దరఖాస్తులు వచ్చాయి. సోమవారం ఒక్క రోజే దాదాపు 2 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం అర్ధరాత్రికి ఈ సంఖ్య 16.50 లక్షలు దాటిపోతుందని అంచనా. ఈ నెల 20వ తేదీ నుంచి మే 20 వరకు మండల స్థాయిలో నెల రోజుల పాటు దరఖాస్తులను పరిశీలన చేస్తారు.

## వక్ఫ్ సవరణను ఉపసంహరించుకోవాలి

- అది రాజ్యాంగ విరుద్ధం.. వివక్షాపూరితం
- టీజీఎంఆర్ఈఐఎస్ ఉప చైర్మన్ ఫహీం ఖురేషి



హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం.. వివక్షాపూరితమని మైనారిటీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీజీఎంఆర్ఈఐఎస్) ఉప చైర్మన్ ఫహీం ఖురేషీ తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీం అన్నారు. ఈ చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్‌కు నామినేట్ చేసే ముగ్గురు ఎంపీలు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల్లో ముస్లిమేతరులను నియమించుకోవచ్చన్న నిబంధన.. బీజేపీ ప్రభుత్వ ఉద్దేశాన్ని తెలియజేస్తుందన్నారు. ఇది మతపరమైన అంశాల్లో జోక్యంగా ముస్లిం సమాజం భావిస్తోందని తెలిపారు. ఈ మేరకు ఫహీం ఖురేషీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముస్లింల సంక్షేమం, మతపరమైన వ్యవహారాలు, విద్య, సాంస్కృతిక అంశాలు, దాతృత్వ, వైద్య సేవలు తదితరాల కోసం పూర్వీకులు తమ భూములను వక్ఫ్‌కు దానంగా ఇచ్చారని వివరించారు. వక్ఫ్ పేరుతో నోటిమాటగా దానం ఇచ్చిన భూములను కూడా నిరూపించుకోవాల్సిన పరిస్థితిని కొత్త చట్టం కలిగి ఉండటం విచారకరమన్నారు. వక్ఫ్‌కు దానం ఇవ్వాలనుకుంటున్న వ్యక్తి తప్పనిసరిగా ఐదేళ్ల పాటు ముస్లింగా ఉండాలన్న నిబంధన.. లౌకిక భారత దేశంలో విచిత్రంగా ఉందన్నారు. సదుద్దేశంతో ఇచ్చే దానానికి కూడా మతాన్ని ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. దీనిపై రాష్ట్ర కాంగ్రెస్ ఇప్పటికే పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించిందని, ఈ సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయవద్దని సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కోరామని తెలిపారు. నిజంగా ముస్లింల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే.. కేంద్ర మంత్రివర్గంలోగానీ, బీజేపీ తరఫున లోక్‌సభ ఎంపీల్లో గానీ ఒక్క ముస్లిమైనా ఎందుకు లేరని ఖురేషీ ప్రశ్నించారు.

### మతపరంగా లబ్ధి పొందేందుకే

కేవలం మతం ఆధారంగా ప్రజలను విభజించి ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఏ.ఫహీం విమర్శించారు. మత రాజకీయాలు చేయడమే బీజేపీ పని అని అన్నారు. దశాబ్దాల నుంచి ఉన్న చట్టాలను, దూరదృష్టితో పాలకులు తీసుకొచ్చిన చట్టాలను ఇష్టానుసారంగా మార్చేయడం గర్హనీయమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

- ఎం.ఏ.ఫహీం, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్

## కట్టుడు... కూలుడేనా?

- సీతారామలోని సూపర్ పాసేజ్ పిల్లర్ కూలడంపై సీఎం రేవంత్ ఆగ్రహం

హైదరాబాద్, అశ్వారావుపేట/ములకలపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టులో భాగమైన సూపర్ పాసేజ్ కాలువ పిల్లర్ కూలిపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'కట్టుడు.. కూలుడేనా!? ఇదేం పద్ధతి!? నిర్మాణంలో నాణ్యత పాటించరా?" అంటూ నీటిపారుదల శాఖ అధికారులపై రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగా ములకలపల్లి -పూసుగూడెం వద్ద మూడో పంప్‌హౌస్ నిర్మించారు. ఇక్కడ నీటిని ఎత్తిపోసి వైరా కాలువకు తరలిస్తారు. రెండున్నరేళ్ల కింద కాలువ నిర్మాణం పూర్తయింది. అయితే, కాలువపై నుంచి వరద నీటిని తరలించడానికి వీలుగా పూసుగూడెం వద్ద సూపర్ పాసేజ్ నిర్మించారు. దీనికున్న నాలుగు పిల్లర్లలో ఒకటి నాలుగు నెలల కిందట కుంగింది. నెల రోజుల కిందట ప్రాజెక్టు ట్రయల్ రన్‌లో భాగంగా నీటిని విడుదల చేయగా.. 15 రోజుల కిందట పిల్లర్ కూలిపోయింది. అధికారులు దీనిపై మౌనం వహించారు. ఇప్పటివరకూ ఉన్నతాధికారులకు నివేదిక కూడా ఇవ్వలేదు. సోమవారం కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఈ అంశాన్ని లేవనెత్తారు. అధికారుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకుండానే నిర్మాణాలు ఏ విధంగా కూలుతున్నాయని నిలదీశారు. కూలుడు, కట్టుడు.. ఇంకెన్నాళ్లని మండిపడ్డారు. అయితే తనకు రెండు రోజుల కిందటే సమాచారం వచ్చిందని, ప్రమాదానికి కారణాలపై నివేదిక రావాల్సి ఉందని ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ వివరించారు. సీతారామ డిజైన్లపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీముఖర్జీ అభ్యంతరాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో.. తాజాగా పిల్లర్ కూలడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### సీతారామ పనుల్లో డొల్లతనం

2019లోనే ఈ సూపర్ పాసేజ్ నిర్మించారు. ఆ సమయంలో నేల పటిష్ఠతను పరిశీలించకపోవడం, నాణ్యతాలోపంతోనే పిల్లర్ కూలిపోయిందని తెలుస్తోంది. పిల్లర్ కూలిన విషయం తెలిసిన 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టగా ఈ అంశాలు వెలుగుచూశాయి. ఈ పిల్లర్ చుట్టూ మట్టి కోతకు గురైంది. దీంతో పునాది నుంచి కూలిపోయింది. ట్రయల్ రన్‌లోనే ఇలా జరిగితే ప్రాజెక్టు పూర్తయిన తర్వాత నిత్యం నీళ్లు ప్రవహిస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాదు ఈ పిల్లర్ కూలిపోవడానికి కారణమేమిటో తేలకుండానే.. తిరిగి కొత్త పిల్లర్‌ను నిర్మించేందుకు నిర్మాణ సంస్థ హడావుడిగా పనులు చేపడుతుండటం గమనార్హం. ఉన్నతాధికారులకు విషయం తెలియకుండా కప్పిపుచ్చే ప్రయత్నాలు జరిగినట్టు స్పష్టమవుతోంది. "సూపర్ పాసేజ్ కెనాల్ నిర్మాణం 2019లో జరిగింది. గత నెల ట్రయల్‌రన్‌లో గోదావరి జలాలను వదిలినప్పుడే ఈ ప్రదేశంలో 15 మీటర్ల మేర నేల కోతకు గురవడంతో పిల్లర్ కూలింది. మిగతా పిల్లర్లు బాగానే ఉన్నాయి. సూపర్ పాసేజ్‌కు ప్రమాదమేమీ లేదు. పిల్లర్ తిరిగి నిర్మించేందుకు నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది" అని సీతారామ ప్రాజెక్టు ఈఈ అర్జున్ తెలిపారు.






భూ భారతి లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి, పొంగులేటి తదితరులు, సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

# భూ భారతి.. రైతుల చుట్టం

(మొదటిపేజీ తరువాయి)

సమస్య పరిష్కారం కాకపోవడంతో తాళిబొట్టును కార్యాలయానికి వేలాడదీసి.. సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసే దాకా వెళ్లింది. కానీ, భూ వివాదాలకు రెవెన్యూ సిబ్బంది మూలమంటూ వారిని దోషులుగా, దొంగలుగా చిత్రీకరించి.. ఆ భూముల చట్టాలను కొద్దిమందికి చుట్టాలుగా మార్చి.. వేలాది ఎకరాలు కొల్లగొట్టారు" అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని, చెప్పినట్లే.. ప్రజల అభిప్రాయాలను సేకరించి.. రైతు సమస్యల శాశ్వత పరిష్కారానికి సరళంగా భూ భారతి చట్టం తీసుకొచ్చామని చెప్పారు.

### మిమ్మల్ని సంపూర్ణంగా విశ్వసిస్తున్నా

తమ ప్రభుత్వం రెవెన్యూ సిబ్బందిని సంపూర్ణంగా విశ్వసిస్తుందని, వారిని దొంగలు, దోపిడిదారులు, అవినీతిపరులుగా చిత్రీకరించబోదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. వ్యక్తులు తప్పు చేస్తే కఠినంగా ఉంటామని, అంతే తప్ప వ్యవస్థను దోషిగా నిలబెట్టడాన్ని వ్యతిరేకిస్తామని అన్నారు. ఇంత గొప్ప లక్ష్యాన్ని ప్రజలకు చేరవేసే ప్రతినిధులు రెవెన్యూ సిబ్బందేనని, భూ భారతిని అమలు చేసేది వారేనని, ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే వారి ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. గ్రామాలకు వెళ్లి.. ప్రతిష్ఠకు ఎక్కడ భంగం కలిగిందో.. అక్కడే ప్రక్షాళన చేసి, తప్పులను కడిగేయాలని పిలుపునిచ్చారు. ప్రజా దర్బార్లు నిర్వహించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సిబ్బంది ఏ గ్రామానికి వెళ్లినా రైతులు భోజనం పెట్టి, గౌరవం ఇచ్చే విధంగా భూముల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

### ప్రతి కమతానికి భూధార్

మనుషులకు ఆధార్ ఉన్నట్లే.. భూమికి భూధార్ తీసుకొస్తామని సీఎం రేవంత్ చెప్పారు. ప్రతి కమతానికి భూధార్ నంబర్ ఇస్తామని, భూమి సరిహద్దులను పక్కాగా కొలిచి కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. రాబోయే రోజుల్లో కొలతలు వేసి.. హద్దులు నిర్ణయించి.. భవిష్యత్తులో ఏ సమస్యలు రాకుండా చట్టాలను బలోపేతం చేద్దామన్నారు.

### హక్కు కల్పించేందుకే భూ భారతి: భట్టి

భూమిపై హక్కులు కోల్పోయిన రైతులకు తిరిగి హక్కు కల్పించే ఉద్దేశంతో భూ భారతి చట్టం తీసుకొచ్చామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సరళంగా.. సామాన్యులకు అర్థమయ్యేలా.. ఎటువంటి మతలబులూ లేకుండా తీసుకొచ్చిన అద్భుత చట్టమిదని చెప్పారు. "భూమితో పెనవేసుకున్న రైతుల జీవితాల్లో అల్లకల్లోలం సృష్టిస్తూ ధరణి చట్టం తెచ్చారు. పదేళ్లపాటు అసెంబ్లీలో చర్చకు వచ్చిన ప్రతి సందర్భంలో ధరణి శాపంగా మారిందని, రైతుల హక్కులను కొద్దిమంది పెత్తందారుల కాళ్ల దగ్గర పెడుతున్నారని చెబితే ఆనాటి పాలకులు పట్టించుకోలేదు. 24 లక్షల ఎకరాలపై హక్కులను కాలరాశారు. ఇందిరమ్మ రాజ్యం రాగానే ధరణిని బంగాళా ఖాతంలో వేస్తామని చెప్పాం.. చెప్పినట్లే చేశాం" అని తెలిపారు.

### ధరణిని రహస్యంగా చేశారు: పొంగులేటి

"కొత్త రాష్ట్రంలో కొత్త చట్టాలు చేయడం సాధారణం. కానీ, చట్టం చేస్తే అది ప్రజలకు చుట్టంలాగానో.. ఉపయోగకరంగానో ఉండాలి. కానీ, గత పాలకులు వారి స్వార్థం కోసం.. నాలుగు గోడల మధ్య నలుగురు వ్యక్తులు కూర్చుని చట్టం చేశారు. రూల్స్ లేవు. దొరగారికి ఏ ఆలోచన వస్తే.. అదే నిబంధన. వాళ్లు చెప్పినట్లు చేయలేదనే వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేశారు. ధరణి చట్టంతో ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. ఆస్తులు కాపాడుకోలేక.. రికార్డులో పేరు లేదని ప్రజలు పడిన ఆవేదన అంతా కాదు. భూ ఆసాములకు కంటి మీద లేకుండా చేశారు" అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా చేసిన ధరణి చట్టాన్ని ఇచ్చిన మాట ప్రకారం బంగాళా ఖాతంలో వేశామని, ప్రజలకు ఉపయోగకరమైన భూ భారతి చట్టాన్ని తెచ్చామని ప్రకటించారు. 18 రాష్ట్రాలకు ఉద్యోగులను పంపి.. ఉత్తమ చట్టాల్లోని అంశాలను సేకరించి ప్రజలు కోరుకున్నట్లు చట్టాన్ని తయారు చేశామన్నారు. ప్రజా పాలనలో అధికారులు గ్రామాలకు వచ్చి దరఖాస్తులు తీసుకుంటారని, ప్రతి గ్రామంలో ఎమ్మార్వో రోజంతా ఉంటారని చెప్పారు. జూన్ ఒకటో తేదీలోపు ప్రయోగాత్మకంగా అమలు చేసే గ్రామాల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. "చాలామంది సీఎంలు ఉంటారు. మంత్రులుంటారు. కానీ, సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్‌లో మంత్రిగా.. ఈ చట్టం చేసే అవకాశం కలిగినందుకు నా జన్మ ధన్యమైంది" అంటూ హర్షం వ్యక్తం చేశారు.

### తొలుత 4 మండలాల్లోనే..

భూ భారతి పోర్టల్‌ను తొలుత నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం, కామారెడ్డి జిల్లా లింగంపేట, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, నారాయణపేట జిల్లా మద్దూరు మండలాల్లో ఈ వెబ్‌సైట్ పైలట్ ప్రాజెక్టుగా అమలు కానుంది. జూన్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ పోర్టల్ సేవలను విస్తరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

### సన్నబియ్యం లబ్ధిదారులే మా ప్రభుత్వ బ్రాండ్ అంబాసిడర్లు

సన్నబియ్యం లబ్ధిదారులే తమ ప్రభుత్వ బ్రాండ్ అంబాసిడర్లని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లాలోని అక్బర్‌పేట గ్రామానికి చెందిన కూతురి లక్ష్మి కుటుంబానికి 24 కిలోల సన్నబియ్యం రేషన్ వచ్చింది. ఆ బియ్యాన్ని ఆమె అన్నం వండి గ్రామంలో సహపంక్తి భోజనం పెట్టింది. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. కూతురి లక్ష్మికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ పథకం పేదల జీవితాల్లో ఎంతటి ఆనందం నింపిందో చెప్పే ప్రయత్నాన్ని లక్ష్మి చేసిందని అన్నారు.

# ముంగిట్లో పరిష్కారం

## అక్రమంగా పట్టా అయిన ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, భూదాన్ భూములకు మోక్షం

» హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూమి హక్కుల కష్టాలను తీర్చేలా.. ధరణి స్థానంలో కొత్త భూహక్కుల రికార్డును రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. హక్కుల రికార్డులో తప్పుల సవరణలతోపాటు అక్రమంగా పట్టాలు అయిన ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములకు కొత్త చట్టం మోక్షం కల్పించనుంది. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ఇంటి స్థలాలకు, వ్యవసాయేతర భూములకు ప్రత్యేక హక్కుల రికార్డు అందుబాటులోకి రానున్నాయి. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడంతోపాటు భూసమస్యల పరిష్కారానికి రెండంచెల అప్పీల్ వ్యవస్థను తీసుకురానున్నారు. ఈ మేరకు భూభారతి-2025 చట్టం నిబంధనలపై రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ సోమవారం ఉత్తర్వులు (జీవో నంబరు 39) ఇచ్చారు. సోమవారం నుంచే ఇవి అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

### రికార్డుల్లో తప్పుల సవరణ ఇలా..

భూరికార్డుల్లో తమ వివరాలు తప్పుగా నమోదైనవారు, భూమి వివరాలు నమోదుకానివారు భూభారతి పోర్టల్‌లో దరఖాస్తు చేసి, సవరించుకోవచ్చు. చట్టం అమల్లోకి వచ్చిననాటి నుంచి ఏడాదిలోపు దరఖాస్తు చేయాలి. దరఖాస్తుదారు ప్రమాణ పత్రంతోపాటు పాస్ పుస్తకం, టైటిల్ డీడ్, పహాణీ, ఇతర ఆధారాలను చూపాలి. అధికారులు సదరు భూమితో సంబంధం ఉన్నవారందరికీ నోటీసులు ఇస్తారు. ఎవరైనా వారంలో అభ్యంతరాలు రాతపూర్వకంగా అందించాలి. లేదంటే కేసు మెరిట్ ఆధారంగా నిర్ణయం తీసుకుంటారు. అభ్యంతరాలు వస్తే ఏడు రోజుల తరువాత విచారణ చేపట్టి 60 రోజుల్లో పరిష్కరిస్తారు. అధికారులు ఇచ్చిన ఉత్తర్వుల మీద తహసీల్దార్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. అక్కడా న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, ఆపై కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. వారు 30 రోజుల వ్యవధిలో సమాధానం ఇవ్వాలి.

### హక్కుల నమోదు.. నిర్వహణ

హక్కుల నమోదు అధికారి ప్రతి గ్రామంలోని అన్ని భూముల వివరాలతో హక్కుల రికార్డు తయారు చేసి, భూభారతి పోర్టల్‌లో అందుబాటులో ఉంచాలి. ఆబాది, వ్యవసాయేతర భూముల కోసం ప్రత్యేక రిజిస్టర్‌ను గ్రామాల వారీగా తయారు చేసి భూభారతి పోర్టల్‌లో ఇచ్చిన ఫారంలో నమోదు చేయాలి. ఈ భూములపై సర్వే నిర్వహించి మ్యాప్ తయారు చేయాలి. ఇక వివాదాలు లేకుండా, ఆ భూమిపై పూర్తి హక్కులున్న వారికి తహసీల్దార్ తాత్కాలిక భూధార్ కార్డు జారీ చేస్తారు. తర్వాత సర్వే, మ్యాపింగ్ ప్రక్రియలు పూర్తి చేసి శాశ్వత భూధార్ కార్డు ఇస్తారు. ఇక హక్కుల వివరాలు అన్నీ సక్రమంగా ఉంటే.. దరఖాస్తు చేసుకున్నవారికి పాస్ పుస్తకం, టైటిల్ డీడ్ జారీ చేస్తారు.

### భూమి అమ్మకం.. గిఫ్ట్, లీజ్ నిబంధనలు..

భూముల క్రయవిక్రయదారులు భూ భారతి పోర్టల్‌లో స్లాట్‌బుక్ చేసి.. వివరాలను నమోదు చేయాలి. స్లాట్ ఉన్న రోజున గిఫ్ట్‌డీడ్, సేల్ డీడ్, పాస్‌పుస్తకం, టైటిల్ డీడ్, సీసీఎల్ఏ ఇచ్చిన తేదీ నుంచి సర్వే మ్యాప్ తదితర అవసరమైన పత్రాలు అందజేయాలి. రిజిస్ట్రార్ అవన్నీ పరిశీలించి.. హక్కుల రికార్డులోని వివరాలతో సరిపోల్చుతారు. అన్నీ సక్రమంగా ఉంటే వెంటనే రిజిస్ట్రేషన్ అయిపోతుంది. తహసీల్దార్ రికార్డులో కొనుగోలుదారు పేరు చేర్చుతారు. కొత్త పాస్ పుస్తకం ఇస్తారు.

### విల్లు, వారసత్వం, మ్యుటేషన్లు

ఈ ప్రక్రియల కోసం తొలుత పోర్టల్‌లో దరఖాస్తు చేయాలి. వారసత్వ హక్కుల ఆధారంగా మ్యుటేషన్ కోసం అందరు వారసులు ప్రమాణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. తహసీల్దార్ నోటీసు జారీ చేసి.. దరఖాస్తుదారు, ఇతర హక్కుదారులకు సమాచారం ఇస్తారు. నోటీసును గ్రామ పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయం, ఇతర ప్రముఖ ప్రదేశాల్లో అంటిస్తారు. తర్వాత రికార్డులను పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయి పరిశీలన చేసి, అభ్యంతరాలను పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తారు. తహసీల్దార్ 30 రోజుల్లో ఉత్తర్వులు ఇవ్వాలి. లేకపోతే దరఖాస్తుకు ఆమోదం లభించినట్లుగా పరిగణిస్తారు.

### భూభారతి నిర్వహణ ఎవరికి?

భూభారతి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను ఎన్ఐసీ నుంచి మరో ఏజెన్సీకి అప్పగించే విషయంపై చర్చ జరుగుతోంది. ఎన్ఐసీ వద్ద ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునే వనరులు లేకపోవడంతో.. ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చిందనే చర్చ రెవెన్యూ వర్గాల్లో జరుగుతోంది. దీనిపై ఇప్పటికే రెండు సంస్థలతో సంప్రదింపులు జరిపారని, వాటిలో ఒకదాన్ని ఎంపిక చేస్తారని ప్రచారం జరుగుతోంది.

### సవరణల అధికారం వీరికే..

కొత్త చట్టం ప్రకారం తప్పుల సవరణను ఎవరెవరు చేయాలనే దానిపై నిబంధనల్లో స్పష్టత ఇచ్చారు.

- మిస్సయిన సర్వే నంబర్ల నమోదు, భూవిస్తీర్ణంలో హెచ్చుతగ్గుల సవరణ కోసం సదరు భూముల మార్కెట్ విలువ రూ.5లక్షలలోపు ఉంటే ఆర్డీవో స్థాయి అధికారి, ఆపై ఉంటే కలెక్టర్ సవరణ చేయాలి.
- డిజిటల్ సైన్ మిస్సింగ్‌ను ఆర్డీవో స్థాయి అధికారి సవరించవచ్చు.
- ఆస్తి ఏ తరహాదో నిర్ణయించే అధికారం, సవరించే అధికారం, పట్టాలో ఖాతా నంబర్ సవరించే అధికారం కలెక్టర్‌కు మాత్రమే అప్పగించారు.
- పేరులో తప్పులు వస్తే సవరించేందుకు.. పట్టా భూమి అయితే ఆర్డీవో, అసైన్డ్ భూమి అయితే కలెక్టర్‌కు అధికారం ఉంటుంది.
- నిషేధిత జాబితాలో ఉండే భూముల విషయంలో కలెక్టర్‌కే అధికారం కల్పించారు.
- నాలా నుంచి వ్యవసాయ భూమిగా సవరణ చేసేందుకు.. చదరపు గజాల్లో విక్రయించే పార్ట్ ల్యాండ్స్ విషయంలో అధికారాలను ఆర్డీవోకు కల్పించారు.

### ఏ సేవకు ఎంత ఫీజు?

● మ్యుటేషన్ లేదా వారసత్వ నమోదు సేవలకు ఎకరానికి రూ.2,500, లేదా గుంటకు రూ.62.50 ● పట్టాదారు పాస్ పుస్తకానికి రూ.300 ● హక్కుల నమోదు సవరణ, అప్పీళ్ల కోసం రూ.1,000 ● హక్కుల రికార్డు నకలు కోసం రూ.10 ● స్లాట్ రీషెడ్యూల్ మొదటిసారి ఉచితం, రెండోసారి రూ.500, మూడోసారి, ఆపైన రూ.1,000 కట్టాలి.

### భూభారతిలో కీలక అంశాలు ఇవే..

● హక్కుల రికార్డులో తప్పుల సవరణకు అవకాశం ● రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు ముందే భూముల సర్వే, మ్యాప్‌ల తయారీ ● వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసి రికార్డుల్లో నమోదు ● పాస్ పుస్తకాల్లో భూమి పటం.. భూధార్ కార్డుల జారీ ● భూసమస్యల పరిష్కారానికి రెండంచెల వ్యవస్థ ● ఇంటి స్థలాలకు, ఆబాదీ, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు ● మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారం..

# రైతులకు అర్థమయ్యేలా చెప్పండి

## సందేహాలకు పరిష్కారాలూ చూపండి.. అప్పీల్ వ్యవస్థపై అవగాహన కల్పించండి

» భూ భారతిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లండి

» కలెక్టర్లకు సీఎం రేవంత్ దిశా నిర్దేశం



హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ఎంతో అధ్యయనంతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చాం. దీనిని సమర్థంగా క్షేత్రస్థాయికి తీసుకెళ్లండి. ప్రతి మండలంలో సదస్సు నిర్వహించండి. ప్రతి కలెక్టర్ మండల స్థాయి సదస్సులకు హాజరు కావాలి. అక్కడ రైతులు, ప్రజలు లేవనెత్తే సందేహాలకు వారికి అర్థమయ్యే భాషలోనే జవాబు ఇవ్వండి. వాటికి పరిష్కారాలూ చూపండి" అని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి నిర్దేశించారు. హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీలో సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, వేసవి తాగునీటి ప్రణాళికపై ఆయన దిశానిర్దేశం చేశారు. భూ భారతి, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, వీటిని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడంలో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు. "భూ భారతి చట్టంపై అవగాహన పెంచుకోండి. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేయండి. రైతులు ఏ ప్రశ్న అడిగినా సమాధానం చెప్పేలా పట్టు సాధించండి. అప్పుడే వారిలో ఆందోళన తగ్గుతుంది. రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోకుండా రైతులను గతంలో న్యాయస్థానాలకు పంపారు. భూ భారతి చట్టంలో రెవెన్యూ యంత్రాంగమే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది. ఇందులో అప్పీల్ వ్యవస్థ ఉన్న విషయాన్ని రైతులు, ప్రజలకు వివరించండి" అని నిర్దేశించారు. పైలెట్ ప్రాజెక్టు సదస్సులను నారాయణపేట జిల్లా మద్దూర్, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో నిర్వహిస్తారని, వాటికి కలెక్టర్లు హాజరు కావాలని, ఆయా మండలాల్లో ప్రతి గ్రామంలో రెవెన్యూ సిబ్బందితో సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఆయా సదస్సులకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులు హాజరవుతారని తెలిపారు.

### ప్రతి నియోజకవర్గానికో ప్రత్యేకాధికారి

ఇన్‌చార్జి మంత్రులు ఆమోదించిన తర్వాతే ఇందిరమ్మ ఇళ్ల జాబితా ఖరారవుతుందని, గ్రామస్థాయిలో ఆమోదించిన జాబితాను మండల స్థాయి కమిటీలు పరిశీలించాలని, ఆ తర్వాతే ఇన్‌చార్జి మంత్రికి పంపాలని రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రక్రియ పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎస్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఇందిరమ్మ కమిటీలు, మండల కమిటీలు, కలెక్టర్లు, ఇన్‌చార్జి మంత్రి మధ్య ప్రత్యేకాధికారులు సమన్వయకర్తగా ఉంటారన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాకు నియమించిన సీనియర్ అధికారులు ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలని, ఆయా జిల్లాల కలెక్టర్లతో కలిసి పర్యవేక్షించాలని సూచించారు. ఇళ్ల మంజూరులో ఏ దశలోనూ ఎవరూ ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గొద్దని, ఎక్కడైనా అనర్హులకు ఇళ్లు కేటాయిస్తే మండల స్థాయి కమిటీ, ప్రత్యేకాధికారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించినందున జనాభా ప్రాతిపదికన, ఆయా గ్రామాలకు ఇళ్ల కేటాయింపు ఉండాలని, ఈ విషయంలో హేతుబద్ధత పాటించాలని సూచించారు. నిర్దిష్ట గడువు పెట్టుకుని ఇళ్లను నిర్మించాలని, ఇందుకు కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. భూ భారతి చట్టం, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు తీరు ఆధారంగానే పదోన్నతులు, బదిలీలు ఉంటాయని కలెక్టర్లకు సీఎం రేవంత్ స్పష్టం చేశారు. వీటి అమల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మ్యుటేషన్లు, వారసుల మధ్య వివాదాలను పరిష్కరించాలన్నారు.

### పాసుబుక్కుపై భూమి సరిహద్దులతో పటం!

భవిష్యత్తులో పట్టాదారు పాసు పుస్తకాలపై భూమి సరిహద్దులతో కూడిన పటం (మ్యాప్)ను ఉంచాలని ఆలోచిస్తున్నామని కలెక్టర్లతో సీఎం రేవంత్ అన్నట్లు తెలిసింది. దీనిపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నామని తెలిపారు. సర్వేయర్లను నియమించి, వారికి శిక్షణ ఇచ్చిన తర్వాత సరిహద్దులకు సంబంధించిన అంశాలపై స్పష్టత వస్తుందని అన్నట్లు సమాచారం. పాసు బుక్కుల్లోనే భూమి సరిహద్దుతో కూడిన మ్యాప్ ఉంటే వివాదాలు ఉండబోవనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది.

### తాగు నీటి సమస్య రావద్దు

వేసవిలో ఎక్కడా తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్లకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రతి గ్రామంలో తాగు నీటి వనరులు, సరఫరాను డ్యాష్ బోర్డు ద్వారా కలెక్టర్లు పర్యవేక్షించాలని, ఎక్కడైనా సమస్య తలెత్తితే పరిష్కారానికి ప్రత్యామ్నాయ ప్రణాళిక ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని గ్రామాల పేర్లను ప్రస్తావించారు. ఈ సమయంలో.. తన నియోజకవర్గంలోనూ కొన్ని మండలాలు, గ్రామాలకు నీటి సరఫరా లేదని మంత్రి ఉత్తమ్ అన్నారు. పైపులైన్లు, మోటార్లు, బోర్ల మరమత్తులకు కలెక్టర్లకు ఇప్పటికే నిధులు కేటాయించామని, అవసరమైతే మరిన్ని ఇస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ సహా పట్టణ ప్రాంతాల్లో తాగు నీటి సరఫరా మోటార్లు కాలిపోయినప్పుడు లేదా ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు కలెక్టర్లు వెంటనే సీఎస్‌కి సమాచారం అందజేయాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన వాటిని పరిష్కరించే ఏర్పాట్లు చేయాలని సీఎస్‌ను రేవంత్ ఆదేశించారు.

### అవసరమైతే.. ల్యాండ్ ట్రైబ్యునళ్లు

భూ సమస్యల పరిష్కారానికి అవసరమైతే ల్యాండ్ ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తామని, దానిపై కూడా ఆలోచన చేస్తున్నామని కలెక్టర్లతో సీఎం రేవంత్ చెప్పినట్లు తెలిసింది. దీని ఏర్పాటుతో భూ సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. భూ భారతి చట్టానికి సంబంధించి ఏవైనా సందేహాలుంటే వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో సీఎం రేవంత్ నవ్వుతూ మాట్లాడుతూనే.. కలెక్టర్లకు చురకలు అంటించారని తెలిసింది.

# పథకాలపై ప్రజల్లోకి ప్రజాప్రతినిధులు

» జూన్ 2 వరకు విస్తృతంగా కార్యక్రమాలు

» నేడు దిశానిర్దేశం చేయనున్న రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ, పేదలకు సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, భూ భారతి వంటి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది. ఈ కీలకమైన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధుల పైన ఉంచనుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలోని నోవాటెల్ హోటల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్షం సమావేశం జరుగనుంది. ఇందులో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ప్రధానంగా ఎస్సీ వర్గీకరణ, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి వంటి కార్యక్రమాలపైనే ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ అంశాలతో పాటు ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసిన కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యాచరణపై పార్టీ ప్రజాప్రతినిధులకు ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నారు. జూన్ 2 వరకు ఈ కార్యాచరణ ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. దీంతో పాటు రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపైనా చర్చించనున్నట్లు వెల్లడించాయి.

### మే మొదటి వారంలో

# కలెక్టర్ల బదిలీలు?

» ఈసారి పెద్దసంఖ్యలో ఉండే అవకాశం

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మే నెల మొదటి వారంలో కలెక్టర్ల బదిలీలు జరగనున్నాయి. ఈమేరకు ప్రభుత్వం బదిలీలపై కసరత్తు మొదలు పెట్టింది. ఈసారి కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల(స్థానిక సంస్థలు)ను పెద్దసంఖ్యలో బదిలీ చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. 2024 సంవత్సరం జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 20 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఇందులో కొంతమంది అదనపు కలెక్టర్లు, ఇతర సీనియర్ అధికారులు మినహా ఎక్కువ మంది కలెక్టర్లే ఉన్నారు. ఆ తర్వాత అంత పెద్దసంఖ్యలో కలెక్టర్ స్థాయి అధికారులను బదిలీ చేయలేదు. అయితే.. ఇంకా కొన్ని జిల్లాల్లో రెండేళ్లకు మించి కలెక్టర్లు పని చేస్తున్నారు. సాధారణంగా ఒకే జిల్లాలో రెండు... మహా అయితే మూడేళ్ల పాటు కలెక్టర్‌గా కొనసాగుతుంటారు. ఇలా రెండు, మూడేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న కలెక్టర్లను బదిలీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. కొంతమంది జిల్లా కలెక్టర్లపై ఆరోపణలు కూడా ఉన్నాయి. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లాలంటూ పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించిన సంగతి తెలిసిందే. కానీ కొంతమంది కలెక్టర్లు జిల్లా కేంద్రాలను వీడడం లేదని, పైగా.. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యంగా ఉంటున్నారంటూ స్థానిక ఎమ్మెల్యేలు సీఎం దృష్టికి తెచ్చినట్లు తెలిసింది. ఇలాంటి ఫిర్యాదులున్నవారికి బదిలీలు తప్పవని అంటున్నారు. మే నెల మొదటి వారంలో ఈ బదిలీలు జరగనున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది.



సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి పొంగులేటి

# కార్మికులకు కానుక!

## మే డే నుంచి గిగ్ వర్కర్ల భద్రత చట్టం అమలు..

ముసాయిదా బిల్లుపై ప్రజాభిప్రాయం సేకరించండి

దేశానికే మార్గదర్శకంగా ఉండాలి: రేవంత్

ప్రజావాణి అర్జీల తీరును పరిశీలిస్తానని వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన మే డే రోజున గిగ్ వర్కర్లకు భద్రత కల్పించే బిల్లును అమల్లోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్, ట్రాన్స్ పోర్ట్, ప్యాకేజ్ డెలివరీల్లో దాదాపు 4 లక్షల మంది గిగ్ వర్కర్లు పని చేస్తున్నారని, వీరికి సంబంధించిన బిల్లు ముసాయిదాను వెంటనే ప్రజాభిప్రాయానికి అందుబాటులో ఉంచాలని, అన్ని వర్గాల సలహాలు, సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని తుది ముసాయిదాను రూపొందించాలని సూచించారు. అధికారులు పూర్తి సాయిలో కసరత్తు చేసి ఈ నెల 25వ తేదీ నాటికి బిల్లు తుది ముసాయిదాను సిద్ధం చేయాలని నిర్దేశించారు. గిగ్ వర్కర్ల యూనియన్ల ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం సచివాలయంలో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గిగ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత, బీమా, ఇతర హక్కులను కల్పించేలా కార్మిక శాఖ రూపొందించిన తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫామ్ వర్కర్స్ బిల్లులోని అంశాలను అధికారులు సమావేశంలో వివరించారు. దీనిలో పలు మార్పులు చేర్పులను సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. కార్మికుల భద్రతకు ప్రాధాన్యమివ్వటంతోపాటు కంపెనీలు, అగ్రిగేటర్లకు మధ్య సమన్వయంగా కొత్త చట్టం ఉండాలని నిర్దేశించారు. బిల్లు ముసాయిదాను వెంటనే ఆన్‌లైన్‌లో ఉంచి, ప్రజాభిప్రాయాన్ని సేకరించాలని ఆదేశించారు. "గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల భద్రతకు చట్టం తెస్తామని ఎన్నికలకు ముందే హామీ ఇచ్చాం. దేశంలోనే మొదటిసారిగా వారికి ప్రమాద బీమాను అమలు చేశాం. ఎవరైనా మరణిస్తే రూ.5 లక్షల ప్రమాద బీమాను అందించేలా 2023 డిసెంబర్ 30న ఉత్తర్వులు జారీ చేశాం. కొత్తగా అమలు చేసే చట్టం కూడా దేశానికి మార్గదర్శకంగా ఉండాలి" అని సూచించారు. కాగా ముఖ్యమంత్రి సూచనతో ముసాయిదా బిల్లుపై ప్రజాభిప్రాయం, సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు కార్మిక శాఖ ప్రకటన జారీ చేసింది. ఏప్రిల్ 28న సాయంత్రం 5 గంటల వరకు గడువు నిర్దేశించింది. ఈ మేరకు బిల్లు www.labour.telangana.gov.in సైట్‌లో అందుబాటులో ఉందని, ఎవరైనా తమ అభిప్రాయాలను tg.gig.labour@gmail.comకు ఈ-మెయిల్ ద్వారా లేదా 'గిగ్ వర్కర్స్ బిల్లుపై సలహాలు' పేరిట హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఉన్న కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం, టీఏకేఎస్ భవన్‌కు నేరుగా పంపవచ్చని తెలిపింది.

### ప్రజావాణి డ్యాష్ బోర్డును పరిశీలిస్తా

ప్రజావాణి అర్జీల పరిష్కార తీరును తాను ఎప్పటికప్పుడు పరిశీలిస్తానని, అందుకు దాని డ్యాష్ బోర్డు లైవ్ యాక్సెస్ తనకు ఉండేలా ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో తాను ఎక్కడ ఉన్నా ప్రజావాణి అర్జీల పరిష్కారం తీరు, ప్రజల నుంచి ఎలాంటి విజ్ఞప్తులు వస్తున్నాయో తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. అర్జీల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేయటం వేగవంతమవుతుందన్నారు. అలాగే, జిల్లా కేంద్రాల్లో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజా భవన్‌లో జరిగే ప్రజావాణి డ్యాష్ బోర్డుతో అనుసంధానం చేయాలని చెప్పారు. దీంతో మండల, డివిజన్, జిల్లా స్థాయిలో పరిష్కారమయ్యే అంశాలు వెంటనే అక్కడికక్కడే పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రజావాణికి ఇప్పటి వరకు వచ్చిన అర్జీలు, వాటి పరిష్కార తీరుపై ముఖ్యమంత్రి సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రజా భవన్లో ఇప్పటి వరకు 117 సార్లు ప్రజావాణి నిర్వహించామని, 54,619 అర్జీలు వచ్చాయని, వాటిలో 68.4 శాతం (37,384) పరిష్కారమయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వివిధ విభాగాలకు ప్రజావాణిలో ప్రత్యేక డెస్కులు ఏర్పాటు చేశామని, గల్ఫ్ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ప్రవాసీ ప్రజావాణి ఏర్పాటు చేశామని తెలిపారు. అర్జీదారులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. అత్యవసర అర్జీలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని, అంబులెన్స్‌ను కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని పేర్కొన్న సీఎం రేవంత్.. అర్జీల పరిష్కారానికి మరింత పారదర్శక, సమర్థ విధానాలు అమలు చేయాలని సూచించారు. అర్జీల వివరాలతోపాటు ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని నిర్దేశించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, వాటి అమలు పురోగతిని పారదర్శకంగా అందరూ తెలుసుకునేలా ఈ పోర్టల్‌ను రూపొందించాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత భద్రతకు ఇబ్బంది లేకుండా అమల్లో ఉన్న చట్టాల ప్రకారం సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. అధికారుల స్థాయిలో కమిటీ వేసి ఇందుకు మార్గదర్శకాలు రూపొందించాలన్నారు.

## ఏఐజీ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డికి 'లెజెండ్స్ ఆఫ్ ఎండోస్కోపీ' పురస్కారం

- అందజేసిన జపాన్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టులు
- ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకున్న తొలి భారతీయ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు నాగేశ్వర్‌రెడ్డి


లెజెండ్స్ ఆఫ్ ఎండోస్కోపీ అవార్డును స్వీకరిస్తున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఏఐజీ సంస్థల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి.. జపాన్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టుల నుంచి 'లెజెండ్స్ ఆఫ్ ఎండోస్కోపీ' పురస్కారాన్ని అందుకున్నారు. జపాన్‌లోని టోక్యోలో ఉన్న షోవా యూనివర్సిటీ ఆస్పత్రిలో ఇటీవల జరిగిన టోక్యో లైవ్ గ్లోబల్ ఎండోస్కోపీ 2025 కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. షోవా యూనివర్సిటీ కోటో టోయోసు ఆస్పత్రిలోని డైజెస్టివ్ డిసీజెస్ సెంటర్ ప్రొఫెసర్, చైర్మన్ డాక్టర్ హరుహిరో ఇనౌ, జపాన్ గ్యాస్ట్రోఎంటరాలజికల్ ఎండోస్కోపీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ షింజి తనకా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అవార్డును అందుకున్న మొదటి భారతీయ గ్యాస్ట్రోఎంటరాలజిస్టుగా నాగేశ్వర్ రెడ్డి నిలిచారు. గ్యాస్ట్రోఇంటెస్టినల్ (ఏఐ) ఎండోస్కోపీ పురోగతికి డాక్టర్ రెడ్డి చేసిన జీవితకాల కృషికి, ఆవిష్కరణ, శిక్షణ, ఆచరణలో నైపుణ్యం ద్వారా రోగి సంరక్షణను మార్చడంలో ఆయన ప్రపంచవ్యాప్తంగా చూపిన ప్రభావాన్ని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు ఏఐజీ ఆస్పత్రి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ప్రపంచవ్యాప్తంగా ఎండోస్కోపిక్ అభ్యాసాన్ని అభివృద్ధి చేశారని, ఆయన ఆవిష్కరణలు లెక్కలేనన్ని ప్రాణాలను కాపాడాయని, సవాలుతో కూడిన క్లినికల్ పరిస్థితుల్లో రోగులకు ఉపశమనం కలిగించాయని డాక్టర్ హరుహిరో ఇనోయ్ పేర్కొన్నారు. జపాన్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టుల గుర్తింపు పొందడం ఒక గొప్ప గౌరవమని నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ అవార్డు వ్యక్తిగత మైలురాయి కంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎండోస్కోపిస్టుల సహకార స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణకు ప్రైవేటు సైన్యం!

- అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల నివారణకు, అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి నష్టం, ప్రాణ నష్టం తగ్గించేందుకు తీసుకునే చర్యలపై ప్రైవేటు వ్యక్తులకు శిక్షణ అందిస్తున్నట్లు అగ్నిమాపక శాఖ డీజీ వై. నాగిరెడ్డి తెలిపారు. అగ్నిమాపక శాఖ "అమర వీరుల దినోత్సవం" సందర్భంగా సోమవారం వట్టినాగులపల్లిలోని అగ్నిమాపకశాఖ అకాడమీలో అమరవీరుల స్థూపం వద్ద ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ.. ముంబైలో 1944లో ఓడలో జరిగిన ప్రమాదంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది మృతి చెందడంతో అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం ఏప్రిల్‌లో అగ్నిమాపక శాఖ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రైవేటు సంస్థల విజ్ఞప్తి మేరకు అకాడమీలో ప్రైవేటు వ్యక్తులకు ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నామని, ఇప్పటివరకు 1,102 మంది ప్రైవేటు వ్యక్తులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు.

## 29న ఆర్టీసీ కార్మికుల ఛలో బస్‌భవన్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది కొరతతో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపై పనిభారం తగ్గించడానికి కొత్త నియామకాలు చేపట్టడంతోపాటు పలు సమస్యల పరిష్కారానికి 'చలో బస్‌భవన్' కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు టీజీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘం ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ) సోమవారం తెలిపింది. ఈ నెల 29న బస్‌భవన్‌ను ముట్టడిస్తామని ఎస్‌డబ్ల్యూయూ పేర్కొంది. బస్ డిపోల్లో కార్మికులకు కనీస వసతుల కల్పన, 14-16 పని గంటల తగ్గింపు, అక్రమ సస్పెన్షన్ల ఎత్తివేత, ఇంక్రిమెంట్ల రద్దు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ 'చలో బస్‌భవన్' కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించింది.

## సన్నబియ్యం పంపిణీ 88 శాతం పూర్తి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఏప్రిల్ నెల కోటా సన్నబియ్యం పంపిణీ ఇప్పటి వరకు 88 శాతం పూర్తయ్యిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 71,08,186 రేషన్ కార్డుల ద్వారా 1,47,120 టన్నుల సన్నబియ్యాన్ని లబ్ధిదారులు తీసుకున్నారని వెల్లడించారు. ఏప్రిల్ నెల కోటా కింద 1,67,286 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందుబాటులో ఉంచామని, అందులో 88 శాతం కోటా పంపిణీ పూర్తయ్యిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లో సన్నబియ్యం పంపిణీ ఎలాంటి ఆటంకాలు లేకుండా జరుగుతోందని, మిగిలిన లబ్ధిదారులకూ సన్నబియ్యం అందుబాటులో ఉన్నాయని, ఇప్పటికైనా తీసుకోవచ్చని తెలియజేశారు.

## 3,100 కోట్ల మద్యం బకాయిలు చెల్లించండి

- ప్రభుత్వానికి మద్యం తయారీ కంపెనీల సమాఖ్య వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మద్యం తయారీ కంపెనీలకు రావాల్సిన రూ.3100 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని భారత మద్యం తయారీ కంపెనీల సమాఖ్య డైరెక్టర్ జనరల్ అనంత్ ఎస్. అయ్యర్ కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి సోమవారం ఆయన లేఖ రాశారు. గతంలో పోలిస్తే ముడిసరకు ధరలు పెరిగినందున ఇటీవలే బీరు ధరల పెంపునకు అనుమతించిన విధంగానే మద్యం ధరల పెంపునకూ అనుమతించాలని సీఎంను కోరారు.


భక్తులకు అన్నప్రసాదాల వడ్డిస్తున్న అన్నా లెజినోవా

## తిరుమలలో అన్నా లెజినోవా అన్నదానం

- భక్తులకు స్వయంగా వడ్డించిన పవన్ సతీమణి
- కుమారుడి పేరిట అన్నప్రసాదాలకు 17 లక్షల విరాళం

తిరుమల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తమ కుమారుడు మార్క్ శంకర్ పేరిట తిరుమలలో సోమవారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ పథకానికి రూ. 17 లక్షల విరాళం అందజేశారు. అంతేగాక ఆమె స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. తర్వాత భక్తులందరితో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. అంతకుముందు ఆమె సుప్రభాత సేవలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం నుంచి కుమారుడు మార్క్ శంకర్ సురక్షితంగా బయటపడిన నేపథ్యంలో మొక్కులు చెల్లించేందుకు ఆదివారం తిరుమలకు చేరుకున్న ఆమె డిక్లరేషన్‌పై సంతకం చేసి వరాహస్వామిని దర్శించుకుని తలనీలాలు సమర్పించిన విషయం తెలిసిందే. రాత్రికి తిరుమలలోనే బస చేసిన ఆమె సోమవారం వేకువజామున వైకుంఠం క్యూలైన్ ద్వారా స్వామివారి దర్శనానికి వెళ్లారు. రంగనాయక మండపంలో అన్నా లెజినోవాకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు.

# కసిరెడ్డి కోసం ఏపీ పోలీసుల వేట

- లిక్కర్ స్కామ్‌లో 'సిట్' దూకుడు
- హైదరాబాద్‌లోని ఇళ్లు, కార్యాలయంలో సోదాలు
- భార్య డైరెక్టర్‌గా ఉన్న ఆస్పత్రి, అత్త, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో నూ
- 3 సార్లు విచారణకు సిట్ పిలుపు..
- కోర్టు సూచన, సిట్ నోటీసుల్ని లెక్కచేయని జగన్ బంధువు



అమరావతి, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారులకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఉచ్చు బిగిస్తోంది. ఈ క్రమంలో దూకుడు పెంచిన సిట్.. ఈ స్కామ్‌లో కింగ్ పిన్‌గా భావిస్తున్న జగన్ బంధువు.. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(రాజ్ కసిరెడ్డి) కోసం విస్తృతంగా గాలిస్తోంది. ఈ కేసులో తవ్వేకొద్దీ సంచలన విషయాలు బయటపడుతున్నాయి. గత ప్రభుత్వంలో మద్యం కుంభకోణంలో కోట్లాది రూపాయలు వసూలు చేసిన రాజ్ కసిరెడ్డి ఆ సొమ్మును సినిమాలు, ఆస్పత్రుల్లో పెట్టుబడులు పెట్టినట్టు సమాచారం. ఆయన అక్రమాలపై సిట్ అధికారులు కూపీ లాగుతున్నారు. లిక్కర్ స్కామ్ వెలికితీసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ విచారణకు హాజరుకాకుండా ఆయన తప్పించుకుంటున్నారు. సిట్ అధికారులు దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సోమవారం హైదరాబాద్‌లోని రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న ఆయన ఇళ్లు, కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. అదేవిధంగా కసిరెడ్డి బంధువులు, స్నేహితులు, ఆత్మీయుల ఇళ్లలోనూ మొత్తం 15 చోట్ల సోదాలు చేసినట్టు తెలుస్తోంది. హైదరాబాద్‌లోని ఏక్తా హైట్స్‌లో సోదాలు నిర్వహించారు. కసిరెడ్డి భార్య డైరెక్టర్‌గా ఉన్న రాయదుర్గంలోని అరేటి ఆస్పత్రిలో, అలాగే ఆయన అత్త ఇంట్లో సోదాలు చేసినట్టు సమాచారం. కసిరెడ్డి సన్నిహితుడు అవినాశ్ రెడ్డి ఇల్లు, శంకర్‌పల్లి మహారాజ్‌పేటలో అవినాశ్‌రెడ్డి అత్త ఇల్లు, రంగారెడ్డి జిల్లా శ్రీశ్రీ అపార్ట్‌మెంట్స్, మంచిరేవులలో కసిరెడ్డి సన్నిహితుడు ఉపేంద్ర రెడ్డి ఇంట్లో కూడా సోదాలు చేసినట్టు తెలిసింది. మంగళవారం కూడా సిట్ అధికారులు సోదాలు కొనసాగించనున్నారు.

# కాంగ్రెస్‌లో 'విస్తరణ' కుంపటి!

(మొదటిపేజీ తరువాయి)

వాదనలున్నాయి. ఈ ఆలస్యంపై కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి, వివేక్ వెంకటస్వామి ఇప్పటికే తమ అసంతృప్తి వ్యక్తం చేయగా.. మరికొందరు అదేబాట పట్టే ప్రమాదం ఉండడంతో.. విస్తరణకు మరోమారు బ్రేకులు పడవచ్చని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

### వాయిదాల పర్వం..!

రాష్ట్ర క్యాబినెట్‌లో మరో ఆరుగురికి అవకాశం ఉంటుంది. పోటీ తీవ్రంగా ఉండడంతో విస్తరణలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు ఎప్పటికప్పుడు అధిష్ఠానం పెద్దలతో భేటీ అవుతున్నారు. అయితే.. ఆ సమావేశాల్లో ఏకాభిప్రాయం కుదరక.. ప్రతీసారి అధిష్ఠానం నిర్ణయం వాయిదా పడుతోంది. తాజాగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి తమ అభిప్రాయాలు చెప్పివచ్చారు. తాజా భేటీలో రెడ్డి సామాజిక వర్గం నుంచి సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వెలమ సామాజిక వర్గం నుంచి ప్రేమ్‌సాగర్‌రావు, బీసీల నుంచి వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్, విజయశాంతి, మాల సామాజిక వర్గం నుంచి గడ్డం వివేక్ వెంకటస్వామి, అద్దంకి దయాకర్, ముస్లిం వర్గం నుంచి ఆమేర్ అలీఖాన్ తదితర పేర్లపై పరిశీలన జరిగింది. ఉగాదికి లేదా ఏప్రిల్ 2, 3 తేదీల్లో కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఉంటుందని అంతా భావించారు. అంతలోనే పలువురు ఎమ్మెల్యేలు పార్టీ అధిష్ఠానం వద్ద క్యూకట్టారు. మాదిగ సామాజికవర్గానికి న్యాయం చేయాలంటూ విజ్ఞప్తులు చేశారు. లంబాడా వర్గం ఎమ్మెల్యేలు కూడా సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలతోపాటు.. అధిష్ఠానాన్ని కలిసి.. తమ వర్గానికి అవకాశమివ్వాలని కోరారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతోపాటు.. హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని మాజీ మంత్రి జానారెడ్డి ఏకంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. మరికొందరు నేతల మద్దతును ఈ జిల్లాలకు చెందిన మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి కూడగట్టుకున్నారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల నుంచి ఒకరికి మంత్రివర్గంలో చోటివ్వాలని అధిష్ఠానాన్ని కూడా కోరారు. మల్‌రెడ్డి రంగారెడ్డి ఏకంగా.. తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హెచ్చరించారు.

### కోమటిరెడ్డి వ్యాఖ్యలతో రాజుకున్న వేడి

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో రాజకీయ వేడి రాజుకుంది. ఆయన ఏకంగా మాజీ మంత్రి, రాష్ట్ర పార్టీ కురు వృద్ధుడు జానారెడ్డిని టార్గెట్‌గా చేసుకున్నారు. తనకు మంత్రి పదవి రాకుండా జానారెడ్డి అడ్డుపడుతున్నారని, ఆయన రాసిన లేఖ వల్లే ప్రక్రియ ఆలస్యమైందని విమర్శించారు. అధిష్ఠానం తనకు మంత్రి పదవిని స్తానంటే.. కొందరికి చెమటలు పడుతున్నాయని వ్యాఖ్యానించారు. అంతలోనే.. సోమవారం రోజు ప్రేమ్‌సాగర్‌రావు తన అసహనాన్ని వ్యక్తపరిచారు. ఇప్పటికే ఒకే కుటుంబంలో మూడు పదవులున్నాయని, నాలుగో పదవి కూడా ఇస్తారా? అని గడ్డం వివేక్ వెంకటస్వామిని ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు.

### మల్‌రెడ్డిని తీసుకోవాలి: చామల

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. రాష్ట్ర జనాభాలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే సగం మంది ఉంటారని, ఆ రెండు జిల్లాల నుంచి శాసనసభకు ఎన్నికైన ఇబ్రహీంపట్నం ఎంఎల్ఏ మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలన్నారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుతూ ఇబ్రహీంపట్నం కార్యకర్తల వాణిని అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్తానన్నారు.

దీనికి అదేస్థాయిలో గడ్డం వెంకటస్వామి ప్రతిస్పందించారు. తాను కాంగ్రెస్ పార్టీలోకి స్వతహాగా రాలేదని, రేవంత్‌రెడ్డి ఆహ్వానిస్తేనే వచ్చానన్నారు. అందరికీ మంత్రి పదవిపై ఆశ ఉంటుందని, ఆ దిశలో ప్రేమ్ సాగర్‌రావు మాట్లాడి ఉంటారన్నారు. అయితే.. ఆశావహుల అసంతృప్తులు ఇంతటితో ఆగుతాయా? లేదా.. కొనసాగుతాయా? అనేదానిపై మంగళవారం జరగనున్న సీఎల్పీ భేటీ తర్వాత స్పష్టత వస్తుందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### మంత్రి పదవి రాకపోతే దేనికైనా సిద్ధమే: ప్రేమ్ సాగర్‌రావు

మంచిర్యాల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తనకు మంత్రి పదవి రాకపోతే దేన్నికైనా సిద్ధమే అని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని హెచ్చరించారు. సోమవారం మంచిర్యాలలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. మంత్రి పదవి విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం తనకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే పదేళ్లపాటు కాంగ్రెస్ బలోపేతానికి తాను కృషి చేశానని, ఈ క్రమంలో ఎన్నో వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వచ్చిందని చెప్పారు. ఎన్నికల ముందు ఇతర పార్టీల నుంచి వచ్చిన కొందరు మంత్రి పదవుల కోసం ప్రయత్నిస్తూ.. తన గొంతు కోసేందుకు యత్నిస్తున్నారని చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వినోద్‌లను ఉద్దేశించి అన్నారు. ఇప్పటికే ఒకే కుటుంబంలో మూడు పదవులు ఉన్నాయని.. నాలుగో పదవి కూడా ఇస్తారా..? అని ప్రశ్నించారు. నోట్లో నాలుక లేని గిరిజనులు, ఉమ్మడి జిల్లాలోని అమాయక ప్రజల తరఫున తాను గొంతు ఎత్తుతున్నానని.. తనకు అన్యాయం చేస్తే ఆయా వర్గాల ప్రజలకు అన్యాయం చేసినట్లే అని అన్నారు.

## నిల్వలన్నీ తాగునీటికే..!

- సాగర్‌లో పడిపోతున్న నీటి మట్టం
- డెడ్ స్టోరేజీ దిశగా శ్రీశైలం నిల్వలు
- రిజర్వాయర్ల నుంచి సాగుకు నీళ్లు బంద్

హైదరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పడిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నీళ్లు అడుగంటుతున్నాయి. శ్రీశైలం కనీస నీటిమట్టం ఏపీ లెక్కల ప్రకారం 834 అడుగులు కాగా.. తెలంగాణ లెక్కల ప్రకారం 830 అడుగులు. ప్రస్తుత నీటి నిల్వ 817.3 అడుగులుగా ఉంది. ఈ జలాశయంలో 38.86 టీఎంసీల నిల్వ ఉండగా.. డెడ్‌స్టోరేజీ పైన 9.8 టీఎంసీలు మాత్రమే ఉంది. తాగునీటి అవసరాల కోసం జూలై వరకు 2.75 టీఎంసీల నీరు కావాలని అంచనా వేశారు. తెలుగు రాష్ట్రాలు జాగ్రత్తగా నీటిని వాడుకుంటే ఈ సీజన్ (జూన్) దాకా తాగునీటి అవసరాలకు శ్రీశైలం కింద ఇబ్బందులేమీ ఉండవని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం 140.85 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఈ జలాశయం కనీస నీటిమట్టం 510 అడుగులు కాగా.. ప్రస్తుత మట్టం 515.81 అడుగులుగా ఉంది. హైదరాబాద్ జంట నగరాల తాగునీటి అవసరాల కోసం పుట్టంగండి వద్ద 510 అడుగుల దాకా పంపింగ్ చేయడానికి ఆస్కారం ఉంది. ఆ తర్వాత అత్యవసర పంపింగ్ చేయాల్సి ఉంటుంది. కనీస నీటిమట్టం పైన 9.3 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అయితే తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీలు కేటాయించాలని ఏపీ కోరుతోంది. కాగా, నాగార్జునసాగర్‌లో షెడ్యూల్ ప్రకారం ఈ నెల 23 దాకా సాగుకు నీళ్లు ఇవ్వాలి. అయితే ప్రాజెక్టు కింద యాసంగిలో వేసిన పంటలన్నీ చేతికి రావడం.. నీటి నిల్వలు తగ్గిపోవడంతో ఎడమ కాల్వ (తెలంగాణ) వైపు నీటిని షెడ్యూల్ కన్నా ముందే ఆపేశారు. తెలంగాణ ఒత్తిడితో కుడి కాలువ (ఏపీ)కూ నీటి విడుదల ఆగింది. ఇక తాజాగా తాగునీటి అవసరాల కోసం 10 టీఎంసీలు కావాలని కృష్ణా బోర్డుకు ఏపీ ఇండెంట్ పెట్టడాన్ని.. తెలంగాణ తప్పుపడుతోంది.

## ఉత్తరాంధ్రలో మైనింగ్ డాన్!

- మొన్నటిదాకా చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీ ఓనర్
- నేడు గనులశాఖలో రాజాధిరాజుగా అజయ్
- కన్నుపడిందంటే ఏదో కంపెనీకి మూడినట్లే
- తొలుత విజిలెన్స్ దాడులు.. సెటిల్‌మెంట్లు
- రేపు 64 కంపెనీలపై విజిలెన్స్ కేసుల విచారణ

అమరావతి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నిన్నమొన్నటి వరకు హైదరాబాద్‌లో ఓ చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీని నడిపిన వ్యక్తి ఇప్పుడు ఉత్తరాంధ్రలో మైనింగ్ డాన్ అయ్యాడు. పేరు అజయ్..! గతంలో విదేశీ ఉద్యోగాల పేరుతో యువతకు కుచ్చుటోపీ పెట్టిన కేసుల్లో నిందితుడు. ఇప్పుడు గనులపై కన్నేశాడు. ప్రభుత్వంలో పెద్దల పేరు వాడుకుంటూ.. భారీ పెనాల్టీ పడ్డ ఓ గ్రానైట్ కంపెనీ విషయంలో సెటిల్మెంట్ చేశాడు. ఆ తర్వాత ఆ కంపెనీని హస్తగతం చేసుకున్నాడు. అక్కడి నుంచి ఒక్కో కంపెనీపై కన్నేస్తూ దూసుకెళ్తుండగా.. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారు. దాంతో.. ఇప్పుడు మైనింగ్ కంపెనీలపై ఉన్న కేసుల రివిజన్‌పై పడ్డాడు. బుధవారం ఒకేసారి 64 కేసుల విచారణను సింగిల్ టేక్‌లో సెటిల్ చేసేందుకు సన్నద్ధమయ్యాడు. బందరుకు చెందిన ఓ కీలక టీడీపీ నేత ఆరాధించే ఆధ్యాత్మిక గురువు సిఫారసుతో అజయ్ గనుల శాఖలో అడుగు పెట్టి.. సెటిల్మెంట్లు మొదలెట్టాడు. తాను టార్గెట్‌గా చేసుకున్న గనుల కంపెనీని వ్యూహాత్మకంగా హస్తగతం చేసుకోవడం ఇతని స్టైల్. తొలుత విజిలెన్స్ దాడులు చేయించి, ఆ తర్వాత సెటిల్మెంట్ చేస్తాడు. సెటిల్మెంట్ ప్రకారం.. అయితే కంపెనీని హస్తగతం చేసుకోవడం.. లేదంటే లాభాల్లో వాటాను కొట్టేయడం ఇతని నేర్పైలి. కర్ణాటకకు చెందిన ఓ గ్రానైట్ వ్యాపారికి చిత్తూరు, విశాఖ జిల్లాల్లో మూడు గ్రానైట్ మైన్స్ లీజులు, పరిశ్రమలున్నాయి. అజయ్ ఆ వ్యాపారికి చెందిన విశాఖ జిల్లాలోని రెండు మైనింగ్ లీజులను కొట్టేశాడు. ఇలా.. అజయ్ ఉత్తరాంధ్రలో కొన్ని గ్రానైట్ గనుల లీజులను అక్రమ మార్గాల్లో దక్కించుకోవడం గమనార్హం.! ఇదే విధంగా నర్సీపట్నం గని విషయంలో విజిలెన్స్‌తో దాడి చేయించగా.. విషయం ఢిల్లీకి.. అక్కడి నుంచి ఏపీ సీఎం చంద్రబాబు దాకా చేరింది.

## మహిళ ఫిర్యాదుతో అఘోరీపై కేసు

శంకర్‌పల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఒక అఘోరీ తనను మోసగించాడని రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులోని ప్రగతి రిసార్ట్‌లో నివసించే ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు అఘోరీ (శివవిష్ణు బ్రహ్మ అల్లూరి శ్రీనివాస్)కు, సదరు మహిళకు మధ్య పరిచయం ఏర్పడింది. రిసార్ట్‌లో ఆ మహిళ నివాసం ఉన్న ఇంటికి వచ్చి మరీ అఘోరీ పూజలు చేశారు. ఆ మహిళను ఉజ్జయినికి తీసుకెళ్లి అక్కడా పూజలు చేయించారు. ఇలా పూజలు చేసినందుకు మహిళ నుంచి రూ.9.80 లక్షల నగదు తీసుకున్నారు. తర్వాత ఏం జరిగిందో తెలియదు గానీ అఘోరీ తనను మోసగించిందని గత ఫిబ్రవరి 25న మోకిల పోలీస్ స్టేషన్‌లో బాధిత మహిళ ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసినా.. ఆ సంగతి గోప్యంగా ఉంచారు.

# అనూహ్యంగా మారిపోతున్న వాతావరణం

### ఠారెత్తిస్తున్న ఎండలు.. పిడుగులతో వర్షాలు.. తీవ్రంగా నష్టపోతున్న రైతాంగం

- గ్లోబల్ వార్మింగ్‌తో రికార్డు ఉష్ణోగ్రతలు
- వచ్చే నెల్లో 50డిగ్రీలు దాటొచ్చని అంచనా
- వాతావరణ మార్పులతో ఆందోళన




(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

చైత్రం ప్రారంభంలోనే మాడుపగిలే ఎండలు కాస్తున్నాయి. ఇదే సమయంలో నిమిషాల వ్యవధిలో కారుమబ్బులు కమ్ముకుని ఈదురుగాలులు, మెరుపులు, ఉరుములు పిడుగులతో ఒక్కసారిగా వాతావరణం మారిపోతోంది. ఆరుబయట ప్రధానంగా పొలాల్లో పనిచేసే కూలీలు, రైతులు, పశువులు, కాపరులు పిడుగులకు మృత్యువాత పడుతున్నారు. అనూహ్యంగా మారిపోతున్న వాతావరణంతో పంట నష్టంతో పాటు ప్రాణ నష్టం వాటిల్లుతోంది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంటోంది. అసాధారణ వాతావరణ మార్పులపై అందుబాటులోకి వచ్చిన 'నౌకాస్టు' విధానంలో హెచ్చరికలు జారీచేస్తున్నా ఉపశమనం లభించడం లేదు. సాధారణంగా మే నెలలో ఎండ తీవ్రతకు వాతావరణ అనిశ్చితి నెలకొని ఈదురుగాలులు వీస్తుంటాయి. పిడుగులతో వడగళ్ల వానలు కురుస్తుంటాయి. అటువంటిది గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో మార్చి, ఏప్రిల్ నెలల్లోనే అసాధారణంగా ఎండలు పెరిగి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత నెలలో దేశంలో అనేకచోట్ల 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే తీవ్రత రోజుల తరబడి కొనసాగుతూనే ఉంది. వచ్చే నెలలో కొన్నిచోట్ల 50 డిగ్రీల మార్కుకు ఉష్ణోగ్రతలు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వచ్చే నెలలో కురిసే అకాల వర్షాలు మరింత కలవరపెడతాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం వాతావరణ విభాగం విశ్రాంత ఆచార్యుడు ఓఎస్ఆర్‌యూ భాను కుమార్ హెచ్చరించారు.

### క్యుములోనింబస్ మేఘాలు, పిడుగులు

వేసవి తీవ్రత పెరిగేకొద్దీ పొడిగాలి, తడిగాలి (తేమతో ఉండేది) ఒకచోట కలుస్తాయి. పొడిగాలి ఒత్తిడితో తడిగాలి పైకి లేచి క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడతాయి. భూఉపరితలం నుంచి మేఘాలు పైకి వెళ్లే కొద్దీ దాంట్లో ఉష్ణోగ్రతలు తగ్గి.. ఆరు కిలోమీటర్లు దాటిన తరువాత మైనస్ డిగ్రీలు ఉంటుంది. దీంతో మేఘాల్లో మంచు గడ్డలు ఏర్పడతాయి. అలా 12 నుంచి 13 కిలోమీటర్లు ఎత్తు వరకు మేఘాల్లో మైనస్ 80 డిగ్రీలు ఉంటుంది. ఆరు కిలోమీటర్లు దాటిన తరువాత మంచు గడ్డల వల్ల మేఘాల బరువు పెరిగి, 12 నుంచి 13 కి.మీ.కు వెళ్లేసరికి బరువు భరించలేక ఆ మేఘాలు విచ్ఛిన్నమవుతాయి. దీనినే క్లౌడ్ బరస్ట్ అంటారు. ఆ క్షణాల్లో ప్రచండ వేగంతో గాలులు వీస్తాయి. అప్పుడే కళ్లు మిరుమిట్లు గొలిపేలా మెరుపులు, ఉరుములు సంభవిస్తాయి. పిడుగులు పడతాయి. ఇదంతా ఐదు నిమిషాలకు అటుఇటుగా ముగిసి భారీ వర్షం ప్రారంభమవుతుంది పైనున్న మంచుగడ్డలు కింద పడేటప్పుడు కొన్ని కరిగిపోగా మిగిలినవి వడగళ్లుగా భూమిపై పడతాయి. మొత్తం ప్రక్రియ గంటలోపే ముగుస్తోంది. క్యుములోనింబస్ మేఘాలు ఉధృతంగా ఉన్నప్పుడు ప్రజలు ఆరుబయట సంచరించవద్దని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## పొద్దంతా ఎండ.. సాయంత్రం వాన!

- రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం
- నేడు, రేపు వానలు.. ఎండల తీవ్రత పైనా అధికారుల హెచ్చరికలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పొద్దంతా భరించలేని ఎండలు కొడుతుంటే.. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం మారుతోంది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వానలు పడుతున్నాయి. ఏదేమైనా జనానికి ఉక్కపోత బాధ తప్పట్లేదు.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి మొదలుకుంటే అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సోమవారం దాదాపు అన్ని జిల్లాల్లోనూ 40-44 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే కొన్ని జిల్లాల్లో పడిన వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోగా.. పలు పంటలకు నష్టం వాటిల్లింది. జగిత్యాల జిల్లా గోదూర్‌లో అత్యధికంగా 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మంచిర్యాల జిల్లా హాజీపూర్‌లో 43.1, అదే జిల్లా వెల్గనూర్‌లో 43, సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్‌లో 42.9, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో 42.3 డిగ్రీలుగా రికార్డయింది. ఇటు ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో వడగండ్ల వాన, ఈదురుగాలులతో పొలాల్లో ధాన్యం నేలరాలింది. పలుచోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకూలి కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలో ఈదురుగాలులకు పొలాల్లో వడ్లు, తోటల్లో మామిడి కాయలు రాలిపోయాయి. ఇటు గ్రేటర్ హైదరాబాద్‌లో అక్కడక్కడ జల్లులు కురిశాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం సాయంత్రం పలు మండలాల్లో 1-3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంగళ, బుధవారాల్లో పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా మంగళవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి, నాగర్‌కర్నూల్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. అయితే ఎండల తీవ్రత కూడా పెరుగుతుందని పలు జిల్లాల పరిధిలో సంబంధిత అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## మిల్లుకు రూ.కోటి వసూలు

- హుజూర్‌నగర్‌లో సీఎం సభకు చందాలు
- మిల్లర్లతో కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్మక్కు
- అందుకే ధాన్యం ధరల తగ్గింపు: జగదీశ్ రెడ్డి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సభకు జిల్లాలోని ఒక్కో మిల్లు నుండి రూ.కోటి చొప్పున వసూలు చేశారని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కైందని, అందుకే బస్తా ధాన్యం ధర రూ.1,200-1,500 అంటున్నారని విమర్శించారు. సన్నబియ్యం పంపిణీ సందర్భంగా గత నెలలో హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సభ కోసం కాంగ్రెస్ నాయకులు మిల్లుకు రూ.కోటి చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. మిల్లర్లు, ప్రభుత్వం కుమ్మక్కవడంతో కనీస మద్దతు ధర రూ.2,320, బోనస్ రూ.500 కలిపి రూ.2,820 రావాల్సి ఉండగా.. తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారిలా ప్రవర్తిస్తూ.. భూమి కనపడితే చాలు అమ్మేద్దామనే ప్రయత్నం చేస్తున్నారని, మంత్రులు కూడా అదే దారిలో దందా చేస్తున్నారని ఆరోపించారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.